అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 14-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 133 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + (వెబ్‌లో సోపతి) | వెల : 8.00

మోడీ పాలనలో దాడులు పెరిగాయి



మణిపూర్ హింసపై క్యాథలిక్కుల ఆందోళన

వివరాలు 5లో

విద్వేష రాజకీయాలను తిప్పికొట్టారు : రాహుల్ గాంధీ


విద్వేష రాజకీయాలను కర్నాటక ప్రజలు తిప్పి కొట్టారని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. కర్నాటక ఫలితాలే అన్ని రాష్ట్రాల్లో రిపీట్ అవుతాయని చెప్పారు. ఇది బలవంతులపై బలహీనుల విజయమని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మొదటి రోజే అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో తాము ప్రేమతో పోటీ చేశాం తప్ప.. ద్వేషంతో కాదని పేర్కొన్నారు. కర్నాటక ప్రజలకు, గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు రాహుల్ గాంధీ ధన్యవాదాలు తెలిపారు.

నిర్ణయాత్మక తీర్పు ! : సీపీఐ(ఎం)

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని రాష్ట్ర ప్రజలు నిర్ణయాత్మకంగా తిరస్కరించారని, బీజేపీ ప్రభుత్వం పాల్పడిన దారుణమైన అవినీతి, అసమర్థపాలన తాలుకూ ఫలితం ఈ ఓటమి అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో విమర్శించింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని మోడీ నేతృత్వంలో సాగిన తీవ్రమైన మత ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని ఈ తీర్పు రుజువు చేసింది. ప్రభుత్వం పట్ల తీవ్రంగా వున్న వ్యతిరేకత కాంగ్రెస్‌కు బాగా కలిసి రాగా, అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిందని పేర్కొంది. బీజేపీకి వ్యతిరేకంగా బలమైన తీర్పునిచ్చిన కర్నాటక ప్రజలను పొలిట్‌బ్యూరో అభినందించింది.

కాంగ్రెస్‌కు ఇది భారీ విజయం : సిద్ధరామయ్య

కర్నాటక ఎన్నిలక ఫలితాలు కాంగ్రెస్‌కు ఒక పెద్ద విజయమని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అగ్రనాయకులు సిద్ధరామయ్య అన్నారు. ఇది ప్రధాని మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయాధ్యక్షుడు జె.పి నడ్డాకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పు అని తెలిపారు. నేడు(ఆదివారం) కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ మీటింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ 130 సీట్లు సాధిస్తుందని తాను అంచనా వేశాననీ, ఆ మార్కును పార్టీ చేరుకున్నదని అన్నారు. " ఈ ఎన్నికలు కీలకమైనవి. ఈ ఫలితం లోక్‌సభ ఎన్నికలకు గీటురాయి. బీజేపీని ఓడించేందుకు బీజేపీయేతర పార్టీలన్నీ ఏకతాటిపైకి వస్తాయని ఆశిస్తున్నాను. రాహుల్ గాంధీ కూడా ఈ దేశానికి ప్రధాని అవుతారని నేను ఆశిస్తున్నాను" అని సిద్ధరామయ్య అన్నారు.



బీజేపీ విద్వేష రాజకీయాన్ని కన్నడ ఓటర్లు తిరస్కరించారు. కర్నాటకలో హిందుత్వ పేరుతో ఆపార్టీ చేసిన వికృత చేష్టలను బ్యాలెట్ బాక్సుల తీర్పు ద్వారా కన్నడిగులు తిప్పికొట్టారు. గడచిన 34 ఏండ్లలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్‌కు పూర్తిస్థాయి మెజారిటీ ఇచ్చి అధికారాన్ని కట్టబెట్టారు. కేవలం వ్యక్తి పూజతో మోడీని ఆకాశానికెత్తి ఓట్లు దండుకోవాలనే ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనల్ని కర్నాటక ఓటరు పట్టించుకోలేదు. ప్రధాని మోడీ చరిష్మా కరిగిపోయిందని ఈ ఎన్నికలతో తేలిపోయింది. కర్నాటకలో మరోసారి విజయం సాధించి, క్రమంగా దక్షిణాదిని ఆక్రమించాలనే మోడీ, అమిత్ షా ద్వయం ఆశలు ఆవిరయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ కన్నడ తీర్పు పునరావృతం అవుతుందంటూ కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షపార్టీలు అంచనా వేస్తున్నాయి. ఈ ఫలితాలతో దేశ రాజకీయాల్లో అనేక మార్పులు సంభవించే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్‌లో సాధించిన విజయానికి ఇది కొనసాగింపు మాత్రమే. ఈ ఎన్నికల ప్రభావం కచ్చితంగా తెలంగాణ రాజకీయాలపైనా ఉంటుందనే విశ్లేషణలు మొదలయ్యాయి. ఇక్కడ పాగా వేయాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ఓటర్లు సమర్థవంతంగా తిప్పికొడతారనే భరోసాను అధికార బీఆర్ఎస్ పార్టీ వ్యక్తం చేసింది. బీఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమనే సంకేతాలను కర్నాటక ఫలితాలు వెల్లడించాయని కాంగ్రెస్ స్పష్టం చేస్తున్నది. ఏదేమైనా కన్నడిగుల తీర్పు దేశ రాజకీయాలను గట్టిగానే ప్రభావితం చేస్తుంది. అయితే ఈ ఓటమిని సహించలేని బీజేపీ ప్రజల్ని చీల్చేందుకు మరిన్ని ప్రమాదకర నిర్ణయాలు తీసుకొనే అవకాశాలు లేకపోలేదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



వాడిన కమలం

కర్నాటక కాంగ్రెస్‌దే

136 స్థానాలతో జయభేరి

12 మంది మంత్రుల ఓటమి

- 31 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయిన బీజేపీ
- జేడీ (ఎస్) ఆశలు గల్లంతు
- 'గాలి'కి కొట్టుకుపోయిన కేఆర్‌పీపీ
- నేడు కేసీఎల్‌పీ భేటీ



కర్నాటక ఫలితాలు

స్థానాలు 224	2018	2023
కాంగ్రెస్	80	136
బీజేపీ	104	65
జేడీఎస్	37	19
స్వతంత్రులు	1	2
ఇతరులు	2	2

బెంగళూరు : కర్నాటకలో 'కమలం' వాడిపోయింది. మోడీ గారడీలు, ఆ పార్టీ కుటిల యత్నాలు ఏవీ పని చేయలేదు. ఎన్నికలలో మరోసారి విజయం సాధించి దక్షిణాదిలో బలోపేతానికి పునాదులు వేయాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ఓటర్లు మాత్రం అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీని చావుదెబ్బ కొట్టి విలక్షణమైన తీర్పు ఇచ్చారు. ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు ఫలితాల సరళి స్పష్టం చేస్తున్నా ఆశ చావని కమలనాథులు జేడీ (ఎస్) నేత కుమారస్వామితో మంత నాలు మొద లెట్టారు. హంగ్ ఏర్పడితే సంకీర్ణ ప్రభు త్వాన్ని ఏర్పాటు చేయొచ్చన్న అత్యాశతో 'ప్లాన్ బీ' అమలుకు ప్రయత్నాలు జరిపారు. అయితే చివరికి కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ లభించడంతో బీజేపీ నేతలు నిరాశానిస్పృహలలో మునిగిపో యారు. కర్నాటక పట్టణ ప్రాంతాలలో బీజేపీ తన పట్టును కొంతమేర నిలుపు కున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల ప్రజానీకం మాత్రం కాంగ్రెస్‌కే జై కొట్టారు. 1990 తర్వాత ఏ పార్టీకీ ఇవ్వనంత మెజారిటీ ఇచ్చి అధికారాన్ని కట్టబెట్టారు. 'కింగ్ మేకర్ కాదు. మేమే కింగ్ అవుతాము' అంటూ బీరాలు పలికిన జేడీ (ఎస్)... 5లో

బలమైన రాజకీయ ప్రతిఘటనతో తుడిచిపెట్టుకుపోయిన మెజారిటీవాదం !

న్యూఢిల్లీ : ప్రభావవంతమైన ప్రాంతీయ నేతలు ప్రజల ప్రాథమిక సమస్యలను తెరపైకి తీసుకురాగలిగి నట్లైతే మోడీ అయినా ఓడిపోక తప్పదని కర్నాటకలో బిజెపి ఓటమి రుజువు చేసింది. కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ 136 స్థానాలు గెలుచు కుని తిరుగులేని విజయాన్ని సాధించింది. కేవలం 65స్థానాలకే బిజెపి పరిమితమమైంది. కర్నాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఉదయమే ఓటమిని అంగీకరించారు. "స్వయంగా ప్రధాని మోడీ, బిజెపి కార్యకర్తలు తీవ్రంగా కృషి చేసినా, మేం కనీసం సగం సీట్లను కూడా సాధించలేకపో యాం. ఈ ఫలితాలపై కచ్చితంగా సవివరమైన విశ్లేషణ చేయాలి." అని బొమ్మై వ్యాఖ్యానించారు. ...2లో

తెలంగాణలోనూ ఇవే ఫలితాలు



కర్నాటక ఫలితాలే తెలంగాణలో పునరా వృతం కాబోతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని పేర్కొన్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా ప్రభావం చూపుతాయని అన్నారు. భారత్ జోడోయాత్రతో కాంగ్రెస్‌లో జోష్ వచ్చింద న్నారు. జోడో యాత్ర తర్వాత కాంగ్రెస్ వరుస విజయాలు సాధిస్తోందని ధీమా వ్యక్తం ... 2లో

ఇక్కడ పనిచేయదు



కర్నాటక ఫలితాలు తెలంగాణపై ఎలాంటి ప్రభావం చూపబోవని మంత్రి కేటీఆర్ అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ విజయం నేపథ్యంలో ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు. విభజనవాద రాజకీయాలను తిరస్కరించిన కర్నాటకవాసులకు ధన్యవాదాలు చెప్పారు. హైదరాబాద్, బెంగళూరుల మధ్య ఆరోగ్యకరమైన... 5లో

మోడీకి ప్రజలు బుద్ధి చెప్పారు..



కేంద్రంలో మోడీ ప్రభుత్వ దుర్మార్గపూరిత చర్యలకు కర్నాటక ప్రజలు తగిన బుద్ధి చెప్పారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. కర్నాటక ఎన్నికల్లో బీజేపీ అవినీతికి ఆలవాలంగా నిలిచిందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రభుత్వ నిధులు 40 శాతం పక్కదోవ పట్టడంతో ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారన్నారు. కర్నాటక ఎన్నికల్లో మోడీ ప్రచారంలో భాగంగా 'జై భజరంగబలి' అంటూ నినాదాలు ఇస్తూ మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయాలనే కుట్రపూరిత చర్యలకు పాల్పడటాన్ని ఖండించారు.

జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా

ఐక్య విద్యార్థి పోరాటం

12 విద్యార్థి సంఘాల పిలుపు



న్యూఢిల్లీ : జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా ఐక్య విద్యార్థి పోరాటానికి విద్యార్థి సంఘాలు పిలుపు ఇచ్చాయి. ప్రజాస్వామ్య ప్రగతిశీల, లౌకిక విద్యార్థి సంఘాలను ఏకం చేయడానికి శనివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. దేశంలోని పది ప్రముఖ విద్యార్థి సంఘాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కేంద్రీకరణ, కాషాయీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా ఐక్య విద్యార్థి ఉద్యమ ప్రాముఖ్యతపై చర్చించారు. విద్యా విధానంలో రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే, విద్యార్థి వ్యతిరేక ఎన్ఈపీ విధానాన్ని అప్రజాస్వామికంగా అమలు చేయడాన్ని నిరసిస్తూ ఉమ్మడి ఆందోళన చేపట్టాలని సంఘాల నేతలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఫీజుల పెంపు, పాఠశాలల మూసివేత, ఉపకార వేతనాల కోత, నిరుద్యోగం, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం, కేంద్ర విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు, ఒకే భాష, సంస్కృతి అమలు వంటి పలు కీలక అంశాలపై ... 5లో

భానుడి భగభగ

తీవ్రమైన ఉక్కపోత

- వీణవంకలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత
- లీటర్లకొద్ది నీళ్లుతాగినా తీరని దాహం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భానుడు భగభగ మండిపోతున్నాడు. ఎండతో హడలెత్తిస్తున్నాడు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తన ప్రతాపాన్ని తీవ్రస్థాయిలో చూపుతున్నాడు. పది దాటితో ఇంట్లో నుంచి కాలు బయటపెడితే మాడ పగలగొట్టేస్తున్నాడు. లీటర్ల కొద్దీ నీళ్ల తాగినా దాహం తీరట్లేదు. మరోవైపు ఉక్కపోత తీవ్రతరం అయ్యింది. దీంతో ప్రజలు ఎండవేడిమి తాళలేక హడలిపోతున్నారు. శనివారం కరీంనగర్ జిల్లా వీణవంకలో 45.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇదే అత్యధికం. రాబోయే మూడు నాలుగు రోజుల పాటు కూడా ఎండలు దంచికొట్టే అవకాశముంది. ఉష్ణోగ్రతలు కూడా ఇప్పుడున్నదానికంటే 2 నుంచి నాలుగు డిగ్రీల మేర పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే మూడునాలుగు రోజులు రాష్ట్రంలో పొడివాతావరణం ఉంటుంది. ఆదివారం కూడా కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్, జగిత్యాల, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, మంచిర్యాల, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా... 5లో

జూన్ 2 నుంచి రాష్ట్రావతరణ

దశాబ్ది ఉత్సవాలు

మూడు వారాలపాటు నిర్వహణ

- సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ : సీఎం కేసీఆర్ నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరపాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. సలహాదారులు, ఉన్నతాధికారులతో శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమైన ఆయన... వేడుకల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి హృదయం ఉప్పొంగేలా, తెలంగాణ ఘనకీర్తి దశదిశలా చాటే విధంగా వేడుకలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో సచివాలయంలో మొదటి రోజు వేడుకలు ప్రారంభమవుతాయి. అదే రోజు మంత్రులు తమ తమ జిల్లా కేంద్రాల్లో ఉత్సవాలను ప్రారంభిస్తారు. అమరవీరులను స్మరించుకునేందుకు ఒకరోజును ప్రత్యేకంగా మార్టియర్స్ డేగా నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అమరుల స్థూపాలను పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి, గ్రామ గ్రామాన తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ నివాళులర్పిస్తారు. స్వతంత్ర భారత దేశంలో తెలంగాణ కోసం సాగిన తొలిదశ ఉద్యమం మొదలు, రాష్ట్రాన్ని సాధించే వరకూ సాగిన ఉద్యమ చరిత్రను తెలిపేలా డాక్యుమెంటరీని రూపొందించాలని సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఒక రాష్ట్రంగా ఏర్పడి ప్రభుత్వ పాలన ప్రారంభమైన 2014 జూన్ 2వ తేదీ నుంచి.. 2023 జూన్ 2 వరకు స్వయం పాలనలో సాగిన సుపరిపాలన, సాధించిన ప్రగతిపై మరో డాక్యుమెంటరీ రూపొందించాలని ఆయన సూచించారు. 21 రోజుల పాటు తెలంగాణ సంబురాలు నిర్వహించాలన్న కేసీఆర్.. పిండి వంటలు, ఆటపాటలు, కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, జానపదాలు, సంగీత విభావరి, సినిమా-జానపద కళాకారులతో ప్రదర్శనలు, సంగీతం, నత్యం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

శుద్ధ అబద్ధం

పూ్యరిఫైడ్ వాటర్ పేరుతో దందా

- భగీరథ నీళ్లొస్తున్నా.. పూ్యరిఫైడ్ నీటికే జనం తహతహ
- గల్లీగల్లీకి వెలిసిన ప్లాంట్లు
- అపరిశుభ్రత వాతావరణంలో ప్లాంట్ల నిర్వహణ
- ఆ నీళ్లు ఆరోగ్యాన్ని చెడగొట్టేవంటున్న వైద్యులు
- తనిఖీలు చేయని అధికారులు





నవతెలంగాణ - కరీంనగర్‌ప్రాంతీయ ప్రతినిధి

ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఫిల్టర్ వాటర్ ప్లాంట్ కరీంనగర్ జిల్లా కేంద్రం అల్గునూర్‌లోనిది. ఈ ప్లాంట్ మిషనరీ చుట్టూ పాకురుతో నిండిన నీళ్లు, దుమ్ముధూళి సహా కనీస పరిశుభ్రత లేదు. ఆ ట్యాంకులను ఏర్పాటు చేసిననాటి నుంచి శుభ్రం చేయరు. కనీస పరిశు భ్రత కూడా లేని ఇక్కడి నీళ్ల తాగితే.. ఏ రోగాలు వస్తాయో తెలియని దుస్థితి. డబ్బులు ఇచ్చి మరీ అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్న పరిస్థితి.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో చాలా ప్లాంట్లలో సాగుతున్నది ఇదే. ప్లాంట్ల చుట్టూ అపరిశుభ్ర పరిస్థితులు.. సరిగా శుభ్రం చేయని ట్యాంకులు, పైపులు.. నామ్‌కేవాస్తేగా పైపైన కడిగి నీటు నింపే బబుల్స్.. కొన్నిచోట్ల మురుగునీరు పారుతున్నా ఆ పక్కనే కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లు.. ప్రమాదకర బ్యాక్టీరియా, ఫంగస్‌లకు నిలయాలుగా ఉన్నాయి. నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టించుకోనితనం కలిసి జనం ఆరోగ్యానికి ముప్పు తెచ్చిపెడుతున్న దుస్థితి నెలకొంది. పట్టణాల్లోనే కాదు గ్రామాల్లోనూ ఈ వాటర్ ప్లాంట్లు వెలిశాయి. శుభ్రమైన భగీరథ నీళ్లు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. జనం ప్లాంట్ల నీటికే తహతహలాడుతుండటం గమనార్హం. అధికారులు వాటివైపు కన్నెత్తి చూడరు. ఏదైనా జరిగితే ఆ రోజు హడావుడి తప్ప మరుసటి రోజు ఏమీ ఉండదు. ప్లాంట్లపై కరీంనగర్‌లో 'నవతెలంగాణ' ప్రత్యేకంగా పరిశీలించింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 14 మున్సిపాలిటీలు, రెండు కార్పొరేషన్లు సహా 60 మండలాల్లో 1203 పంచాయతీలు ఉన్నాయి. అత్యధిక ... 5లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు వంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

బలమైన రాజకీయ ప్రతిఘటనతో
తుడిచిపెట్టుకుపోయిన మెజారిటీవాదం !

(మొదటిపేజీ తరువాయి)

పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేకత

కర్ణాటకలో బిజెపి నుండి కాంగ్రెస్ అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ముందు నుంచే చాలా మంది భావించారు. అయితే, ఇక్కడ దీని జాతీయ పర్యవసానాలు మరింత కీలకం కానున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల కొరకు జరిగే ఎన్నికల ప్రచారాన్ని కర్ణాటక ఫలితాలు తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.

ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగి అవిశ్రాంతంగా ప్రచారం చేసి పాటు పడినప్పటికీ, ముంచుకొస్తున్న వ్యతిరేకతను అధిగమించలేకపోయారు. పలుసార్లు రోడ్ షోలు నిర్వహించడం ద్వారా మోడీ తమ పార్టీకి ఎక్కువ ఓట్లు తీసుకువస్తారని బిజెపి గట్టిగా నమ్మింది. కానీ అందుకు విరుద్ధంగా దేశం దిగ్భ్రాంతితో చూస్తుండగా, ఆ ఎన్నికల ప్రచారం హనుమాన్‌ను బజరంగ్‌దళ్‌తో సమాన పరిచే స్థాయికి దిగజారిపోయింది. ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో జై బజరంగ్‌దళ్ అని నినదించాలంటూ మోడీ ఓటర్లకు ఉద్బోధించారు. వాస్తవానికి, ఈనాటికీ కర్ణాటకలో బిజెపికి భారీగానే ఓటు వాటా వుంది. కానీ నిర్ణయాత్మకమైన ప్రజా తీర్పును కాంగ్రెస్ గెలుచుకుంది.

మతపరమైన నినాదాలతో ఫలితం లేదు

బిజెపికి ఓట్లు రాబట్టడానికి మోడీ లేవనెత్తిన మతపరమైన నినాదం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, 1951నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించింది. రాజకీయ నేతలు, పార్టీలు మతం పేరుతో ఓట్లు అడగడాన్ని ఆ నిబంధనలు నిషేధిస్తున్నాయి. కానీ, మోడీ మతపరమైన నినాదాలు లేవనెత్తడానికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులపై భారత ఎన్నికల కమిషన్ నిష్క్రియాపరత్వంతో, చెవిటివాని ముందు శంఖం ఊదిన తరహాలో వ్యవహరించడం చాలా ఆందోళన కలిగిస్తోంది, కలవరపాటుకు గురిచేస్తోంది.

మోడీ పదే పదే 'జై బజరంగ్ దళ్' నినాదాన్ని ఉచ్చరించడమంటే మతాన్ని, రాజకీయాలతో ముడిపెట్టినట్లే. ఇది చట్టానికి, లౌకికవాదానికి పూర్తి విరుద్ధ, దారుణమైన చర్య.

'బొమ్మై ప్రభుత్వానికి మరో అవకాశాన్ని ఇవ్వరాదు" అని 67శాతం మంది ఓటర్లు అభిప్రాయపడినట్లు ఎడినా పోల్ సర్వే వెల్ల డించింది. ప్రభుత్వ వ్యతిరేకతను ఇది బలంగా ప్రతి బింబి స్తోంది. ముఖ్యమం త్రిని కూడా పక్కకు నెట్టేసేలా, బి.ఎస్. యడ్యూరప్ప వంటి ప్రధాన నేతలకు కూడా తగిన ప్రాముఖ్యత ఇవ్వ కుండా మోడీ ప్రధానంగా సాగిన ప్రచారం విఫలమైందని ఫలితాలు రుజువు చేస్తున్నాయి.

బిజెపి ఓటమి వెనుక గల అత్యంత ప్రధానమైన కారణాల్లో ప్రభుత్వ వ్యతిరేకత పవనాలు ఒకటనడంలో ఎలాంటి సందేహం లేదు. కాంట్రాక్టర్ల నుం డి 40శాతం ముడుపులు తీసు కున్న ప్రభావం బొమ్మై ప్ర భుత్వాన్ని చాలా బలంగా దెబ్బ కొట్టింది. ఈ కార ణాలకు తోడు పెరుగు తున్న ద్ర వ్యోల్బ ణం, నిరుద్యోగం ఇవన్నీ కలిసి ప్రభుత్వ సంక్షోభాన్ని మరింత ముదిరేలా చేశాయి.



కింది స్థాయి ఓటర్లతో కాంగ్రెస్ సంబంధాలు

అట్టహాసంగా, ఆడంబరంగా రోడ్ షోలతో మోడీ ఒకపక్క ఉధృతంగా ప్రచారం సాగిస్తుంటే, మరోపక్క కాంగ్రెస్ నేతలు ముఖ్యంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వంటి నేతలు అట్టడుగు స్థాయిలోని ఓటర్లను కలిశారు, వారి బాధలు తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అనుసరించిన కీలకమైన వ్యూహాల్లో ఇదొకటిగా వుంది. డెలివరీ బాయ్ స్కూటర్ వెనకాల ఎక్కి రాహుల్ గాంధీ దాదాపు రెండు కిలోమీటర్లు ప్రయాణించిన తీరు ప్రజలతో ఆయన అనుబంధం ఎంతలా పెనవేసుకుపోయిందో స్పష్టం చేసింది. వీటికి అదనంగా ధరల పెరుగుదల, అవినీతి, పాలన పూర్తిగా కుప్పకూలడం వంటి అంశాలు తోడయ్యాయి.

కాంగ్రెస్, నెహ్రూ దార్శనికతకు మహిళల మద్దతు

కాంగ్రెస్ ఎదుగుదల వెనుక గల కారణాల్లో మహిళల మద్దతు ఒకటిగా వుంది. బిజెపి కన్నా కాంగ్రెస్‌కే ప్రాధాన్యతనివ్వాలని 40శాతం మంది మహిళా ఓటర్లు భావించినట్లు ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ వెల్లడించింది. మహిళల మద్దతును పొందడంలో బిజెపికి ఆరు పాయింట్లు వస్తే కాంగ్రెస్‌కు 11పాయింట్లు వచ్చాయని ఆ ఎగ్జిట్ పోల్ తెలిపింది.

ఎన్నికలను శాస్త్రీయంగా అధ్యయనం చేసే వ్యక్తి, స్వరాజ్ ఇండియా సహ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్ విశ్లేషణ ప్రకారం, కాంగ్రెస్ గ్యారంటీ కార్డ్‌లో ప్రజలకు చేసిన పలు వాగ్దానాల్లో - మహిళలు కుటుంబ పెద్దగా వున్న కుటుంబాలకు నెలవారీ రూ.2వేలు, అన్న భాగ్య యోజన కింద ప్రతి కుటుంబ సభ్యుడికి 10కిలోల బియ్యం వంటివి మహిళల మద్దతుకు ప్రధాన కారణంగా మారాయి. వీటికి తోడు, మహిళలకు బస్సు ప్రయాణాలు ఉచితం చేస్తామని పార్టీ ఇచ్చిన హామీ కూడా ఆ పార్టీకి అదనంగా ఓట్లను సమీకరించి పెట్టింది. అనేక ఏండ్లుగా దేశవ్యాప్తంగా మహిళలు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకోవడం సర్వ సాధారణంగా మారింది. భారత రాజకీయాల డైనమిక్స్ ను, కర్ణాటక లో కాంగ్రెస్ ఆవిర్భావాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ నిర్లక్ష్యం చేయబడిన, ఎన్నికల ప్రజాస్వామ్యంలో లింగ అంశా న్ని నిర్వచిస్తున్న కోణాన్ని లోతుగా విశ్లే షించాల్సిన అవసరం వుంది.

1952 సార్వ త్రిక ఎన్నికల తర్వా త, అదే ఏడాది మే 18న రాష్ట్రాల ముఖ్య మంత్రులకు లేఖ రాస్తూ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ,లోక్‌సభ, రాజ్యసభలకు కేవలం అతి కొద్దిమంది మహిళ లు మాత్రమే ఎన్నిక య్యారంటూ ఆందోళన వ్యక్తం చేశారు."ప్రజా జీవితం లో మహిళలు వారి వంతు పాత్రను పోషించడానికి పూర్తి అవకాశం వచ్చిన పుడే మనకు వాస్తవికమైన, మౌలిక పురోగతి వస్తుందని నేను కచ్చితంగా చెబుతున్నా. " అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. "ఎక్కడ వారికి ఈ అవకాశం వచ్చినా, వారు సగటు పు రుషుని కన్నా బాగా వ్యవహరించగలరని నేను చెప్పగలను." అని ఆయన పేర్కొన్నారు.

" పురుషుల కన్నా మహిళలపైనే బహుశా భారతదేశ భవితవ్యం ఎక్కువగా ఆధారపడవు" అని నెహ్రూ ఉద్ఘాటించారు. 1953 సెప్టెంబరు 20న ముఖ్యమంత్రులకు రాసిన మరో లేఖలో కూడా ఆయన ఇదే వైఖరి పునరుద్ఘాటించారు. "భారతీయ స్త్రీత్వం ప్రమాణాలు చాలా ఉన్నతంగా వుంటాయి. భారతీయ మహిళలు, పురుషుల కన్నా కూడా ప్రపంచవ్యాప్తంగా మనకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారు. ఏ దేశమైనా మహిళలకు పూర్తి స్థాయి అవకాశాలు ఇవ్వకపోతే ముందుకు వెళ్ళలేదు." అని నెహ్రూ ఆ లేఖలో పేర్కొన్నారు.

అందుకు తగినట్టుగానే అనేక అంశాల్లో మహిళలకు వారి రోజువారీ జీవితాలను ప్రభావితం చేయగల హామీలు ఇచ్చింది కాంగ్రెస్. ఇవన్నీ కూడా కాంగ్రెస్ విజయం సాధించడం వెనుక నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కూడా చాలా క్రెడిట్ ఇవ్వాలి. కర్ణాటకలో ఈ యాత్ర సాగిన సమయంలో వారి ఆందోళనలపై రాహుల్ తీవ్రంగా ధ్వజమెత్తారు.

కుప్పకూలిన హిందూత్వ వ్యూహం

హిజాబ్, హలాల్ మాంసం, అజాన్, కర్ణాటక పశు వధ నివారణ చట్టం, 2020, రాష్ట్ర జనాభాలో 12 నుండి 14 శాతంగా వున్న ముస్లింలను సామాజికంగా, ఆర్థికంగా బహిష్కరించాలన్న పిలుపు వీటి చుట్టూ తిరిగిన బిజెపి హిందూత్వ వ్యూహం కర్ణాటకలో పూర్తిగా కుప్పకూలి పోయింది. పార్టీ ఓటమికి ఇదొక ముఖ్యమైన కారణంగా వుంది.

బజరంగ్ దళ్‌పై రాష్ట్రవ్యాప్తంగా నిషేధం విధిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన తర్వాత, మోడీ జై బజరంగ్ దళ్ నినాదాన్ని ఇవ్వడం పార్టీకి అనుకూలంగా పరిస్థితి మారుస్తుందనే ఆశ కల్పించింది. కానీ ప్రభావవంతులైన ప్రాంతీయ నేతలు ప్రజల ప్రాథమిక సమస్యలపై గళమెత్తితే మోడీ అయినా ఓడిపోక తప్పదని బిజెపి ఓటమి రుజువు చేసింది. హిందూత్వ మరియు సంకుచిత జాతీయవాదం పేరుతో మోసగించడం, దీనికి తోడు దూకుడుతో కూడిన మెజారిటీవాదాన్ని అనుసరించడం కూడా ఓటమికి కారణాలయ్యాయి.

మెజారిటీవాదం ఓటమి

కర్ణాటకలో దాదాపు 35శాతం ఓటు వున్నా, బిజెపి మెజారిటీవాదం రాష్ట్రంలో ఓడిపోయింది. ఈ మెజారిటీ వాదాన్ని ఓడించడంలో కర్ణాటక మహిళలు గణనీయమైన పాత్ర పోషించారు. ఇదే పరిస్థితి దేశవ్యాప్తంగా ప్రతిబింబించాలి. కర్ణాటక ఎన్నికల ఫలితాల అర్థం ఇది. భారతదేశ ఆలోచనను రక్షించడంలో ఈ ఫలితాలు చారిత్రక ప్రాధాన్యతను కలిగి వున్నాయి.



దేశానికి తెలంగాణ మోడల్ కావాలి
ఐడియాస్ ఫర్ ఇండియా సదస్సులో మంత్రి కేటీఆర్
- బ్రిడ్జ్ ఇండియా-ఈపీజీ కార్యక్రమానికి హాజరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో ఐదు విప్లవాలను సాధించడంతోనే అనతికాలంలో తెలంగాణ ప్రగతి సాధ్యమైందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ మోడల్‌ను అనుసరిస్తే ఇండియాకు తిరుగుండబోదని ఆయన పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షిం చేందుకు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తున్న మంత్రి కేటీఆర్, లండన్‌లో శనివారం నిర్వహించిన 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సులో పాల్గొని తొమ్మిదేండ్ల తెలం గాణ విజయగాథను ఉద్వేగభరితంగా వివరిం చారు. ఉపాధి కల్పన, ఔత్సాహిక పారిశ్రామిక రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చేకునేలా యువతను తయారు చేసినప్పుడే దేశాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని అన్నారు.

"భారతదేశానికి అనేక సహజ అనుకూలతలు ఉన్నాయి. దేశంలో సమృద్ధిగా సహజ వనరులు, ఖనిజాలతో పాటు తగినంత కరెంటును ఉత్పత్తి చేయడానికి అవసరమైన వనరులు ఉన్నాయి. దేశంలో ఉన్న నదులు, సరస్సులు, నీటి వనరులతో వ్యవసాయ భూములకు కావాల్సినంత సాగునీరు ఇవ్వడంతో పాటు ప్రజలందరికి తాగునీరు, పారిశ్రామిక రంగానికి అవసరమైన నీటిని సరఫరా చేయయొచ్చు. వీటన్నింటికన్నా ముఖ్యంగా సాటిలేని మానవ వనరులు మనదేశంలో ఉన్నాయి. మానవ జాతి చరిత్రలో ఇప్పటివరకు ఏ దేశానికి లభించని గొప్ప అవకాశం భారతదేశానికి మాత్రమే దొరికింది. దేశ జనాభాలో 67శాతం మంది పనిచేసే వయస్సువారే ఉన్నారు.

జనాభాలో అత్యధికంగా ఉన్న యువత శక్తి సామర్థ్యాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకునే విధంగా సరైన ప్రణాళికలు, సమర్థవంతమైన కార్యచరణను అమలుచేస్తే 30 ఏండ్లల్లో చైనా సాధించిన ప్రగతిని 20 ఏండ్లలోపే ఇండియా సాధిం చొచ్చు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను సృష్టించేలా యువతకు శిక్షణ ఇవ్వాలి. ఉపాధి, వ్యవస్థాపకత రంగాల్లో అనేక అవకాశాలను వారికి అందించాలి. తొమ్మిదేండ్లల్లోనే విప్లవాత్మక ప్రగతితో తెలంగాణ అగ్రగామి రాష్ట్రంగా మారింది. వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం తోనే ఆయా రంగాల్లో విప్లవాత్మక మార్పును సాధించింది' అని మంత్రి కేటీఆర్ తెలిపారు.

ఫ్రెంచ్ రచయిత విక్టర్ హ్యూగో ఫేమస్ కొటేషన్ అయిన 'సమయం వచ్చిందనే ఆలోచన కంటే శక్తివంతం ఏదీ లేదు' అని ప్రస్తావించిన కేటీఆర్, తెలంగాణ మోడల్‌కు సమయం ఇప్పుడు వచ్చిందని వెల్లడించారు. తెలంగాణ మాదిరిగానే భారతదేశంలోని వ్యవస్థాగత సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

నూతనోత్సాహంతో కూడిన భవిష్యత్తును సృష్టిస్తూ, నాలుగో పారిశ్రామిక విప్లవంలో భారతదేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతూనే రైతు, యువతపై దృష్టి సారించాలని కోరారు. సరైన ప్రణాళిక, అంకితభావంతో పనిచేస్తే వచ్చే 20 ఏండ్లల్లో భారతదేశం తలసరి ఆదాయాన్ని 6 నుంచి 8 రెట్లు పెంచొచ్చని, ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా ఇండియా అవతరించే రోజు ఎంతో దూరంలో లేదని ధీమా వ్యక్తంచేశారు.

హైదరాబాద్‌లో డీఏజెడ్ఎన్ స్పోర్ట్స్ లైవ్ స్ట్రీమింగ్

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా కొనసాగుతున్న మంత్రి కేటీఆర్ ఇంగ్లాండ్ పర్యటన విజయవంతంగా కొనసాగుతున్నది. స్పోర్ట్స్ లైవ్ స్ట్రీమింగ్‌లో దిగ్గజ సంస్థ అయిన డీఏజెడ్ఎన్ హైదరాబాద్‌లో తమ ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. లండన్‌లో ఉన్న కేటీఆర్‌ను డీఏజెడ్ఎన్ గ్రూప్ ఉన్నతాధికారులైన సందీప్ టికు, డైసీ వెల్స్‌లు కలిసిన తర్వాత కంపెనీ ఈ ప్రకటన చేసింది. 200కుపైగా దేశాల్లో 60 మిలియన్ల సబ్ స్క్రైబర్లు ఉన్న అంతర్జాతీయ ఓవర్-ది-టాప్ స్పోర్ట్స్ స్ట్రీమింగ్ సర్వీస్ (ఓటీటీ డీఏజెడ్ఎన్). ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులు అత్యధికంగా చూసే యూఈఎఫ్ఏ ఛాంపియన్స్ లీగ్, యూరోపా లీగ్, సీరీ ఏ, లా లీగా, ఇంగ్లీషు ప్రీమియర్ లీగ్, ఎన్ఎఫ్ఎల్, ఎన్‌బీఏ, ఇతర దేశాల్లోని ఐపీఎల్ వంటి ప్రధాన ఈవెంట్‌ల లైవ్, ఆన్-డిమాండ్ స్పోర్ట్స్ కంటెంట్‌ను డీఏజెడ్ఎన్ ప్రసారం చేస్తుంది.

ఈ పెట్టుబడితో తెలంగాణ యువతకు వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని కంపెనీ తెలిపింది. ఇన్నోవేషన్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న ఆధిపత్యానికి డీఏజెడ్ఎన్ పెట్టుబడే నిదర్శనమని తెలిపింది.

తెలంగాణలోనూ ఇవే ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. కర్నాటక ఫలితాలనంతరం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు వీ హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, కె జానారెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. హిమాచల్‌లో తొలి విజయం, కర్నాటకలో రెండో విజయం, తెలంగాణలో మూడో విజయం సాధించబోతున్నామన్నారు. చివరికి ఫైనల్స్ లో 2024లో ఎర్రకోట మీద కాంగ్రెస్ జెండా ఎగురవేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించడం ద్వారా మోడీని, జేడీఎస్‌ను ఓడించడం ద్వారా కేసీఆర్ ను ఓడించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలవొద్దని ప్రయత్నించిన ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్ ఆలోచనలను కర్ణాటక ప్రజలు విస్పష్టంగా తిరస్కరించారని చెప్పారు. కర్ణాటకలో మత రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి మతం ఒక విశ్వాసమే కానీ..రాజకీయ అంశం కాదన్నారు. మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బీజేపీని ప్రజలు తిప్పి కొట్టి మోడీ నాయకత్వాన్ని ఓడించారని తెలిపారు.

భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ నఫ్రత్ చోడో అంటూ ఇచ్చిన సందేశాన్ని విశ్వసించి కర్ణాటక ప్రజలు మోదీని ఓడించారన్నారు. రాముణ్ణి అడ్డుపెట్టుకుని పార్టీ విస్తరించాలను కోవడం బీజేపీ మానుకోవాలని హెచ్చరించారు. బీజేపీ సర్వశక్తులు ఒడ్డిందనీ, ఆ ఫలితాలు తమకు వెయ్యి ఏనుగుల బలానిచ్చాయని తెలి పారు. దక్షిణ భారతంలో బీజేపీకి స్థానం లేదనీ, అక్కడి ప్రజలు బీజేపీని తిరస్కరించారని గుర్తు చేశారు. కుట్రలు, కుతంత్రాలతో జేడీఎస్‌ను గెలిపించి, హంగ్ అసెంబ్లీ ఏర్పాటు చేయడం ద్వారా బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తన రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకున్న కేసీఆర్‌ను కర్ణాటక ప్రజలు తిరస్కరించారని చెప్పారు. కర్ణాటక ఎన్నికల ప్రభావం కచ్చితంగా రాబోయే తెలంగాణ ఎన్నికల మీద ఉంటుందని వ్యాఖ్యానించారు.కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు బీఆర్ఎస్ కు ఇష్టం లేదనీ, అందుకే కర్ణాటక ఫలితాలు తెలంగాణలో పునరావృతం కాబోవని కేటీఆర్ ట్వీట్ చేశారన్నారు. 'కాంగ్రెస్ గెలుపును కేటీఆర్ ప్రజాతీర్పుగా అభివర్ణించలేదు. కర్ణాటక తీర్పు తెలంగాణ మీద ఉండదు అంటున్నాడు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు వారికిష్టం లేదు. మోడీ ఓడిపోతే టీఆర్ఎస్ వాళ్ల ఎందుకు అంత బాధపడుతున్నారో అర్థం కావడం లేదు' అన్నారు.

ఇది సమిష్టి విజయం

బెంగళూరు : కర్నాటకలో ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల కృషితోనే గెలిచామని కర్నాటక కాంగ్రెస్ చీఫ్ డి.కె శివకుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో ఫలితాలపై ఆయన స్పందిస్తూ ఎమోషనల్ అయ్యారు. కన్నీరు పెట్టుకున్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. సిద్ధరామయ్యతో పాటు ఎమ్మెల్యేందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని డి.కె శివకుమార్ అన్నారు. ఏఐసీసీ క్యాడర్ నాయకులు, రాష్ట్ర నాయకులు అందరి కృషితో విజయం సాధించామన్నారు. ఇది సమిష్టి నాయకత్వమనీ, అందరినీ ఏకతాటిపై తీసుకెళ్లడమే ప్రగతి అని తెలిపారు.

గెలుపు పట్ల డి.కె శివకుమార్ ఎమోషనల్

మతతత్వ రాజకీయాలను కన్నడిగులు వ్యతిరేకించారు

న్యూఢిల్లీ : కర్నాటకలో రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' జరిపినపుడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చాలా స్పష్టంగా ఖరారయ్యాయని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ అన్నారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ సారథ్యంలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ నేతలు సాగించిన ప్రచారం బాగా పని చేసిందన్నారు. కర్నాటక ప్రజలు మతతత్వ రాజకీయాలను వ్యతిరేకించి, అభివృద్ధి రాజకీయాలను ఎంచుకున్నారని అభినందించారు. త్వరలో జరగనున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఎన్నికల్లోనూ కర్నాటక తరహా ఫలితాలే పునరావృతమవుతాయని అశోక్ గెహ్లాట్ అన్నారు.

- రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్

స్పందనలు

ఇది రాష్ట్ర ప్రజల విజయం

బెంగళూరు : కర్నాటకలో కాంగ్రెస్ విజయంపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. పార్టీ కార్యకర్తలతో కలిసి సంబరాలు జరపుకున్నారు. ఇది ఏ ఒక్కరి విజయం కాదనీ, ఇది రాష్ట్ర ప్రజలు విజయమని ఆయన అన్నారు. ఈర్ష్య సుదీర్ఘకాలం ఉండదన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశమనీ, మనం ప్రజలు మాట వినాలను ఖర్గే తెలిపారు. మనకు సరైన దారిని చూపే ప్రజల ముందు తల వంచాలని చెప్పారు. బీజేపీ ముక్త భారత్‌కు కర్నాటక దారి చూపిందని ఆయన అన్నారు.

- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

బిజెపి అంతానికి ఆరంభం

'బిజెపి నెగిటివ్, మతపరమైన, విభజన, అబద్ధపు ప్రచారాల అంతానికి ఈ ఫలితాలు ఆరంభం. ఇది ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతి, విద్వేషానికి వ్యతిరేకంగా నూతన సానుకూల భారతం ఇచ్చిన కచ్చితమైన ఆదేశం' అని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేశారు.

అఖిలేష్ యాదవ్

బీజేపీ ప్రతీకార రాజకీయాలకు తగిన గుణపాఠం

చెన్నై : కర్నాటక ప్రజలు బీజేపీ ప్రతీకార రాజకీయాలకు తగిన గుణపాఠం చెప్పారని తమిళనాడు సీఎం, డీఎంకే చీఫ్ ఎంకె స్టాలిన్ అన్నారు. కాంగ్రెస్ విజయం సాధించటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాహుల్‌పై అనర్హత వేటు, రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగపర్చటం, హిందీ భాషను బలవంతంగా రుద్దడం, విచ్చలవిడి అవినీతి, ఇతర అంశాలు ఓటు వేసే సమయంలో కన్నడ ప్రజల మదిలో ప్రతిధ్వనించాయని తెలిపారు.

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకుందామని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ అందరం కలిసి గెలుపు కోసం సమిష్టిగా పని చేద్దామని పిలుపునిచ్చారు.

తమిళనాడు సీఎం స్టాలిన్

కర్నాటక ప్రజలకు అభినందనలు

న్యూఢిల్లీ : కర్నాటక ఎన్నికల ఫలితాలపై జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా స్పందించారు. విద్వేష రాజకీయాలను వ్యతిరేకించి, ప్రేమను పంచే రాజకీయాలను ఆమోదించినందుకు కర్నాటక ప్రజలకు తాను అభినందనలు తెలిపాలనుకుంటున్నానని నేషనలిస్ట్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) చీఫ్ అయిన ఆయన చెప్పారు.

- ఫరూక్ అబ్దుల్లా

రైతుల చారిత్రాత్మక విజయానికి అభినందనలు
ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ ఇన్ అగ్రికల్చర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం

న్యూఢిల్లీ : ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ ఇన్ అగ్రికల్చర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం పారిస్‌లో ప్రారంభమైంది. దేశంలోని వ్యవసాయ కార్మికులు, రైతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) అధ్యక్షుడు ఎ. విజయరాఘవన్, అఖిల భారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. యూనియన్ ఉపాధ్యక్షుడుగా ఉన్న విజూ కృష్ణన్ ఏఐకేఎస్‌కు ప్రాతి నిధ్యం వహిస్తూ సమావేశంలో ప్రసంగించారు. ఫ్రాన్స్, ఇతర చోట్ల కార్మికులు, కర్షకుల పోరాటాలకు సంఘీభావం తెలిపారు. ఏప్రిల్ 4న కన్నుమూసిన ఏఐఏడబ్ల్యూయూ మాజీ కార్యవర్గ సభ్యుడు సునీత్ చోప్రాకు నివాళులర్పిస్తూ సమావేశం ప్రారంభ మైంది.



కార్యనిర్వాహక కమిటీ సమావేశం ప్రపంచ రాజకీయ దృశ్యాలు, కార్మికులు, రైతులపై దాడులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజల మధ్య మరింత సంఘీభావం గురించి చర్చించింది. నవంబర్‌లో ఈజిప్ట్‌లోని కైరోలో జరగనున్న 5వ అంతర్జాతీయ సమావేశానికి సన్నాహకంగా ఈ కమిటీ సమావేశం నిర్వహించబడింది. కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చారిత్రాత్మక ఐక్య పోరాటంలో విజయం సాధించినందుకు రైతులు, కార్మికులను సమావేశం అభినందించింది. ఈ సమావేశం క్యూబా, పాలస్తీనాపై సామ్రాజ్యవాద, జియోనిస్ట్ హింసను ఖండించింది, ఆ దేశాల ధైర్యవంతులకు సంఘీభావం తెలిపింది.

సీఎం గెలుపు...
- 11 మంది మంత్రుల ఓటమి

బెంగళూరు : కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి సిఎం బసవరాజ్ బొమ్మై, 11 మంది మంత్రులు గెలుపొందగా, 11 మంది మంత్రులు ఓటమి పాలయ్యారు. ఈ ఓటమితో బిజెపి ఏకైక దక్షిణాది రాష్ట్రాన్ని కోల్పోయింది. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై సిగ్గావ్ నియోజకవర్గం నుండి 35,000 ఓట్లకు పైగా పొంది, 54.95 శాతం ఓట్లతో గెలిచారు.

ఓడిన మంత్రులు

వి సోమన్న (గృహ నిర్మాణ శాఖ మంత్రి) వరుణ, చామరాజనగర్ స్థానాల్లో ఓటమి పాలయ్యారు. బళ్లారి నుంచి బిఎస్ శ్రీరాములు (రవాణా శాఖ మంత్రి), చిక్కనాయకనహళ్లి నుంచి మధుస్వామి (న్యాయశాఖ మంత్రి), ముధోల్ నుంచి గోవింద కరజోల్ (నీటిపారుదల శాఖ మంత్రి), చిక్కబళ్లాపూర్ నుంచి కె.సుధాకర్ (ఆరోగ్య, సంక్షేమ శాఖ మంత్రి), హొస్కోటే నుంచి ఎంటిబి నాగరాజ్ (చిన్న పరిశ్రమల శాఖ మంత్రి), హిరేకెరూరు నుంచి బిసి పాటిల్ (వ్యవసాయశాఖ మంత్రి), బీళగి నుంచి మురుగేశ్ నిరాణి (పరిశ్రమల శాఖ మంత్రి), కెసి నారాయణగౌడ్ (క్రీడలశాఖ మంత్రి), పీట్, తిపూర్ నుంచి బిసి నగేష్ (ప్రాథమిక, మాధ్యమిక శాఖ మంత్రి), నవలగుంద నుంచి శంకర్ పాటిల్ (టెక్స్‌టైల్ శాఖ మంత్రి) ఓడిపోయారు.

గెలిచిన మంత్రులు

తీర్థహళ్లి నుంచి అరగ జ్ఞానేంద్ర (హోం మంత్రి), సిహెచ్ అశ్వథ నారాయణ (సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి), గడగ్ నుంచి సిసి పాటిల్ (పిడబ్ల్యుడి మంత్రి), ఓర్వాద్ నుంచి ప్రభు చౌహాన్ (పశు సంవర్ధక శాఖ మంత్రి), యశ్వంత్‌పూర్ నుంచి ఎస్‌టి సోమశేఖర్ (సహకార శాఖ మంత్రి), కెఆర్ పురం నుంచి బైరతి బసవరాజ్ (పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి), మహాలక్ష్మి లేఅవుట్ నుంచి గోపాలయ్య (ఎక్సైజ్ శాఖ మంత్రి), నిప్పాణి నుంచి శశికళ జొల్లె (హజ్, వక్ఫ్ శాఖ మంత్రి), సునీల్‌కుమార్ (సాంస్కృతిక శాఖ మంత్రి) కర్కల, రాజరాజేశ్వరి నగర్ నుంచి మునిరత్న నాయుడు (ఉద్యానవనశాఖ మంత్రి), ఎల్లాపూర్ నుంచి శివరామ్ హెబ్బార్ (కార్మికశాఖ మంత్రి)

రాహుల్ పర్యటించిన మెజారిటీ స్థానాల్లో విజయం

కర్నాటకలో కాంగ్రెస్ భారీ విజయానికి రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర'నే కారణం అని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. రాహుల్ గాంధీ యాత్ర వల్లే ఈ స్థాయిలో విజయం వరించిందని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ కమ్యూనికేషన్ చీఫ్, రాజ్యసభ ఎంపీ జైరాం రమేష్ భారత్ జోడో యాత్ర ప్రభావాన్ని తెలిపే స్టాటిస్టిక్స్‌ని ట్వీట్ చేశారు. గతేడాది సెప్టెంబర్ 7న తమిళనాడులోని కన్యాకుమారి మీదుగా కేరళ, కర్నాటక సహా 12 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల మీదుగా ఈ యాత్ర జరిగింది.

కర్నాటకలో 20 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా రాహుల్ పాదయాత్ర సాగింది. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో ఈ 20 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ 15 స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ 2, జేడీఎస్ 3 స్థానాలకే పరిమితమయ్యాయి.

2018 ఎన్నికల్లో ఈ స్థానాల్లో బీజేపీ 9, కాంగ్రెస్ 5 స్థానాల్లో గెలుపొందాయి. యాత్రలో కర్నాటక ప్రజలతో మాట్లాడామని, పార్టీని ఏకం చేయడంతోపాటు క్యాడర్‌ను సమాయత్తం చేశామని, వీటి ద్వారానే మానిఫెస్టోలోని హామీలు, వాగ్దానాలను చర్చించి ఖరారు చేశామని జైరాం రమేష్ ట్వీట్ చేశారు.

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి
సంతకాల సేకరణ కార్యక్రమంలో మహిళా సంఘాల నేతల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని పిలుపులో భాగంగా మహిళా సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి చౌరస్తాలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), ఎన్ఎఫ్ఐడబ్ల్యు, పీఓడబ్ల్యు సంధ్య, పీఓడబ్ల్యు ఝాన్సీ, పీఓడబ్ల్యు స్వరూప ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి ఎన్ జ్యోతితోపాటు ఇతర మహిళా సంఘాల నేతలు మాట్లాడుతూ రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. వారి పోరాటానికి మద్దతుగా 40మంది రచయితలు,40మంది విద్యార్థులు,30 మేధావులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అంతర్జాతీయంగా రెజ్లర్ల పోటీల్లో దేశానికి పథకాలు తీసుకొచ్చిన మహిళా క్రీడాకారుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గు చేటని విమర్శించారు.



బాధితులు రోడ్డెక్కి న్యాయం కావాలని ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవటమేంటని ప్రశ్నించారు.పైగా ఆందోళన చేస్తున్న మహిళా క్రీడాకారులను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాపై కూడా దాడులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్, అరుణ జ్యోతి, ఉపాధ్యాక్షులు కె.ఎస్ ఆశలత, పీఓడబ్ల్యు అనసూర్య, భారతి, సరళ, అనురాధ ఐద్వా నాయకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిని నైతికంగా ఓడించింది
- కర్నాటక ఫలితాలపై సీపీఐ నేత నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటకలో బీజేపీ ఓటమి ప్రధాని మోడీని నైతికంగా ఓడించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. కర్నాటకలో బీజేపీ ఓటమి ద్వారా దక్షిణ భారతదేశం ద్వారం ఆ పార్టీకి మూతపడినట్టు అయ్యిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోడీ సుదీర్ఘకాలం అక్కడే ఉండి కులాలు, మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని విమర్శించారు. రాజ్యాంగంలోని లౌకికవాదానికి కట్టుబడి ఉండాల్సిన ప్రధాని ఓట్ల కోసం కక్కుర్తి పడి భజరంగ్‌దళ్ జై అనమన్నారని గుర్తు చేశారు. రాహుల్‌పై కక్షసాధింపు చర్యలు ప్రజల్లో కాంగ్రెస్‌పై సానుభూతి వచ్చిందని తెలిపారు. గ్యాస్, పెట్రోల్ ధరల పెరుగుదల కూడా బీజేపీని ఓడించిందని పేర్కొన్నారు. కర్నాటకలో బీజేపీ ఓటమి దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతుందని తెలిపారు.

దేశానికే మార్గదర్శకం : కూనంనేని

కర్నాటక ఎన్నికల ఫలితాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న కాలంలో దేశంలో బీజేపీ వ్యతిరేక ప్రభుత్వాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. సొంతంగా తొమ్మిది రాష్ట్రాల్లోనే బీజేపీ అధికారంలో ఉందని తెలిపారు. అత్యున్నత పదవిలో ఉండి మతాల పేరుతో ఓట్లు సంపాదిం చాలన్న దుర్బుద్ధితో దిగజారి మాట్లాడిన ప్రధాని మోడీకి ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివని విమర్శించారు.

మనుధర్మంపైనే బీజేపీకి భక్తి..

మహిళలపై ఎప్పుడూ చిన్నచూపే..

- మతోన్మాదుల కట్టుకథ 'కేరళ స్టోరీ'
- పంచాయతీ జూనియర్ కార్యదర్శుల తొలగింపు హెచ్చరిక సరికాదు: ఖమ్మంలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- రెజ్లర్లకు మద్దతుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- ఎంపీ బ్రిజ్ భూషణ్ అరెస్టుకు డిమాండ్.. దిష్టిబొమ్మ దహనం





నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

లైంగిక వేధింపుల అవమానానికి గురైన మహిళా రెజ్లర్ల నిరసనను కేంద్రం పెడచెవిన పెడుతోందని, బీజేపీకి మనుధర్మం అమలుపై ఉన్న భక్తి మహిళలపై లేదని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ మల్లయోధులు నెలరోజులుగా ఆందోళనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మహిళల పట్ల చిన్నచూపునకు నిదర్శనం ఈ ఘటన అని వ్యాఖ్యానించారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి సరిత క్లినిక్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించి, అక్కడ బీజేపీ ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కనీసం ప్రజాస్వామ్య విలువలను పాటించడం లేదన్నారు. మరోవైపు ప్రతిపక్షాలపై బురదజల్లేందుకు 'కేరళ స్టోరీ' అనే ఓ సినిమాను బయటకు వదిలారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఇలాంటి స్టోరీలు చాలా తీస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చెప్పడాన్ని తప్పుబట్టారు. 'కేరళ స్టోరీ' సినిమాలో వాస్తవాలను దాచిపెట్టారని చెప్పారు. వాస్తవంగా కేరళ నుంచి ఐఎస్ఐలో చేరేందుకు నాలుగు జంటలు వెళ్లగా దానిలో ఒకటి ముస్లిం జంట కూడా ఉందన్నారు. నేషనల్ సెక్యూరిటీ పెట్టిన కేసు, ఐఎస్ఐ ఉగ్ర సంస్థ ఇబ్బందులకు గురిచేసిన నాలుగు జంటల్లో ముస్లిం జంటను విస్మరించి మూడు జంటలు పడ్డ ఇబ్బందులనే సినిమాలో చూపించారన్నారు. మత మార్పిడి వల్ల ఈ పరిస్థితులు తలెత్తాయని మోడీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. దీనిని అడ్డుపెట్టుకొని మోడీ ప్రభుత్వం బహిరంగంగా మతోన్మాదచర్యలను ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో కూడా మతోన్మాదాన్ని చాలా బహిరంగంగా ముందుకు తీసుకెళ్తూ మోడీ ప్రచారం నిర్వహిస్తున్న తీరును ఆక్షేపించారు. దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వ విధానాలపై సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తాం... వాటికి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. ముఖ్యంగా ఢిల్లీలో పోరాడుతున్న రెజ్లర్లకు మద్దతుగా, మోడీ ప్రభుత్వ దాష్టీకానికి నిరసనగా దిష్టిబొమ్మలు దహనం చేశామన్నారు. అప్రజాస్వామిక చర్యలు ఎక్కడున్నా సీపీఐ(ఎం) ఖండిస్తోందన్నారు.

విధుల్లో చేరకపోతే తొలగిస్తామనడం దుర్మార్గం

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రటరీలు శనివారం మధ్యాహ్నంలోగా విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు ఊడినట్టేనని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించడం చాలా దుర్మార్గమైన చర్యని తమ్మినేని విమర్శించారు. ఏ ప్రభుత్వ ఉద్యోగానికైనా వాస్తవానికి రెండేండ్ల ప్రొబేషనరీ పీరియడ్ కు మించి ఉండదు..జేపీఎస్‌ల విషయంలో దానిని మూడేండ్లు చేసినా ఆ సమయం కూడా పూర్తయిందన్నారు. రాష్ట్రంలో తొమ్మిది వేలకు పైగా ఉన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నాలుగేండ్లయినా తమను క్రమబద్ధీకరించక పోవడంపై ఆందోళన చేస్తున్నా ముఖ్యమంత్రి వారిని చర్చలకు పిలవకపోగా ఉద్యోగాల నుంచి తీసివేస్తామనడం దుర్మార్గపు చర్యని ఖండించారు. జేపీఎస్‌ల రెగ్యులరైజేషన్ కోసం తాను స్వయంగా సీఎంకు లేఖ రాశానన్నారు. సీఎం అపాయింట్మెంట్ కోసం ప్రయత్నం చేశానని చెప్పారు. అయినా ప్రభుత్వం ఖాతరు చేయడం లేదన్నారు. జూనియర్ పంచాయతీ సెక్రటరీలను వెంటనే చర్చలకు పిలిచి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా' అంటూ మనుస్మృతిలో చెప్పటం కాదు.. ఆచరణలోనూ మహిళలను గౌరవించాలి.. వారిని దేవతల్లా పూజించాలని బీజేపీ శ్రేణులకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ హితవు పలికారు. మహిళల పట్ల బీజేపీ నేతలకు ఏమాత్రం గౌరవ మర్యాదలు ఉన్నా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆ పార్టీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి పద్మ, మాచర్ల భారతి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, బండారు రమేష్, ఆర్.ప్రకాష్, దొంగల తిరుపతిరావు, పి.ఝాన్సీ, పిన్నింటి రమ్య, పార్టీ 2టౌన్, 3టౌన్, అర్బన్ మండల కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీను, బత్తిన ఉపేందర్, నాయకులు బండారు యాకయ్య, మీరా, కె అమరావతి, గౌస్, భాగం అజిత తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక ప్రజలకు జేజేలు

పీడీఎస్‌యూ, పీవైఎల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మతోన్మాద బీజేపీ ఓడించిన కర్నాటక ప్రజలకు పీడీఎస్‌యూ, పీవైఎల్ రాష్ట్ర కమిటీలు జేజేలు ప్రకటించాయి. ఈ మేరకు పీడీఎస్‌యూ, పీవైఎల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి మహేష్, డి సాయిరెడ్డి, ఎస్వి శ్రీకాంత్, ఇ సాగర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మతోన్మాద, ఫాసిస్టు, కార్పొరేట్ విధానాలను అవలంబిస్తూ దేశ సంపదను కొల్లగొడుతూ అంబానీ, అదానీలకు కొమ్ముకాస్తున్న బీజేపీని ఓడించడం దేశానికి మంచి పరిణామమని తెలిపారు. బీజేపీ కార్పొరేట్ అనుకూల విధానాలకు ఈ ఫలితాలు చెంపపెట్టు అని విమర్శించారు. మతోన్మాద, ఫాసిస్టు బీజేపీని ఓడించాలంటూ పలు నియోజకవర్గాల్లో ప్రచారం చేశామని తెలిపారు. దేశంలో ప్రజాస్వామిక, లౌకిక విలువల కోసం పోరాడుదామని కోరారు.

డెడ్‌లైన్ విధించడం అప్రజాస్వామికం

- 'జేపీఎస్'ల అంశంపై తమ్మినేని
- న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్య దర్శులు (జేపీఎస్) వెంటనే విధుల్లో చేరాలంటూ రాష్ట్ర ప్రభుత్వం డెడ్‌లైన్ విధించడం అప్రజాస్వామికమని సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. వారి న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరిం చాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జేపీఎస్‌లు వారి న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం గతనెల 28వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించకపోగా వారికి డెడ్‌లైన్ విధించి శనివారం మధ్యాహ్నం 12 గంటల్లోపు విధుల్లో చేరాలని, లేకుంటే వారిని తొలగించి ఆ స్థానంలో కొత్తవారిని నియమించాలంటూ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలివ్వటం అప్రజాస్వామికమని విమర్శించారు. సమ్మె చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కని పేర్కొన్నారు. దాన్ని కాలరాయడం నిరంకుశత్వమని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జేపీఎస్‌లను చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి పూనుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేలకుపైగా జేపీఎస్‌లు, వెయ్యి మంది వరకు ఓపీఎస్‌లు పనిచేస్తున్నారని తెలిపారు. వారి ప్రొబెషనరీ పీరియడ్ గతనెల 11వ తేదీతో ముగిసిందని పేర్కొన్నారు. అయినప్పటికీ రెగ్యులరైజ్ చేయకపోవడంతో సమ్మెలోకి దిగారని వివరించారు. జేపీఎస్‌లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. పారిశుధ్యం, ఉపాధి పనులు, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వివాహ సర్టిఫికెట్లు, ఇల్లు కట్టుకునేందుకు అనుమతులు వంటి పనులు నిర్వర్తించడంలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను ఎత్తేయాలంటున్న ప్రభుత్వం, జేపీఎస్‌లను క్రమబద్ధీకరించకుండా సమ్మెలో ఉన్న ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని అల్టిమేటం ఇవ్వడం దురదృష్టకరమని తెలిపారు. జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారిని రెగ్యులరైజ్ చేస్తూ జీవోను విడుదల చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

గొర్రెలు ఎప్పుడిస్తారో చెప్పకుండా డీడీలు ఎందుకు?

సర్కారుకు జీఎంపీఎస్ ప్రశ్న

- ఈ నెల 22న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- జూన్‌లో ఛలో హైదరాబాద్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గొర్రెలు ఎప్పుడిస్తారో స్పష్టమైన తేదీ చెప్పకుండా ప్రభుత్వం గొల్లకురుమలతో డీ.డీలు ఎందుకు తీసుకుంటున్నారని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) ప్రశ్నించింది. ప్రభుత్వం గొల్లకురుమల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించింది.ఈ నెల 22న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు చేయాలనీ, జూన్‌లో ఛలో హైదరాబాద్ నిర్వహించాలని నిర్ణయించింది. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ గొర్రెలు ఎప్పుడిస్తారో స్పష్టమైన తేదీ ప్రకటించకుండా గొల్లకురుమలతో డీ.డీలు తీసుకుని, వారిని అప్పులపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యం చేసిన కొద్ది ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిచ్చారు. 10 నెలల క్రితం డీ.డీలు తీసిన ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాల వారికి ఇప్పటి వరకు గొర్రెలివ్వకుండా నిర్లక్ష్యం చేశారని గుర్తు చేశారు. నెల రోజుల్లో మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా హడావిడిగా వేలాది మందిని డీడీలు తీయించారని తెలిపారు. ఎన్ని నిధులు ఉన్నాయో చెప్పడం లేదనీ, ఏ జిల్లాలో ఏ గ్రామంలో ఎవరికి ముందు పంపిణీ చేస్తారనే కనీస ప్రణాళిక లేకుండా అందరిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పాత పద్ధతిలోనే దళారులతో గొర్రెలు పంపిణీ చేయిస్తూ... రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా మిగిలిపోయి ఉన్న 3.5లక్షల మంది డీ.డీ.లు తీయిస్తే ఎన్నికలు వచ్చేలోపు గొర్రెల పంపిణీ సాధ్యపడదన్నారు. మునుగోడులో చేసినట్టు రాష్ట్ర వ్యాప్తంగా నగదు బదిలీ చేసి గొర్లకాపరులకు నచ్చినచోట ఇష్టమొచ్చిన గొర్రెలు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అడిగినప్పుడల్లా త్వరలో ప్రారంభిస్తామని చెప్పడం, సకాలంలో పంపిణీ చేయకపోవడంతో గొల్లకుర్మలు విశ్వాసం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికే దశలవారీగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులకు, శాసన సభ్యులకు మెమోరాండాలు ఇచ్చామనీ, అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. మరో వారం రోజుల్లో గొర్రెల పంపిణీ ప్రారంభించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు అవిశెట్టి శంకరయ్య, బొల్లం అశోక్, కాల్వ సురేష్, కడెం లింగయ్య, ఎక్కలదేవి కొమురయ్య, బచ్చలకూర శ్రీనివాస్, గౌర శ్రీశైలం, పయ్యావుల మల్లయ్య, కల్కినేని తిరీష్, వేల్పుల రమేష్, చేపూరి ఓదేలు, వజ్జె వినయ్ వివిధ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వద్దు

- అమెరికా నుంచి టెలీకాన్ఫరెన్స్‌లో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-సిద్దిపేట

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాల విషయంలో అధికారులు అలసత్వం వహించరాదని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిన సమయంలో అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో అండగా నిలుద్దామని దిశానిర్దేశం చేశారు. యాసంగి ధాన్యం కొనుగోళ్ల అంశంపై జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు మొత్తం 2300 మందితో కలిసి శనివారం మంత్రి హరీశ్‌రావు అమెరికా నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సతీశ్, ముత్తిరెడ్డి యాదిరెడ్డి, జెడ్పీ చైర్మెన్ రోజాశర్మ, ఎఫ్డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీలు, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లాలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మెన్లు, కోఆపరేటీవ్, మార్కెట్ కమిటీ, రెవెన్యూ, ఐకేపీ, రైతుబంధు సమితి ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 415 కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించినట్టు, ఇప్పటిదాకా 7304 మంది రైతుల నుంచి రూ.67 కోట్ల విలువైన 32508 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు.

పేద బ్రాహ్మణులకు అండగా ప్రభుత్వం

- 31న బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవం
- మెదక్‌లో మల్లినాథసూరి సంస్కృత విశ్వ విద్యాలయం
- సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



వేదాలనే నమ్ముకొని, జీవనం సాగిస్తున్న పేద బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అన్నారు. ప్రార్థనా మందిరాల్లోనే శాంతి నెలకొని ఉంటుందనీ, అక్కడే సర్వ జనులకు సాంత్వన చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని గోపనపల్లిలో నిర్మించిన 'బ్రాహ్మణ సంక్షేమ పరిషత్' భవన సదనాన్ని ఈనెల 31న ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు సోమేష్ కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, బ్రాహ్మణ పరిషత్ చైర్మెన్, ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కేవీ రమణాచారి, బ్రాహ్మణ పరిషత్ వైస్ చైర్మెన్ జ్వాలా నరసింహారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఫైనాన్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్‌రావు, ముఖ్యమంత్రి కార్యదర్శులు స్మితా సభర్వాల్, భూపాల్ రెడ్డి, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవం సందర్భంగా చండీయాగం, సుదర్శన యాగాలను నిర్వహించాలని బ్రాహ్మణ పరిషత్ చైర్మెన్ డాక్టర్ కేవీ రమణాచారిని ఆదేశించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల ప్రముఖ పుణ్య క్షేత్రాలనుంచి అర్చకులను, దేశవ్యాప్తంగా వున్న పీఠాధిపతులు, హిందూ మత పెద్దలు, అన్ని రాష్ట్రాల బ్రాహ్మణ సంఘాల పెద్దలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. వారికి అవసరమైన ప్రయాణాలు, బస ఏర్పాట్లు చేయాలనీ, దానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని ఫైనాన్స్ సెక్రటరీ రామకష్ణారావును ఆదేశించారు. బ్రాహ్మణ పరిషత్ భవనంలో ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, సాహిత్యంతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తెలంగాణ ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని పునరుజ్జీవింపచేసుకోవాలనీ, కాలగర్భంలో విస్మరించబడిన మల్లినాథసూరి వంటి నాటి ప్రముఖ భాషా కవి పండితుల చరిత్రలను వెలికితీయాలని చెప్పారు. మల్లినాథుని జన్మస్థలం మెదక్ జిల్లా కొల్చారంలో కోలాచల మల్లినాథ సూరి సంస్కృత విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలనీ, దానికి అవసరమైన కార్యాచరణ ప్రారంభించాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశం నుంచే ఫోన్ చేసి చెప్పారు.

జేపీఎస్, వీవోఏల సమస్యలను పరిష్కరించాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్), వీవోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్ధన్ డిమాండ్ చేశారు. సమ్మెలు, దీక్షల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడాన్ని శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనం రూ.27 వేలు నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఆన్‌లైన్ సేవలను నిలిపేయాలని సూచించారు. సీసీలుగా ప్రమోట్ చేయాలని తెలిపారు. వారికి గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని పేర్కొన్నారు. జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని తెలిపారు. మహిళా కార్యదర్శులకు ఆర్నెళ్లపాటు మెటర్నిటీ సెలవులు పొడిగించాలని పేర్కొన్నారు. ప్రొవిజినల్ పీరియడ్‌లో చేసిన పనిని సర్వీస్‌గా పరిగణించాలని కోరారు.


సంపాదకీయం

ప్రేమను పంచుదాం...

చరిత్రలో అమ్మకూ ఓ రోజు స్థిరపడింది. అంటే ఈ ఒక్కరోజు అమ్మపై ఎక్కడలేని ప్రేమను కురిపించి.. మిగిలిన రోజుల్లో ఆమెను పట్టించుకోవడం మానేస్తే సరిపోతుందా? సమాజంలో నిత్యం చోటు చేసుకుంటున్న ఘటనలు ఇలాంటి ప్రశ్నలే సంధిస్తున్నాయి. 'కాకి పిల్ల కాకికి ముద్దన్నట్లు' బిడ్డ అవిటిదైనా, కురూపి అయినా తల్లికి ముద్దే. ఎన్ని

తల్లిగా మహిళని గౌరవించడం, ఆరాధించడం ఒక్కటే సరిపోదు. ఆమెకు సంబంధించిన ప్రపంచంలోకి తొంగి చూడాలి. అలాంటి చూపు సమాజంలో కొరవడింది. సహనంలో, ప్రేమ చూపడంలో అమ్మ అనురాగ దేవత అనడంలో సందేహం లేదు. కానీ అమ్మ కూడా మనిషే. ఆమెకు ఇష్టాయిష్టాలుంటాయి. తనవైన అభిరుచులూ ఉంటాయి. తనకూ విశ్రాంతి కావాలని ఉంటుంది. కనుకనే 'అమ్మకు ఆదివారం లేదా' అని ఒక కథలో రంగనాయమ్మ ప్రశ్నించారు. మదర్స్ డే సందర్భంగా శ్రమజీవి అమ్మ గురించి తలపోసేవారు అమ్మల మానసిక ప్రపంచాల గురించి యోచించాలి. వారి కోణంలో వారి జీవితాన్ని నెట్టుకొచ్చిన వైనాన్ని దర్శించాలి. అన్నింటి కంటే ముందు అమ్మను ప్రేమించాలి. నాలుగు మాటలు పంచుకోవాలి.

కష్టాలు పడి అయినా.. కొన్నిసార్లు బిడ్డ బతకదని తెలిసినా.. చివరి నిమిషం వరకు బిడ్డ గురించి తపించే తల్లులెందరో తన రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడేది, తన బిడ్డల సుఖం కోసం అన్న ఎరుకతో ఉండేది అమ్మ ఒక్కటే. తొమ్మిది నెలలు కడుపులో మోసి.. జన్మనివ్వడానికి తను మరణం అంచుల వరకు వెళ్తుంది. అలాంటి మాతమూర్తి త్యాగం వెలకట్టలేనిది. కానీ, కొన్ని సంఘటనలు హృదయాన్ని కకావికలం చేస్తున్నాయి. తాజాగా కామారెడ్డి జిల్లాలో ఆస్తి పంచలేదని తల్లి శవాన్ని వదిలేసి వెళ్లిన కూతుళ్లను చూశాం. సిద్దిపేట జిల్లాలో తనను చూసే బాధ్యతను వంతుల వారిగా పంచుకోవడాన్ని తట్టుకో లేక తన చితితానే పేర్చుకొని నిప్పు పెట్టుకున్నాడో తండ్రి. ఇవి మానవత్వానికి మచ్చలు.



అమ్మ ప్రేమ సత్యం అని చలం అంటే... సమాజాన్ని మార్చే పోరాటంలో భాగస్వామిగా నిలిచినందుకు గర్విస్తూ కన్నతల్లిని స్మరించుకున్నాడు కవి శివసాగర్. కల్మశం లేనిది, కలుషితం కానిది అమ్మ ప్రేమ. అమ్మ అనురాగం మరింత స్వచ్ఛం. అందుకే శతాబ్దాలుగా కవులు, రచయితలు అమ్మ గురించి కావ్యాలు సజించారు. అమ్మని వేనోళ్ళ స్తుతించారు. తల్లి కావడం సహజాతి సహజ పరిణామం. కానీ, నేడు అమ్మతనం మార్కెట్‌కు సరుకయ్యింది. దానిని గ్లామరైజ్ చేయడంతోపాటు కోట్లాది రూపాయల వాణిజ్యంగా మార్చారు. దీనిలో భిన్నకోణాలున్నాయి. ఆడపిల్ల పుట్టుకని నిరాకరించే దుర్మార్గముంది. పుట్టిన ఆడపిల్లల్ని వద్దనుకొని అమ్ముకునే దుస్థితి ఉండనే ఉంది. ఆడపిల్లల్ని కనడం, పెంచడం పట్ల వివక్ష చూపిస్తున్నారు. ఇది మన సమాజంలో నెలకొన్న ద్వంద్వ విలువలకు నిదర్శనం.

మదర్స్ డేని ఘనంగా జరుపుకోడం, అమ్మలకు విషెస్ చెప్పడం మామూలే. కానీ అమ్మల ఆరోగ్యం మీద పట్టింపు ఏది? మన సమాజంలో ఇంటా బయటా పనిచేసే మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాలపై శ్రద్ధ కనబరిచేవారు తక్కువ. పెళ్ళికి ముందు, పెళ్ళయ్యాక, తల్లి అయిన తరువాత స్త్రీల ఆరోగ్యంలో మార్పులు సహజం. వాటిని అర్థం చేసుకునే సున్నితత్వం జీవన భాగస్వాముల్లోనూ అరుదు. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడంతో తనకు తానే ఓదార్పు కావాల్సిన స్థితిలో మహిళలు తల్లడిల్లుతున్నారు. అమ్మతనం ఔన్న త్యాన్ని అతి సుందరంగా అక్షరీకరిస్తారు. కానీ వారి మానసిక కల్లోలాల మీద స్పందన కనిపించదు. డబ్బులున్న కొడుకులయితే కానుకలిస్తారు. డబ్బులు పంపిస్తారు. కానీ అమ్మను చెంతన ఉంచుకునే వారు కరువయ్యారు. విడాకులు తీసుకున్న తల్లులు, వితంతువులయిన తల్లులు తమ దు:ఖాన్ని తామే దిగమింగుతూ రోజులు వెళ్ళదీయాల్సిన స్థితి నెలకొంది. పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు పెరిగినట్టుగానే అమ్మలకు, నాన్నలకు వద్ధాశ్రమాలు విరివిగా పెరుగుతున్నాయి. లేదంటే వీధుల్లో నివాసాలేర్పడుతున్నాయి.

ఒక అమ్మపట్లనే కాదు, కుటుంబ సంబంధాలలో చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వస్తు వినిమయదారీ తత్వంలో మనిషిని ముంచేసాక అన్నీ వినిమయ విలువలే మనసును ఆక్రమిస్తాయి. అమ్మనో, నాన్ననో చూడటానికి, మాట్లాడటానికి, ప్రేమతో పలకరించటానికి బదులుగా వారికో బహుమతి పంపితే చాలన్న రీతిలో మానవ సంబంధాలను మార్కెట్ సంస్కృతి ప్రభావితం చేస్తోంది. అంటే ప్రతిదీ డబ్బుతో కొనేదిగా, అనుభవించేదిగా, తప్తిపడేదిగా మారిపోయింది. అందులో అమ్మ ప్రేమకు కూడా స్థానం కల్పించారు. దీనికి కారణం ప్రపంచంలో పెట్టుబడి సష్టిస్తోన్న సాంస్కృతిక హీన భావజాలం.

తల్లిగా మహిళని గౌరవించడం, ఆరాధించడం ఒక్కటే సరిపోదు. ఆమెకు సంబంధించిన ప్రపంచంలోకి తొంగి చూడాలి. అలాంటి చూపు సమాజంలో కొరవడింది. సహనంలో, ప్రేమ చూపడంలో అమ్మ అనురాగ దేవత అనడంలో సందేహం లేదు. కానీ అమ్మ కూడా మనిషే. ఆమెకు ఇష్టాయిష్టాలుంటాయి. తనవైన అభిరుచులూ ఉంటాయి. తనకూ విశ్రాంతి కావాలని ఉంటుంది. కనుకనే 'అమ్మకు ఆదివారం లేదా' అని ఒక కథలో రంగనాయమ్మ ప్రశ్నించారు. మదర్స్ డే సందర్భంగా శ్రమజీవి అమ్మ గురించి తలపోసేవారు అమ్మల మానసిక ప్రపంచాల గురించి యోచించాలి. వారి కోణంలో వారి జీవితాన్ని నెట్టుకొచ్చిన వైనాన్ని దర్శించాలి. అన్నింటి కంటే ముందు అమ్మను ప్రేమించాలి. నాలుగు మాటలు పంచుకోవాలి.

లౌకిక శక్తుల నూతనోత్సాహం



తెలకపల్లి రవి

కర్నాటక శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అఖండ విజయం సాధించింది. ఈ విజయం ప్రత్యేకత ఏమంటే ఇంతవరకూ గత ముప్పై ఐదేళ్లలో ఏ పార్టీ కూడా రాష్ట్రంలో ఇంత పెద్ద విజయం అందుకున్న దాఖలాలు లేవు. 1989లో వీరేంద్రపాటిల్ నాయకత్వంలో కాంగ్రెస్ 43.76శాతం ఓట్లతో 178 స్థానాలు సాధించింది.1999లో 40.84 ఓట్లతో 132 సీట్లు, 2013లో 36.6శాతంతో 122 సీట్లు పొందింది. ఇప్పుడు 130 పైన స్థానాలు వచ్చాయంటే రాష్ట్రాన్ని పాలిస్తున్న బీజేపీ ఎంత ఘోరంగా ఓడిపోయిందో దానిపై ప్రజల వ్యతిరేకత ఏ స్థాయిలో వుందో తెలుస్తుంది. అదే బీజేపీ సంగతి చూస్తే ఇంత వరకూ ఒక్కసారి కూడా పూర్తి మెజార్టీ తెచ్చుకోలేదు. ఎప్పుడూ మైనార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఇతర పార్టీల వారిని చేర్చుకోవడం ద్వారానే గట్టెక్కిన పరిస్థితి. జేడీఎస్ మాత్రం దేవ గౌడ నాయకత్వంలో 1994లో 33.54శాతం ఓట్లతో 115 స్థానాలు తెచ్చుకున్నది. కాని తర్వాత నుంచి దాని బలం క్షీణించి తృతీయ పక్షంగానే పరిణామాలను ప్రభావితం చేయగలిగింది. అదే బీజేపీ యడ్యూరప్ప నాయకత్వంలో 2004లో 79, 2008లో 110, 2018లో 104 స్థానాలు మాత్రమే తెచ్చు కోగలిగింది. అయినా జేడీఎస్ అవకాశవాద కలయిక కారణంగా అధికారం చేయగలిగింది. వరుస ఫిరాయింపులను ప్రోత్సహించడమే గాక పార్టీ మారిన వారందరినీ మంత్రులను చేసి గట్టెక్క గలిగింది. వారిని ఆ తర్వాత రాజీనామా చేయించి గెలిపించు కోవడం గొప్పగా చెప్పుకుంది. ఈ అవకాశం కోసం బీజేపీ నేరుగా గాలిజనార్ధనరెడ్డి మైనింగ్ మాఫియాకు వత్తాసు నిచ్చింది. మంత్రులను చేసింది. దక్షిణ భారతంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఒకే ఒక రాష్ట్రం వెనక రాజకీయ నేపథ్యం ఇలా వుంది. మధ్యలో గాలి, యడ్యూరప్పలపై కేసులు, అరెస్టులు వంటి పరిణామాలు చాలా జరిగాయి. యడ్యూరప్ప స్వంత పార్టీ

కార్పొరేట్ శక్తుల ప్రాబల్యం, కబ్జాలకు కర్నాటక చిరునామాగా మారింది. రాజకీయ అవసరాల కోసం బీజేపీ ఢిల్లీ నేతలు ఈ పోకడలకు వంతపాడారు. ఈ విధంగా మతతత్వ రాజకీయాల రాష్ట్రాన్ని కల్లోలితం కలుషితం చేశాయి. ఇందుకు ప్రతిగా ఇస్లామిక్ తీవ్రవాదం కూడా ప్రవేశించింది. ప్రశాంత పారిశ్రామిక సాంకేతిక నగరమైన బెంగళూర్ అభద్రతలకు నిలయమైంది. కాంగ్రెస్‌కు ప్రత్యర్థిగా ఉన్న జనతాదళ్ దాని తదుపరి రూపాలైన జేడీఎస్ వంటివి కూడా అవకాశవాదానికి పాల్పడ్డం ఈ కుట్రలకు ఊపిరిపోసింది. ప్రధానిగా దేశానికి దేవగౌడను అందించిన జనతాదళ్ పరివారం ఉత్తరోత్తరా జేడీఎస్ రూపంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య దోబూచులాటకు కారణమైంది.

పెట్టుకుని మళ్లీ తిరిగి వచ్చి చేరడం ఒకటైతే గాలి ఇప్పుడు వేరు కుంపటి పెట్టి తన వారిని గెలిపించుకున్నారు.

కుటిల మత ధన రాజకీయాలు

కర్నాటక అధికారం కోసం బీజేపీ మత రాజకీయాలను ప్రోత్సహించడం, యడ్యూరప్ప కుల రాజకీయాలను పెంచడం అందరికీ తెలుసు. ఆర్థిక రాజకీయ పాలనాపరమైన అవినీతిని ప్రతీకగా ఆయన నడిపిన రాజకీయాల చరిత్ర అంతగా తెలియదు. ఎందుకంటే లింగయాత్‌లను సమీకరించి గెలిపించడమే గొప్పగా ప్రచారమవుతుంటుంది. అంతకంటే దారుణమైంది మత రాజకీయాలను రెచ్చగొట్టడం. హిందూత్వ విద్వేష రాజకీయాలకు ప్రవేశం కల్పించడం. వాటివల్ల కర్నాటక రాజకీయాల స్వరూపమే మారిపోయింది. హిందూ, ముస్లిం తగాదాలు, ప్రార్థనా స్థలాల వివాదాలు, టిప్పు తదితరుల చరిత్రలు తిరగదోడి వివాదాలు పెంచడం, గౌరీ లంకేశ్, కల్బుర్గి వంటివారి హత్యలు, శ్రీరామ్ సేన వంటివాటితో ప్రేమికులపై దాడులు చేయడం ఒకటేమిటి అదివరకు కర్నాటకకు తెలియని దారుణాలెన్నిటికో బీజేపీ కుటిల వ్యూహాలు కారణమైనాయి. ఈ మధ్యలో మళ్లీ యడ్యూరప్ప వ్యక్తిగత రాజకీయ పేరాశలు. కార్పొరేట్ శక్తుల ప్రాబల్యం, కబ్జాలకు కర్నాటక చిరునామాగా మారింది. రాజకీయ అవసరాల కోసం బీజేపీ ఢిల్లీ నేతలు ఈ పోకడలకు వంతపాడారు. ఈ విధంగా మతతత్వ రాజకీయాల రాష్ట్రాన్ని కల్లోలితం కలుషితం చేశాయి. ఇందుకు ప్రతిగా ఇస్లామిక్ తీవ్రవాదం కూడా ప్రవేశించింది. ప్రశాంత పారిశ్రామిక సాంకేతిక నగరమైన బెంగళూర్ అభద్రతలకు నిలయమైంది. కాంగ్రెస్‌కు ప్రత్యర్థిగా ఉన్న జనతాదళ్ దాని తదుపరి రూపాలైన జేడీఎస్ వంటివి కూడా అవకాశవాదానికి పాల్పడ్డం ఈ కుట్రలకు ఊపిరిపోసింది. ప్రధానిగా దేశానికి దేవగౌడను అందించిన జనతాదళ్ పరివారం ఉత్తరోత్తరా జేడీఎస్ రూపంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య దోబూచులాటకు కారణమైంది.

ఎందుకు విఫలమైంది?

2014లో మోడీ రాజకీయం మొదలైనాక కర్నాటకలో దాన్ని తీవ్ర రూపంలో అమలు చేయడంతో పరిస్థితి మరీ దిగజారింది. 2023 ఎన్నికలలో భజరంగ దళ్ నిషేధం ఆధారంగా ప్రచారం ముందుకు తేవడం మోడీ సభల్లో అదే నినాదం కావడం ఇందుకు పరాకాష్ట. దీనికి ముందు హిజాబ్ వివాదం, టిప్పుసుల్తాన్ ప్రతిదీ సమస్యాత్మకమైంది. ఇలాటి నేపథ్యంలోనే 2023 ఎన్నికల తీర్పు విలక్షణమైందిగా చెప్పవలసి వస్తున్నది. సర్వేలు ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ అన్నిటిలోనూ దాదాపుగా కాంగ్రెస్ పెద్దపార్టీగా చూపించానా వాస్తవంగా ఉన్న ఆధిక్యతను చెప్పడానికి బీజేపీ భయమే ఆటంకమైంది. ఇప్పుడు ఫలితాలు చూస్తే అసాధారణ విజయంగా గోచరిస్తున్నది. నిస్సందేహంగా ఇది మతతత్వంపై అవినీతిపై ప్రజలిచ్చిన తీర్పు. కాంగ్రెస్ నాయకత్వం అనైక్యత నుంచి బయటపడటానికి చాలా కసరత్తు అవసరమైంది. అలాగే గతవారం చెప్పుకున్నట్టు మతపరమైన సమీకరణలను సంతృప్తి పర్చేబదులు సమస్యల పరిష్కారం ప్రజలకు రాయితీలే వాగ్దానాలుగా కాంగ్రెస్ ప్రణాళిక విడుదల చేసింది. అదే ప్రజలను ఆకర్షించింది. ఆదరణ పొందింది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ట్రాఫిక్‌సమస్యలు, శాంతిభద్రతలు ప్రతిదీ ప్రజల ఆగ్రహానికి కారణమైంది. బీజేపీ అమితోత్సాహంతో ముందుంచిన వివాదాస్పద అంశాలు ప్రజలలో ఉద్వేగం పెంచలేకపోయాయి. అలా అని ఒక్కసారిగా కర్నాటక లౌకిక విధానమే తీసుకుందని కాదు. మతతత్వ ఘర్షణలు, వివాదాలు, విద్వేష వాదనలకు మాత్రం తావులేదని చెప్పింది. భజరంగదళ్ నిషేధం అంటే ఆంజనేయుడిపై నిషధమేనన్నట్టు ప్రచారం చేస్తే ప్రజలు కొట్టుకుపోలేదు. వాస్తవంలో దీనికి వ్యతిరేకంగా సమీకరణ జరుగుతుందని కూడా కాంగ్రెస్ వ్యూహాత్మక ఆలోచనచేసి ఫలప్రదమైంది.స్థానిక బీజేపీ నేతలు మంత్రులు కూడా ప్రతిష్ట కోల్పోయిన పరిస్థితులలో ప్రచారానికి ప్రధాని మోడీనే ఏకైక ప్రచారకుడుగా తిరగాల్సి వచ్చింది. అయినా ఘోరమైన ఓటమి తప్పలేదంటే మోడీ జనాకర్షణ పరిమితులు కూడా స్పష్టమైనాయి. కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ నిరంతరం మాట్లాడుతుండగా వాస్తవంలో బీజేపీ ముక్త దక్షిణ భారత్ అవతరించింది (పాండిచ్చేరి మినహా) దక్షిణాదిన కేరళ, తమిళనాడు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో బీజేపీ కాలూనడం పెద్ద రాజకీయ సవాలుగా తయారైంది. ఉత్తర భారతంలో విజయం చేకూర్చిన హిందూత్వ నమూనా రాజకీయాలు దక్షిణాన చెల్లబోవని తేటతెల్లమైంది. మొన్ననే సుప్రీం కోర్టు ఢిల్లీ, మహారాష్ట్ర పరిణామాలపై ఇచ్చిన తీర్పు కూడా కేంద్రం పెత్తనానికి చివాట్లు పెట్టింది. నిజానికి ఆ జాబితాలో కర్నాటక కూడా ఒకటిగా వుండేది.ఇక్కడ నేరుగా ప్రజలే తమ తీర్పుతో మర్చిపోలేని పాఠం నేర్పారు.

కాంగ్రెస్ కసరత్తు

కాంగ్రెస్ పునరుద్ధరణ క్రమంలో ఈ తీర్పు మరో మైలురాయి అవుతుంది.రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర నిజంగానే కొంత ఐక్యత పెంచడంతో పాటు ఓటర్లను ప్రభావితం చేసింది. దళితనేత మల్లికార్జున ఖర్గే ఏఐసిసి అధ్యక్షుడు కావడం



సానుకూలత పెంచింది. ట్రబుల్‌షూటర్ గా పేరున్న డికె శివకుమార్, గత ముప్పయ్యేళ్లలో పూర్తికాలం బాధ్యత నిర్వర్తించిన ఒకే ఒక మాజీ ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యల సఖ్యత కోసం కూడా రాహుల్‌గాంధీ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. బీజేపీ విధానాలు నచ్చక పోవడం, విజయావ కాశాలు లేకపోవడం వల్ల చివరి క్షణాల్లో కాంగ్రెస్ తీర్థం తీసుకున్న మాజీ సీఎం జగదీశ్ షట్టర్ వంటివారిని కూడా చేర్చుకుని పోటీ చేయించింది. కీలక నేతలు విడివిడిగా చేసినవ వాగ్దానాలన్ని కలిపి అయితు హామీలుగా ఎన్నికల్లో ప్రచారం చేసింది. ఇవన్నీ సానుకూల ప్రభావం నెరిపాయి. జేడీఎస్ అవకాశవాదానికి విరుగుడుగానూ పనిచేశాయి. పోలింగ్ ముగిసిన మరు రోజునే కుమారస్వామి తనే కింగ్‌మేకర్‌నవు తాననీ, కాంగ్రెస్ బీజేపీ రెండింటితో మాట్లాడుతున్నానని చెప్ప డం ఇందుకు అద్దం పట్టింది. తీరా ఆయనే ఓట్ల లెక్కింపు కన్నా ముందే ఈసారి తన పాత్ర ఉండకపోవచ్చని ఒప్పుకోవలసి వచ్చింది. విశ్వసనీతయ కోల్పోయిన ఫలితమిది. ఈ ఓట్లు సీట్లు కూడా కాంగ్రెస్‌వైపు మరలడం ఒక కీలకపరిణామం. తొలి ఫలి తాల్లో కొంత అస్పష్టత వుండటంతో బీజేపీ, జేడీఎస్‌తో మంత నాలు ప్రారంభించి భంగపడింది. గాలి జనార్ధనరెడ్డితో పాటు ఆయన పార్టీ తరఫున

ఏపీలో బీజేపీతో అంటకాగుతున్న మూడు ప్రాంతీయ పార్టీలకు కూడా ఇదొక కనువిప్పు కావాలి. ఇక వారితో పొత్తు గురించి కల వరిస్తున్న పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు వంటివారు కూడా కళ్లు తెరవాల్సి వస్తుంది. 2024 ఎన్నికల పోరాటానికి అవసరమైన ప్రతిపక్ష అవగాహన కోసం లౌకిక శక్తులు కృషి చేయాల్సి వుంటుంది. కర్నాటకలో లాగే ఒక బలమైన శక్తిగా లేకున్నా కేంద్రాధికారాలతో, మత రాజకీయ ప్రభావంతో రాష్ట్రానికి నష్టం చేస్తున్న బీజేపీపై ఉమ్మడిగా పోరాడాల్సిన అవసరాన్ని ఈ తీర్పు మరోసారి గుర్తుచేస్తుంది. పోరాడగల మనే భరోసా ఇస్తుంది. తక్షణమే జరిగే నాలుగు హిందీ రాష్ట్రాలలోనూ బీజేపీతో తలపడటానికి అవసరమైన స్థైర్యం కాంగ్రెస్‌కు పెరుగుతుంది.

ఒకరిద్దరు ఎన్నికవడం, రెబల్ అభ్యర్థులు కూడా నెగ్గడం ఈ సారి కొత్త పరిణామం. వీరిలో కొందరు కాంగ్రెస్‌లో చేరినా ఆశ్యర్యం లేదు. ఈ ఎన్నికల గురించిన అనేక అంశాలను ముున్ముందు సమీక్షించుకోవల్సి వుంటుంది.

కీలక కర్తవ్యం

ఇక ఇప్పుడు కొత్త ముఖ్యమంత్రి ఎవరనేదానిపై చర్చ ఉత్కంఠ కేంద్రీకృతమైంది. సిద్ధరామయ్య, శివకుమార్‌లలో ఎవరో ఒకరికి ఈ పదవి లభించవచ్చు. అలాగాక ఇద్దరినీ పదవీ కాలం సమంగా విభజంచి అవకాశం ఇవ్వచ్చునేది మరో అంచనా. ఉపముఖ్యమంత్రి పదవి కల్పిం చవచ్చు కూడా. అనేక కోణాలలో సీనియారిటీ రీత్యా సిద్ధరామయ్యకు అవకాశం రావచ్చు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో అనుభవాలు కూడా కాంగ్రెస్ ముందున్నాయి. ఈ వివాదంతో కాంగ్రెస్ చీలిపోతుందని కూడా బీజేపీ నేతలు వారి అనుకూలురు కథలు వదులుతున్నారు. కాంగ్రెస్ సీట్లలో సగం కూడా తెచ్చుకోలేక పోయిన బీజేపీ అంత దుస్సాహసం చేయకపోవచ్చు. ఈ ఫలితాల ప్రభావం పక్కనే ఉన్న తెలంగాణపై తప్పక వుంటుందని కూడా పరిశీలకులు అంచనాలు వేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీని గట్టిగా వ్యతిరేకిస్తున్న కారణంగా ఇది సానుకూల పరిణామంగా పరిగణించి శుభాకాంక్షలు చెప్పింది. అయితే ఇతర వైరుధ్యాలు కొనసాగుతుంటాయి గనక తమకే మేలు చేస్తుందని కాంగ్రెస్ వారంటున్నారు. ఆ ఊహాగానాల కన్నా మతోన్మాదాన్ని కేంద్రం నిరంకుశత్వాన్ని ఎదుర్కొవడం కీలకం. ఇప్పటికీ వెనకబడి పోయిన బీజేపీ ఈ దెబ్బతో మరింత వెనక్కు పోవలసి రావచ్చు. ఏపీలో బీజేపీతో అంటకాగుతున్న మూడు ప్రాంతీయ పార్టీలకు కూడా ఇదొక కనువిప్పు కావాలి. ఇక వారితో పొత్తు గురించి కల వరిస్తున్న పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు వంటివారు కూడా కళ్లు తెరవాల్సి వస్తుంది. 2024 ఎన్నికల పోరాటానికి అవసరమైన ప్రతిపక్ష అవగాహన కోసం లౌకిక శక్తులు కృషి చేయాల్సి వుంటుంది. కర్నాటకలో లాగే ఒక బలమైన శక్తిగా లేకున్నా కేంద్రాధికారాలతో, మత రాజకీయ ప్రభావంతో రాష్ట్రానికి నష్టం చేస్తున్న బీజేపీపై ఉమ్మడిగా పోరాడాల్సిన అవసరాన్ని ఈ తీర్పు మరోసారి గుర్తుచేస్తుంది. పోరాడగలమనే భరోసా ఇస్తుంది.తక్షణమే జరిగే నాలుగు హిందీ రాష్ట్రాలలోనూ బీజేపీతో తలపడటానికి అవసరమైన స్థైర్యం కాంగ్రెస్‌కు పెరుగుతుంది. ఏకపక్ష రాజకీయాల స్థానే బహుళ పక్ష ప్రజాస్వామ్యాన్ని పున:ప్రతిష్టించడం, రాజ్యాంగంలోని లౌకిక సమాఖ్య విలువలకు పట్టం కట్టడం, ఈ తీర్పు అసలైన ప్రాధాన్యత.

రిపోర్టర్స్ డైరీ

ఎంత ఘాటు ప్రేమయో..!

కొందరు ప్రేమ లేకపోయినా వారి స్వార్థం కోసం ప్రేమించినట్టు నటిస్తుంటారు. ఇది నటన అని కూడా గుర్తించం. నటనలో అంతగా జీవిస్తారు. ఇలాంటివి సినిమాల్లోనే కాదు..నిత్య జీవితంలోనూ అటువంటి వారు మనకు తారసపడుతున్నారు. అయితే అటువంటి స్వార్థపరుల నిజస్వరూపాన్ని పసిగట్టడం అంత ఈజీ కాదు. అటువంటి మహానటులు కొంత మంది 'ది కేరళ స్టోరీ' చిత్రంపై ఘాటు ప్రేమను కురిపిస్తున్నారు. బత్తాయిగాళ్ల బలవంతంగా ఆ చిత్రాన్ని చూపిస్తున్నారు. అబిడ్స్‌లోని ఓ థియేటర్‌లో మొదటి ఆరోజు ఆటకు జనమే లేరు. కానీ ముందే చేసుకున్న ప్లాన్ ప్రకారం గుంపులు, గుంపులుగా అక్కడికి చేరుకున్నారు.అక్కడే హోటల్‌లో టిఫిన్లు తినిపించారు. టీలు తాగించారు. జై రామ్ అంటూ నినాదాలు చేస్తూ...ర్యాలీగా థియేటర్‌లోకి వెళ్లారు. దీన్ని బట్టి ది కేరళ స్టోరీ చిత్రాన్ని జాకీపెట్టి లేపుతున్నాయి ఆర్ఎస్ఎస్ మూకలు. ఏ ఆధారాలు లేని మాయబజారును తలపించేలా 'ది కేరళ స్టోరీ' అనే విషపు పామును ఆర్ఎస్ఎస్ బయటకు వదిలింది. అప్పటికే ప్రజలు ఆ పాముల కోరలు పీకేశారు.ఈ క్రమంలో మూలిగే నక్కపై తాటిపండు పడినట్టు...గుజరాత్ మహిళల అక్రమదందా వెలుగులోకి వచ్చింది. 41వేల మంది అదృశ్యమైనట్టు ఎన్సీఆర్బీ తేల్చింది. దీనికి ప్రభుత్వ లెక్కలు పక్కగా ఉన్నాయి. ఆ సినిమాను తొక్కి పెట్టింది. కేరళ స్టోరీ సిని మాను బ్లాక్‌బస్టర్ చేయాలని భావించారు. కానీ సీన్ రివర్సయింది. థియేటర్లలో జనం లేక వెలవెలబోతు న్నాయి. పెట్టిన సొమ్ము రాబట్టుకునేందుకు చిత్ర బృందం ప్రమోషన్ కోసం బీజేపీ ముఖ్య మంత్రులు, కేంద్ర మంత్రుల వద్దకు తిరుగుతున్నారు. సినిమా ఫెయిలై బోల్తా కొట్టింది. కానీ చిత్ర నిర్మాత, దర్శకుడు కచ్చితంగా బీజేపీ పాలనలో పాస్ అవుతారు. ఇది సత్యం.

- గుడిగ రఘు

ఏమున్నదక్కో..ఏమున్నదక్కా..

'ఏమున్నదక్కో...ఏమున్నదక్కా..ముల్లెమూటు సదురుకుని వెళ్లిపోతా ఉన్న..కర్నాటకలో ఇంకేమున్నదక్కో... యాడ ఉండి కన్నువేసిరో 40శాతం కమీషన్లపై.. ప్రజలంతా ఒక్కటై కన్నడనాట అధికారాన్ని పీకేసురు..మత విభజనలు మాకాడ చెల్లబోవంటూ ఓట్లతో నడ్డివిరిచి తరిమింద్రు సామి..సామి..గ్యాస్ రేట్ల దెబ్బకూ..భజరంగబళి నినాదం చిన్నదైపోయే సామి.. ఏమున్నదక్కో ఏమున్నదక్కా కన్నడనాట ఇంకేమున్నదక్కో' అంటూ బీజేపీ నేతలంతా పాట పాడుకోవాల్సిన సమయం మొదలైంది. ఉత్తర భారతాన తాను విసిరిన పాచికల్లా పారి అధికారంతో వికసించిన కమలం కన్నడనాట కమిలిపోయింది. దక్షిణాది రాష్ట్రాల్లో తమ చేతిలో అధికారం ఉన్న ఒక్క రాష్ట్రంలోనూ హస్తం దెబ్బకు పువ్వు రెక్కలన్నీ రాలిపోయాయి. మోచా తుఫాన్ ప్రభావం దక్షిణాది రాష్ట్రాలమీద పనిచేయనట్టే..మోషా ప్రభావం కనిపించలేదు. అవినీతి, కుల కంపు రాజకీయాలు, రిజర్వేషన్ల కుంపటి, విభజన రాజకీయాలు ఆ పార్టీకి మేలు చేయకపోగా నట్టేట ముంచాయి. మోడీ, షా, నడ్డా, ఐదారు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు కర్నాటకలో తిష్టవేసి..జాకీలు పెట్టి మరీ ఎంత లేపాలని చూసినా ప్రజాబలం ముందు వారి శక్తి చిన్నదైపోయింది. దీంతో కర్నాటకలో మరోమారు గెలిచి దక్షిణాదిపై పట్టు సాధించాలనుకున్న ఆ పార్టీ పరిస్థితి 'అనుకున్నదొక్కటి.. అయిందొక్కటి...బోల్తాకొట్టిందిలే బుల్‌బుల్ పిట్టా' అన్న పాట మాదిరిగా తయారైంది.

- అచ్చిన ప్రశాంత్

అయ్యో గీ..ఎస్పీలకేమయిందో?

గీ..ఎస్పీలకేమయిందో...! ఎస్పీ అంటే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కాదండోయి. గదే విశారదన్ మహారాజ్..ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ), ఆర్.ప్రవీణ్ కుమార్(ఆర్ఎస్పీ)... బీఎస్పీ.. మంద కృష్ణమాదిగ.. మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్పీ). గీటికేముంది కానీకే అనుకుంటున్నారా? పొద్దుల్నేస్తే మూలవాసుల గురించి మాట్లాడే విశారదన్..ఆయన పెట్టిన సభలో ఒక్క మాటా బీజేపీని అనలేదు. మూలవాసుల ఉనికినే లేకుండా చేస్తున్న ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని అమలు చేస్తున్న బీజేపీని విమర్శించలేదంటే ఆయన పోరాటం ఎవరిమీదనో? ఇక బీఎస్పీ అయితే బీజేపీ ప్రస్తావనే తీయలేదు..ఉత్తర భారతంలో ఆ పార్టీ దళిత మహిళలను చెరబట్టి, యువకులను త్రిశూలాలతో కొట్టి చంపుతున్నది. అయినా ఆ ప్రాంతం నుంచొచ్చిన మాయవతక్క నోటి నుంచి ఆ మాటే రాలేదు మరీ! ముచ్చటగా మూడో ఎస్పీ..మన ఎంఎస్పీ. కృష్ణమాదిగ పార్టీ. ఈయనగారైతే ఏకంగా కర్నాటక ఎన్నికల్లో బీజేపీ తరుపునే ప్రచారం చేశారు. అది రిజర్వేషన్లు ఇస్తామని జెప్పి విస్మరించిన పార్టీ, దళితులను అడుగడుగునా అణిచేస్తున్న పార్టీ, ఏకంగా రాజ్యాంగాన్నే మార్చాలం టున్న పార్టీని పల్లెత్తు మాటా అనలేదంటే ఎవరికోసం పనిచేస్తున్నారో? మరీ! గీ ముగ్గురి ఎస్పీలను చూసీ దళితు లంతా ముక్కునేలేసు కుంటున్నారు. మా గురించి ఏర్పడిన పార్టీలకు ఏమయిందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- నిరంజన్ కొప్పు

ఫిడేల్ రాగం

'ఏమిటే బాధగా ఉన్నావు'! పరామర్శించింది వీణ. తన చెల్లెలైన ఫిడేలును.

'నా బాధ ఏమని చెప్పాలి అక్కడ!' అన్నది ఫిడేల్ ఆవేదనగా.

'అయ్యో! నీ బాధ ఏమిటని అడుగుతున్నాను కదా!' ఏమని చెప్పను అంటే ఎలాగా?

ఎందుకు బాధపడుతున్నావో చెప్పు చెల్లీ' అన్నది వీణ అనునయంగా.

'నీకేమమ్మా! చరిత్రలో నీకు చాలా మంచి పేరు ఉన్నది. నాకేమో చెడ్డపేరు ఉన్నది. ఆ పేరు పోవాలని ఎంతో ఆశ పడుతుండగా

నిన్న ఆ చెడ్డ పేరు మళ్లీ వచ్చింది!

'నేను నిజంగా చెడ్డదాన్నా?' అడిగింది ఫిడేల్.

'నీవు చెడ్డదానివి ఎవరన్నారమ్మా! నీవు చాలా మంచి దానివే!

అయినా నీకేందుకే డౌటు వచ్చింది?' ఆశ్యర్యంగా ప్రశ్నించింది' వీణ.

'ఈ మధ్యకాలంలో అందరూ నన్ను అదోరకంగా చూస్తున్నారు! చెడుకు, నిర్లక్ష్యానికి నేను సింబాలిక్‌లా మారి పోయావని అనుకుంటున్నారు! ప్రజల మధ్య కనబడాలంటే నాకు అవమానంగా ఉందక్కా?' అన్నది ఫిడేల్.

'అంత అవమానపడాల్సిన పని నీవేం చేశావే!' అడిగింది వీణ.

'ఇద్దరు ప్రముఖ వ్యక్తుల చేతుల్లో నేను కనపడ్డప్పటి నుండి నాకు అవమానంగా అన్పిస్తోంది'! అన్నది ఫిడేల్.

'ప్రముఖ వ్యక్తుల చేతుల్లో ఉంటే నీకు గౌరవమే కదా! బాధపడటం, అవమానపడటం ఎందుకు?' అడిగింది వీణ.

'ప్రముఖ వ్యక్తులంటే మామూలు ప్రముఖులు కాదక్కా!

వారిద్దరూ దైవాంశ సంభూతులుగా పేరుగాంచినవారు!

ఈ ప్రపంచాన్నే ప్రభావితం చేయగలిగిన స్థానాల్లో ఉన్నవారు!

అంతగొప్ప ప్రముఖుల చేతుల్లో నేను కనబడ్డప్పుడే అవమానాల పాలు అవుతున్నాను' అన్నది ఫిడేల్.

'అంత గొప్ప ప్రముఖులు ఎవరే?' ఆశ్చర్యంగా అడిగింది వీణ.

'ఒకరు రోమన్ చక్రవర్తి.మరొకరు భారతదేశ సర్వంసహా చక్రవర్తి' అన్నది ఫిడేల్.

'నిజమే! వీరిద్దరూ సాక్షాత్తూ దైవాంశ సంభూతులే!



అలాంటి వారి చేతుల్లో కనపడితే అవమానమేమిటే నీ ఖర్మ కాకపోతే!' అన్నది వీణ విడ్డూరంగా.

'అవునక్కా! చరిత్రలో అత్యంత నాగరికత గల సామ్రాజ్యంగా రోమన్ సామ్రాజ్యం కీర్తి గడించింది!

ప్రజలు, పరిపాలనా పద్ధతి, ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది రోమ్ సామ్రాజ్యంలోనే. రోమ్ సామ్రాజ్యానికి చక్రవర్తి అయ్యాడంటే అది మామూలు విషయం కాదు. చక్రవర్తి సాక్షాత్తూ దైవాంశ సాంభూ తుడని ప్రతీతి. కాని అంతగొప్ప చక్రవర్తి ఫిడేల్ వాయించి, నన్ను అవమానానికి గురిచేశాడు. నాకు అవ మానం ఎందు కంటే చక్రవర్తి నన్ను వాయించింది. శుభ సందర్భంలో కాదు! రోమ్ నగరం మంటల్లో కాలి పోతుంటే, గొప్ప నాగరికత మంటల్లో కలిసి పోతుంటే, అన్నిం టిని మించి, ముసలీ, ముతకా, బీదా, సాదా ఇంకా చిన్న పిల్లలు ఆ మంటల్లో చిక్కుకుని హాహాకారాలు చేస్తుంటే వారిని కాపాడటం మానివేసి, నన్ను వాయించి, తన ఆనందాన్ని వెదుక్కునే శాడిస్టు వ్యక్తి చేతుల్లో నేనున్నానంటే, అది నాకు ఎంత అవమానం? అన్నది ఫిడేల్.

'నిజమే' అన్నది వీణ.

'ఇది వేల ఏళ్ల నాటి చరిత్ర! ఆ గాయం పూర్తిగా మానలేదు. నాకు జరిగిన అవమానం మెల్లిగా మర్చిపోతున్నస్థితిలో మన దేశ సర్వం సహా చక్రవర్తి మళ్లీ నాకు అవమానం కలిగించాడు' అన్నది ఫిడేల్.

'ఈ చక్రవర్తి ఏం చేశాడు'! ఆసక్తిగా అడిగింది వీణ.

'దేశ రాజధాని ఢిల్లీలో మహిళా రెజ్లర్లు, తమను లైంగిక వేధింపులకు గురిచేస్తున్న అధికార పార్టీ ఎంపీపై చర్య తీసుకోవాలని ఆందోళన చేస్తున్నారు. వారు సాధారణ అమ్మాయిలు కాదు.

క్రీడా జగత్తులో భారతదేశం గర్వంగా తలెత్తుకునేలా బంగారు పతకాలు సాధించినవారు! పతకాలు సాధించినప్పుడు, మన చక్రవర్తి వారితో ఫొటోలు దిగారు! కాని వారు రోడ్డుమీద ఆందోళన చేస్తుంటే, ఆ బేటీలను పట్టించుకునే తీరిక లేని చక్రవరి, నన్ను వాయిస్తూ ఫొటోలు దిగారు'! అన్నది ఫిడేల్.

'అవును నిజమే'! అన్నది వీణ.

మణిపూర్ ప్రజల మధ్య మెజార్టీ, మైనార్టీ పేరిట ఘర్షణలు చెలరేగి పదుల సంఖ్య లో ప్రజలు ఒకరినొకరు చంపుకుంటున్నారు! రాష్ట్రం రావణకాష్టమైంది. ప్రజలు అక్కడ ఉండలేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. వేరే దేశాల మధ్య యుద్ధం జరుగుతుంటే, ఒక్క ఫోన్‌కాల్‌తో యుద్ధం ఆపగలిగిన చక్రవర్తి, మణిపూర్ ఘర్షణలను ఆపలేదు! కనీసం వారికి ఫోన్ కూడా చేయలేదు! అంటే అక్కడ ఘర్షణలు ఉంటేనే మంచిదనుకున్నాడా'? ఆయన ఏమనుకున్నాడో గాని, ఆ సమయంలో నన్ను వాయిస్తూ ఫొటోలు దిగడం వల్ల, నాకు తీవ్రమైన అవమానం జరిగింది'!

రోమ్ చక్రవర్తి నన్ను వాయించినపుడు ఒక రోమ్ నగరమే తగలపడిపోయింది! కాని సర్వం సహా చక్రవర్తి నన్ను వాయిస్తున్నపుడు , మొత్తం దేశమూ, దేశంలోని 130 కోట్ల మంది ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోమ్‌లో మహా అయితే కొన్ని వేల మంది మాత్రమే, ఇప్పుడే కోట్లాది మంది! అందుకే ఇప్పుడే నాకు ఎక్కువ బాధగానూ, అవమానకరంగానూ ఉన్నది. నేననే వీళ్లకి ఎందుకు దొరికానా? అని నరకం అనుభవిస్తున్నానక్కా' అన్నది ఫిడేల్.

'బాధపడకు చెల్లీ! కర్నాటక ఎన్నికల ఫలితాలు వచ్చాయి! నీ బాధ తీరినట్లే!' అన్నది వీణ.

- ఉషాకిరణ్



మన సంతోషంలో అమ్మ, భయంలో అమ్మ, దుఃఖంలో అమ్మ. ఇలా ప్రతి నిమిషం, ప్రతి తలంపులో అమ్మే. అమ్మ ప్రేమని కొలవటానికి కొలమానం ఉండదు. అది నిరంతర అద్భుతం. అమ్మ లేక సృష్టి లేదు. అందుకే అమ్మ స్థానం అంత గొప్పది. బిడ్డ అన్నం తినడానికి మారం చేస్తే లాలించి తినిపించేది అమ్మ. ఎంత కష్టాన్నైనా తనలో దాచి చిరునవ్వుతో పలకరిస్తుంది. బిడ్డలు తనని కాదన్న తను మాత్రం పిల్లల కోసమే తపిస్తుంది. అటువంటి అమ్మను గౌరవించుకోవడానికి ప్రతి ఏడాది మే రెండవ ఆదివారం మాతృదినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా కొందరు బిడ్డలు అమ్మతో ఉన్న తమ అనుబంధాన్ని మానవితో ఇలా పంచుకున్నారు.

అమ్మ కవితకు అందని పదం.. అమ్మ వర్ణించుటకు సరిపోని సోయగం..
అమ్మ మరిచిపోలేని బంధం.. అమ్మ అనే పిలుపు నిరంతర ప్రతిధ్వని..
అమ్మ - నిజం, అమ్మ - నిజం..

- పాలపర్తి సంధ్యారాణి

నిత్య శ్రామికురాలు అమ్మ

అమ్మలా ఉండాలని...

మా అమ్మ డా.బి.విజయ లక్ష్మి, నాన్న డి. సురేష్. మా సొంతూరు వరంగల్. అమ్మ ఆయుష్ విభాగంలో ముప్పై అయిదేండ్లు ఉద్యోగం చేస్తూ అడిషనల్ డైరెక్టర్ హోదాలో గత నాలుగేండ్ల కిందట పదవీ విరమణ పొందారు. అమ్మతో నా అనుబంధం గురించి చెప్పాలంటే నా జీవితం మొత్తం చెప్పాలి. ఎందుకంటే ఇప్పటి వరకు నా జీవితంలోని ప్రతి అంశం అమ్మ సహకారంతోనే గడుస్తుంది. నా చదువు, వృత్తి, వ్యాపకం, వివాహం, పిల్లలు ప్రతి దాంట్లో నాకు పూర్తిగా తోడు ఉంది. అమ్మని చూసి తనలా ఒక వైద్యురాలిగా మంచి పేరు తెచ్చుకోవాలి తపన పడ్డాను. అందుకే వైద్య విద్యని అభ్యసించాను. ప్రభుత్వ ఉద్యోగంలో చేరి అవసరమైన వారికి ఉపయోగ పడుతున్నాను. వైద్య విద్యా బోధకురాలిగా స్థిర పడ్డాను.



అమ్మకు సాహిత్యం మీద మక్కువ ఎక్కువ. చిన్న తనం నుండి నేను ఇంగ్లీష్ మీడియం చదివినప్పటికీ అమ్మ నుండి నేర్చుకున్న బాషా పరిజ్ఞానంతో తెలుగు భాషను నా బలంగా చేసుకొని ఎన్నో హెల్త్ ఆర్టికల్స్ కథలు, కవితలు రాయగలుగుతున్నాను. ఇప్పుడు నేను ఓ మహిళగా తోటి మనుషులకు ప్రేరణాత్మకంగా ఉన్నానంటే అది అమ్మ పెంపకం వల్లనే. నా పక్కనుండి నన్ను నడిపించిన శక్తి మా అమ్మ అని గర్వంగా చెప్పగలను.

- డా.ప్రతిభా లక్ష్మి

బాధలన్నీ తనే దిగమింగింది

అమ్మ..! మా అమ్మ త్యాగానికి మారు పేరు. నిరుపేద కుటుంబంలో పుట్టి సంపన్నుల కుటుంబంలో కోడలిగా అడుగుపెట్టింది. అప్పుడు అమ్మ ఎంతో పొంగిపోయిందట. తన ఓర్పుతో ఎంతటి కష్టాన్నైనా దిగమింగేది. మెట్టినింట ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. కష్ట సమయంలో కూడా మాకు తన ప్రేమలో లోటు లేకుండా చూసుకునేది. మేము చిన్న తరగతులు చదువుకునేటప్పుడు సంసారం భారంగా అనిపించి తను కూడా నర్స్ ట్రైనింగ్ చేసింది. చిన్న ఉద్యోగం సంపాదించి మాకు ఏ కష్టం తెలియకుండా చూసుకుంది.



అన్నం కూర మాకు పెట్టి తను మజ్జిగ లేదా పచ్చడి తినేది. సన్నబియ్యం మాకు వండి పెట్టి తను దొడ్డు బియ్యం తినేది. ఎన్ని కష్టాలు అనుభవించినా బాధంతా తన కడుపులోనే పెట్టుకునేది. మమ్మల్ని పల్లెత్తు మాట కూడా అనదు. మమ్మల్ని మంచి లక్షణాలతో పెంచింది. ఉమ్మడి కుటుంబంలో ప్రతి మహిళా పడే బాధలు అమ్మ అనుభవించింది. ఆ కష్టంలో ఆనందాన్ని వెదికి దాన్ని మాత్రమే మాకు పంచేది.

- ప్రతిభ, బిజినెస్ ఉమెన్



అమ్మే నా ధైర్యం

అమ్మ లలిత, నాన్న నాగేశ్వర్ రావు. వాళ్ళకు నేను ఒక్క దాన్నే. మా స్వగ్రామం విజయవాడ అయినప్పటికీ పెరిగింది, చదివింది హైదరాబాద్‌లోనే. బి.ఏ. సోషయాలజీ చదివాను. 10వ తరగతిలో ఉండగా అనుకోకుండా సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అయితే ఆ పాత్రకి నేను చాలా చిన్న దానిగా ఉన్నానని అన్నారు. అప్పుడే ఉషా కిరణ్ బ్యానర్లో ఈటీవీ వారి షార్ట్ ఫిల్మ్ 'రంగుల కల'లో నటించే అవకాశం వచ్చింది. అప్పటి నుండి 11 ఏండ్ల పాటు ఈటీవీలో చేసాను.

నేను నటిగా ఎదగడానికి అమ్మ ప్రోత్సహమే ఎక్కువ. ఎందుకంటే అమ్మకు నటన అంటే ఇష్టం. మా తాత (అమ్మ నాన్నగారు) సత్యనారాయణ డ్రామా ఆర్టిస్ట్. నేను నటించటం ప్రారంభినప్పటి నుంచి అమ్మే అన్ని దగ్గరుండి చూసుకునే వారు. ఉదయాన్నే లేచి వంట చేసి బాక్స్ పెట్టి నాతో పాటు షూటింగ్ స్పాట్‌కి వచ్చేవారు. రాత్రి ఎంత సేపు అయిన నాతోనే ఉండేవారు. నా కాస్ట్యూమ్స్ కూడా అమ్మే డిజైన్ చేసేవారు. నేను స్క్రీన్‌పై కనిపించేటప్పుడు సాంప్రదాయ దుస్తులకే ప్రాధాన్యం ఇస్తాను. అలా అని మోడరన్ దుస్తులు వేయను అని కాదు. నా వృత్తి రీత్యా ఉన్న ఒత్తిళ్ల కారణంగా బాగా కోపం వస్తూ ఉంటుంది. అమ్మ ఎప్పుడు ఈ విషయంలో మాత్రం నన్ను హెచ్చరిస్తూ ఉంటారు. 'కోపం మంచిది కాదు. ఒక మాట అని బాధ పడటం కన్నా, నీ కోపాన్ని నియత్రించుకోవడం మంచిది. ఎంత మంచి పేరు సంపాదించుకున్నా, నువ్వు కోపంతో అనే ఆ ఒక్క మాటతో మనుషులు దూరం అవుతారు' అని చెప్తూ ఉంటారు.

అమ్మ మంచి విమర్శకురాలు కూడా. నా నటన ఎలా ఉంది, మేకప్ ఎలా ఉంది, కొన్ని సన్నివేశాల్లో ఇలా కాకుండా అలా నటిస్తే బాగుండేది... ఇలాంటివన్నీ చెబుతూ ఉంటారు. రోజులు బాగా లేవని అమ్మ నన్ను ఫ్రెండ్స్‌తో సినిమాలకు, షాపింగ్‌లకు కూడా పంపేవారు కాదు. ఎక్కడికి వెళ్లాలన్న తానే వచ్చేవారు. అంత కేర్ తీసుకునే వారు. అమ్మ చేతి వంట ఏదైనా సరే అమృతం. నాకు అమ్మ చేసే ఆవకాయ చాలా చాలా ఇష్టం. ఇప్పుడు నేను అమ్మను అయ్యాక అమ్మకు ఇంకా దగ్గర అయ్యాను. అమ్మ మీద ఇంకా గౌరవం, ప్రేమ పెరిగింది. అమ్మ నన్ను ఎప్పుడు ప్రోత్సహిస్తూనే ఉంటారు. 'ఖాళీగా ఉండొద్దు. నీ కాళ్ళ మీద నువ్వు నిలబడాలి. ఎవ్వరి మీద ఆధారపడి ఉండొద్దు' అంటూ ఉంటారు. అమ్మ ఒక ధైర్యం. అమ్మ చేసే ప్రతి పనీ నా ఆనందం కోసమే. నా ఆనందంలో తన ఆనందం చూసుకుంటుంది. నా రేపటి భవిష్యత్తుకై నిత్యం శ్రమించే శ్రామికురాలు అమ్మ. అమ్మ ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలను. నీ పాదాలను తాకి నమస్కరించడం తప్ప..

- పల్లవి, టీవీ నటి

ఆప్యాయతల కలపోత 'అపురూపం'

'టాలెంట్ ఎక్కడకున్నా గౌరవించాలనుకోవడం నా స్వభావం. ఆలస్యం చేసే కొద్దీ నా వయసు రీత్యా, వారి వయసు రీత్యా ఆ అవకాశం దొరక్కుండా పోతుందేమోనన్న అభిప్రాయం నాది' అంటారు అమృతలత. అందుకే ఆమె వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళల కోసం 'అమృతలత - అపురూప అవార్డ్స్'ని పన్నెండేండ్ల కిందట నెలకొల్పారు. వయసు ఏడు పదులు దాటినా ఆమెలో ఎక్కడా అలసట కనపడదు. ప్రతి ఏడాది మాదిరిగానే ఏడాది కూడా మాతృదినోత్సం సందర్భంగా ఈరోజు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్నారు.



ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 24 మంది మహిళలను 'అమృత లత జీవన సాఫల్య పురస్కా రాలతో ఆమె గౌరవించారు. ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో నిష్ణాతులైన 97మంది మహి ళలను 'అపురూప అవార్డు' లతో సన్మా నించారు. ఆమె జన్మస్థలమైన నిజామా బాద్‌లో పుట్టి, వివిధ రంగాల్లో పేరు తెచ్చుకున్న కళా కారులూ, సాహితీవేత్తల కొరకు 'ఇందూరు అపురూప అవార్డ్స్' నెలకొల్పారు. ఇప్పటి వరకు 46మంది పురుషులకూ, 23 మంది స్త్రీలకూ ఆ పురస్కారాలతో గౌరవించారు. ఇప్పటికి ఈ మూడు రకాల అవా ర్డులు తీసుకున్న స్త్రీ పురుషుల సంఖ్య 201కు చేరిందని ఆమె ఎంతో సంతోషంగా చెబుతున్నారు.

సహకారం అనన్య సామాన్యం



'ఇన్ని రోజులు అవార్డులలో సింహభాగం సీనియర్స్‌కే లభించాయి. ఇక ముందు కొంత మేర యువశక్తికి కూడా చోటు కల్పించాలని అనుకుంటున్నాం. వారి వివరాలన్నీ 'అభినందన' సావనీర్ల రూపంలో, వీడియోల రూపంలో అందరికీ త్వరలో అందుబాటులో ఉంటాయి. ఇవి ఆయా వ్యక్తులపై పరిశోధన చేయాలనుకునే వారికీ, ముఖ్యంగా భావి తరాలవారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. దీని కోసం అడుగడుగున్నా నా వెన్నంటే వుంటూ, నా కలలను సాకారం చేస్తోన్న నెల్లుట్ల రమాదేవి, కిరణ్‌బాలల కృషి అనన్య సమాన్యం" అంటారు అమృతలత.

2023 అవార్డును అందుకోబోయే వారు

➢ ప్రముఖ నవలా రచయిత గంటి భానుమతి, విద్యారంగం నుండి డా.పి. విజయలక్ష్మి పండిట్, సినీ రంగం నుండి సంగీత, శాస్త్ర సంగీతం ప్రొ.ద్వారం లక్ష్మి 'అమృతలత జీవనసాఫల్య పురస్కారం' అందుకోబోతున్నారు.

➢ మాణిక్యేశ్వరి (జర్నలిజం), ఆలపాటి లక్ష్మి (రంగస్థలం), మందరపు హైమావతి (కవిత్వం), మహెజబీన్ (మహిళా భ్యుదయం), జ్యోతి వలబోజు (పుస్తక ప్రచురణ), శైలజా మిత్ర (సాహితీ విమర్శ), డా.కె.రత్నశ్రీ (శాస్త్రీయ నృత్యం), డా.కె.ఎస్.మల్లీశ్వరి (కథారచన), పి.జ్యోతి (వ్యాసరచన) అపురూప అవార్డులు అందుకోబోతున్నారు.



నాకు దక్కిన గొప్ప అవకాశం

- నెల్లుట్ల రమాదేవి

పదకొండేళ్ల కిందట అమృతలత మదిలో పుట్టిన ఈ అపురూప అవార్డులు ఈ దశాబ్ద కాలంలో ఇంత మంచి పేరు వస్తుందని కానీ, ఇంత ప్రాధాన్యత సంతరించు కుంటాయని గానీ అప్పట్లో అనుకోలేదు. ఆమె ఏ ఫంక్షన్‌కి వెళ్ళినా ఎక్కడ ఏ మాత్రం ప్రతిభ, కళ ఎవరిలో కనిపించినా వాళ్ళను అభినందించ కుండా సత్కరించకుండా ఉండలేరు. అంతటి కళాభిమాని ఆమె. ఆ అభిమా నంలోంచే రూపుదిద్దుకున్నదే ఈ అవార్డులు. మొదటి కార్యక్రమం నుండి నన్ను కన్వీనర్‌గా ఎంచుకోవడం నాకు దక్కిన గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. సభ ఎంత వైభవంగా జరిగినా కొన్నాండ్లకి జనం మర్చి పోతారు. అలా కాకుండా అతిథుల, అవార్డు గ్రహీతల పరిచయ వ్యాసాలతో కూర్చిన ప్రత్యేక సంచిక 'అభినందన' అపురూప అవార్డులకే ప్రత్యేకం.

వాడిన కమలం

(మొదటిపేజీ తరువాయి)

నేత కుమారస్వామి ఆశలు అడియాసల య్యాయి. ఆ పార్టీ ప్రస్తుతం ఉన్న స్థానాలను కూడా కోల్పోయింది. కుమారస్వామి కుమారుడు నిఖిల్ సైతం ఓటమి చెందారు. ఆ పార్టీ ఓటుబ్యాంకును కాంగ్రెస్ భారీగా కొల్లగొట్టింది. ఆ పార్టీకి ఏకంగా 139 సీట్లలో డిపాజిట్లు దక్కలేదు. మరోవైపు బళ్లారి ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని యత్నించిన గాలి జనార్ధనరెడ్డికీ ఆశాభంగం తప్పలేదు. ఆయన మినహా ఆయన ఏర్పాటు చేసిన పార్టీ కేఆర్‌పీపీలో ఒక్కరూ గెలవలేదు. చివరికి గాలి సతీమణి కూడా ఓడిపోయారు. ఒక్క కోస్తా ప్రాంతంలో మినహా బీజేపీ ఎక్కడా ప్రభావం చూపలేకపోయింది. పైగా ఆ పార్టీ 31 స్థానాలలో ధరావతులు కోల్పోయింది. కర్నాటక ఎన్నికలలో బరిలో దిగిన అమ్‌ఆద్మీ పార్టీ ఒక్క సీటూ దక్కించుకోలేక చతికిలపడింది. ఆ పార్టీకి 209 సీట్లలో డిపాజిట్లు గల్లంతయ్యాయి. శాసనసభాపక్ష నేతను ఎన్నుకునేందుకు కర్నాటక పీసీసీ నేడు సమావేశం అవుతుంది.

హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందంటూ ఎగ్జిట్‌పోల్స్ వేసిన అంచనాలను తలకిందులు చేస్తూ కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీ సాధించి అధికారాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 224 అసెంబ్లీ స్థానాలున్న కర్నాటకలో కాంగ్రెస్ 136 సీట్లు సాధించి తిరుగులేని ఆధిక్యాన్ని కనబరచింది. బీజేపీ 65 స్థానాలకే పరిమితమైంది. జేడీ (ఎస్)కు 19, ఇతరులకు నాలుగు సీట్లు వచ్చాయి. ప్రాంతాల వారీగా చూస్తే హైదరాబాద్ కర్నాటకలో కాంగ్రెస్‌కు 19, బీజేపీకి 9 స్థానాలు లభించాయి. పాత మైసూర్‌లో కాంగ్రెస్‌కు 34, బీజేపీకి 5 సీట్లు వచ్చాయి. ఆ ప్రాంతంపై గంపెడాశలు పెట్టుకున్న జేడీ (ఎస్) 14 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. ముంబయి కర్నాటక ప్రాంతంలో కాంగ్రెస్‌కు 33, బీజేపీకి 16 సీట్లు రాగా మధ్య కర్నాటకలో కాంగ్రెస్‌కు 26, బీజేపీకి 6 స్థానాలు దక్కాయి. ఒక్క కోస్తా కర్నాటక ప్రాంతంలో మాత్రం బీజేపీ తన ఆధిపత్యాన్ని నిలుపుకుంది. అక్కడ బీజేపీకి 12 సీట్లు రాగా కాంగ్రెస్‌కు 8 సీట్లు లభించాయి. గ్రేటర్ బెంగళూరులో రెండు పార్టీలకూ చెరో 16 స్థానాలు వచ్చాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలలో బీజేపీ ఓట్ల శాతంలో (35.9%) పెద్దగా మార్పు రానప్పటికీ సీట్లను మాత్రం భారీగా కోల్పోయింది. మరోవైపు జేడీ (ఎస్) కోల్పోయిన ఐదు శాతం ఓట్లను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. కాంగ్రెస్‌కు 43% ఓట్లు, జేడీ (ఎస్)కు 13.3% ఓట్లు లభించాయి. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ 40, జేడీ (ఎస్) 17 సీట్లు కోల్పోయాయి. బసవరాజ్ బొమ్మై కేబినెట్‌లోని 12 మంది మంత్రులు పరాజయం పాలయ్యారు. మంత్రి సోమన్న తాను పోటీ చేసిన రెండు స్థానాలలోనూ ఓడిపోయారు.

కేసీఆర్ ఉండగా.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి చోటే లేదు

- మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ - హైదరాబాద్

అభివృద్ధిని మరిచి మతాలు, దేవుని పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ పట్ల యావత్ దేశ ప్రజలు విసుగు చెందారని చెప్పడానికి కర్నాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌ను తిరస్కరించి కర్నాటక ప్రజలు బీజేపీకి చెంపదెబ్బలాంటి తీర్పునిచ్చారని అన్నారు. బీజేపీ 40% కమీషన్ అవినీతి పాలన ఓ వైపు అయితే, మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలు అమ్ముతూ..దేశ సంపద అంతా మోడీ దోస్త్ అదానీకి ధారాదత్తం చేయడంతో ప్రజలు తిరస్కరించారని గుర్తు చేశారు. అక్రమంగా వచ్చిన సొమ్ముతో ప్రభుత్వాలను కూలుస్తూ నీచాతినీచ రాజకీయాలకు ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో వైషమ్యాలు రెచ్చగొట్టి, దేశ భద్రతనే గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అసమర్థ, అవినీతి పాలన వల్ల సిలిండర్ ధర, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటి సామాన్యులు అరిగోస పడుతున్నారని వివరించారు. కర్నాటకలో గెలుపు చూసి తెలంగాణలో ఏమో పొడుస్తామని రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నాడనీ, అది వాపు చూసి బలుపు అనుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో కేసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వానికి తప్పా..ఇప్పటికే తెలంగాణ ప్రజలు తిరస్కరించిన కాంగ్రెస్, బీజేపీకి చోటు లేదన్నారు. దమ్ముంటే మొదలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేసి చూపాలని మంత్రి వేముల సవాల్ చేశారు.

'శుద్ధ' అబద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మున్సిపాలిటీలు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంచినీటి కోసం భారీగానే డిమాండ్ ఉంది. ముఖ్యంగా రూ.10కే 20 లీటర్లు ఇస్తుండటంతో ఫిల్టర్ వాటర్‌ను కొనుగోలు చేసేవారి సంఖ్య బాగా పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని ఎక్కడ పడితే అక్కడ వేలాదిగా వాటర్ ప్లాంట్లు వెలిశాయి. ఇందుకు చిన్నపాటి ప్లాంట్ ఏర్పాటుకు రూ.లక్షలోపే ఖర్చు అవుతోంది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ రాయితీని పొందాలన్నా.. ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ, కాలుష్య నియంత్రమండలి సర్టిఫికెట్ తదితర పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రమాణాలు పాటించే పరిస్థితి లేకపోవడంతో ఈ ప్లాంట్ల ఏర్పాటు కోసం రాయితీ రుణం కోసం వచ్చేవారు లేరని కరీంనగర్ ఇండస్ట్రియల్ శాఖ మేనేజర్ 'నవతెలంగాణ'తో తెలిపారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డు, డివిజన్‌లో కనీసం రెండు చొప్పున, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఒకటి చొప్పున సుమారు 1500 వరకు ఫిల్టర్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఐఎస్ఐ మార్క్ రెండు మాత్రమే ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా..

కరీంనగర్ జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా, అపరిశుభ్ర వాతావరణంలోనే చాలా ప్లాంట్లు కొనసాగుతున్నాయి. సుమారు 500కుపైగా వాటర్ ప్లాంట్లు ఉన్నట్టు అంచనా. చాలా చోట్ల నీటి బబుల్స్ (క్యాన్ల)ను పైపైనే శుభ్రం చేస్తున్నారు. ప్రమాణాలు పాటిస్తున్న దాఖలాలు ఎక్కడా లేవు. వాటర్ ప్లాంట్ల నుంచి టోకుగా నీళ్ల తెప్పించి, వాటిలో నింపుకొని అమ్ముతున్నారు. వారూ సరిగా ట్యాంకులను, పైపులను శుభ్రం చేయకపోవడంతో బ్యాక్టీరియా, ఫంగస్ వంటివి పెరుగుతున్నాయి. ప్రతిరోజూ ఒక్కో ప్లాంట్ నిర్వాహకుడు రూ.2వేల నుంచి రూ.5వేల నీళ్లను అమ్ముకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ లెక్కన రోజుకు సుమారు రూ.30లక్షల నుంచి రూ.40లక్షల మధ్య వ్యాపారం సాగుతోంది. నెలకు రూ.10కోట్ల నుంచి రూ.15కోట్ల మధ్యన మంచినీళ్ల వ్యాపారం సాగుతుందంటే ఈ నీళ్లకు జనం ఎలా అలవాటుపడ్డారో అర్థం చేసుకోవచ్చు.

ప్లాంట్లపై పర్యవేక్షణ లేదు..

రూ.కోట్లలో వ్యాపారం నిర్వహిస్తున్న ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లపై పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారు? ఈ నీటిని ఎవరైనా నమూనాలను సేకరించి నిర్ధారించి అనుమతులు ఇస్తున్నారా? ఈ నీళ్లను శుద్ధి చేస్తున్నారా? లేదా? అని పర్యవేక్షించే వారు లేకుండా పోయారు. పలు సందర్భాల్లో డయేరియా కేసులు నమోదవుతూ ఉండటంతో ఈ నీళ్లపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ప్లాంట్ నుంచి ఇండ్లకు చేరే 20 లీటర్ల వాటర్ క్యాన్‌ను 90సార్లకంటే ఎక్కువగా వాడకూడదు. ఇక్కడ మూడేండ్లు దాటినా అవి పగిలితే తప్ప అవే క్యాన్లను వినియోగిస్తున్న పరిస్థితి నెలకొంది.

జాడ లేని నిబంధనలు...

శుద్ధి చేసిన నీటిని కొంత సమయం తర్వాతే తాగేందుకు వినియోగించాలి. కానీ వెంటవెంటనే పంపించేస్తున్నారు. వాటర్ బబుల్స్‌ను వినియోగించిన ప్రతిసారీ క్లోరిన్‌తో శుద్ధి చేయాలి. ఇది ఎక్కడా జరగడం లేదు. నామమాత్రంగా కడిగి మళ్లీ నీళ్లు నింపేస్తున్నారు. వాటర్ ప్యూరిఫికేషన్ చేసిన తరువాత టోటల్ డిసొల్వడ్ సాలిడ్స్ (టీడీఎస్) 150 ఉండేలా చూసుకోవాలి. అంతుకు మించి ఉంటే ఆరోగ్యానికి హానికరమని నిబంధనలు చెబుతున్నాయి. ప్లాంట్ ఓనర్లు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా టీడీఎస్ పరిమితిని వెయ్యి వరకు తీసుకెళ్తున్నారు. ఈ నీళ్లతో కిడ్నీ, జీర్ణ సంబంధిత అవయవాలు దెబ్బతింటాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్లాంట్ల ఓనర్లు బోరు నీళ్లలో కెమికల్స్ కలిపి మినరల్‌వాటర్‌గా అమ్ముతున్నట్టు విమర్శలూ ఉన్నాయి.

వ్యాధులు సంక్రమిస్తాయి

డాక్టర్ వెంకట్‌రెడ్డి, సిటీ హాస్పిటల్, కరీంనగర్

పరిశుభ్రంగా లేని నీటిని తాగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు ఎక్కువగా ఇబ్బందులు పడతారు. డయేరియా, టైఫాయిడ్, కలరా, హెపటైటిస్ ఏ, డీసెంట్రీ (చీము రక్తంతో విరేచనాలు), కొన్ని సార్లు ప్రాణాపాయం కూడా ఉంటుంది. అందువల్ల నీటి శుద్ధి గురించి అందరూ తెలుసుకోవాలి. టోటల్ డిసాల్వ్ సాలిడ్స్ (టీడీఎస్) 100 నుంచి 300 శాతం లోపు ఉండాలి. ఇది తక్కువైనా, ఎక్కువైనా ఇబ్బందే. ఇలాంటి నీటిని వాడుకోవడం హానికరం.

మోడీ పాలనలో దాడులు పెరిగాయి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో క్రైస్తవులు, క్రైస్తవ సంస్థలపై ఇటీవల జరిగిన దాడులను కాథలిక్ సభ్యుల వేదిక తీవ్రంగా ఖండించింది. దీనిపై తన ఆందోళన వ్యక్తం చేస్తూ భారత కాథలిక్ బిషప్‌ల సదస్సుకు బహిరంగ లేఖ రాసింది. ప్రజా వ్యతిరేక ప్రభుతాన్ని తాము సమర్థించబోమని, మౌనంగా ఉండలేమని ఆ లేఖలో స్పష్టం చేసింది. మణిపూర్ హింస తమను దిగ్భ్రాంతికి, అసహనానికి గురి చేసిందని కాథలిక్కులు ఆ లేఖలో తెలిపారు. మణిపూర్ హింసాకాండలో 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా 200 మంది గాయపడ్డారు. 30 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. మణిపూర్‌లో జాతి ఘర్షణలు చివరికి క్రైస్తవులకు వ్యతిరేకంగా హింసకు దారి తీశాయని కాథలిక్ వేదిక ఆవేదన వ్యక్తం చేసింది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని విమర్శిస్తూ కొందరు బిషప్‌లు బీజేపీ ప్రభుత్వానికి వంత పాడుతున్నారని మండిపడింది. దేశంలోని ముస్లింలు కూడా హింసకు గురవుతున్నారని, వారిని అడ్డు తొలగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వేదిక స్పష్టం చేసింది.క్రైస్తవులపై దాడులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రెండు క్రైస్తవ సంస్థలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశాయి. దాడులను నిరసిస్తూ జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా ఆ తర్వాత కొందరు మత పెద్దలు ప్రధాని మోడీకి వంత పాడుతూ ప్రకటనలు చేశారు. ఈ నేపథ్యంలో కాథలిక్ సభ్యుల వేదిక రాసిన బహిరంగ లేఖ ప్రాధాన్యత సంతరించుకుంది.

దేశానికే ఆదర్శం..ధరణి వ్యవస్థ

- రెవెన్యూ సమస్యల
- పరిష్కారం కోసమే 'ధరణి'
- భూ యాజమాన్యానికి భరోసా
- భూముల క్రయ విక్రయాల నమోదు
- విమర్శలు చేయడం కిషన్‌రెడ్డికి తగదు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'దశాబ్దాల కాలం నుంచి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ రికార్డుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'ధరణి' పోర్టల్‌ను అమలులోకి తీసుకొచ్చింది. కానీ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దాని పట్ల అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ వివరించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రకాల భూ రికార్డుల సమస్యలకు పరిష్కారం చూపుతున్న ధరణి వ్యవస్థపై విమర్శలు చేయడం తగదని అన్నారు. ధరణి ద్వారా ఇప్పటివరకు 95 శాతం వరకు రెవెన్యూ రికార్డుల సమస్యలు పరిష్కారం అయ్యాయని, మిగతా రికార్డుల సమస్యలు త్వరలోనే కొలిక్కి వస్తాయని తెలిపారు. ఆచరణలో ఎదురవుతున్న పాత రికార్డుల సమస్యలు అక్కడక్కడ కొన్ని అధికారుల దృష్టికి వస్తున్నాయని, కుటుంబ కలహాలు, భూముల సరిహద్దు వివాదాలు, పూర్వపు క్రయ విక్రయాల సమస్యలు, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ మాడ్యుల్(టీఎం-33)లో కొన్ని అంశాలు మాత్రమే కలెక్టర్ల వద్ద పరిష్కారం కోసం ఉన్నాయని వివరించారు. వాటిని కూడా దశల వారీగా కొలిక్కి తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. పూర్తిగా పారదర్శకతతో ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న ధరణి సిస్టమ్‌ను తప్పు పట్టడం కిషన్‌రెడ్డికి తగదని, కచ్చితమైన సమస్యను చూపితే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కొన్ని సమస్యలను సాకుగా చూపి మొత్తం ధరణి వ్యవస్థను తప్పు పట్టడం సరికాదని అన్నారు. ఆ వ్యవస్థ అమల్లోకొచ్చిన నాటి నుంచి రెవెన్యూ రికార్డులన్నీ సాఫీగా సాగుతున్నాయని, భూముల క్రయ, విక్రయాల రికార్డులన్నీ వెంటనే నమోదు అవుతున్నాయని చెప్పారు. పాత రికార్డుల్లో మాత్రమే కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని కూడా దశల వారీగా అధికారులు పరిష్కరిస్తున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా అమలు జరుగుతున్న ధరణి వ్యవస్థను కేంద్ర వ్యవసాయ, ఐటీ మంత్రిత్వ శాఖల అధికారులు మెచ్చుకున్నారని తెలిపారు. ధరణీ తరహా వ్యవస్థను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేయాలంటూ కేంద్ర మంత్రిత్వ శాఖల అధికారులు సూచించిన విషయాన్ని వినోద్‌కుమార్ గుర్తు చేశారు.

జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా ఐక్య విద్యార్థి పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశంలో చర్చించారు. సన్నాహక కమిటీ ఐక్య విద్యార్థి ఉద్యమం కోసం డిమాండ్ల చార్టర్‌ను తయారు చేయడానికి ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దేశం కోసం ప్రత్యామ్నాయ ప్రగతిశీల, శాస్త్రీయ, లౌకిక, ప్రజాస్వామ్య విద్యా ఎజెండాను సిద్ధం చేయడంపైనా సమావేశంలో చర్చించారు. ఎన్ఈపీ అప్రజాస్వామిక అమలును ప్రతిఘటించడానికి ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య, ప్రగతిశీల, లౌకిక విద్యార్థి ఉద్యమాల ఉమ్మడి వేదికలను ఏర్పాటుచేయాలని నాయకులు నిర్ణయించారు.ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్బీ, సీవైఎస్-ఎస్, డీఎంకే విద్యార్థి విభాగం, ఎన్ఎస్‌యూఐ, పీఎస్‌యూ, స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ద్రావిడియన్ నేతలు పాల్గొన్నారు. సీఆర్జేడీ, సమాజ్‌వాదీ ఛత్ర సంఘర్ష్, పీఎస్ఎఫ్ సంఘాలు కూడా ఈ సమావేశంలో భాగమవుతాయని హామీ ఇచ్చాయి.ఎజియరాసన్, ఎస్. మోహన్ (డీఎంకే స్టూడెంట్ వింగ్), విక్కీ మహేశ్వర్, ఇంజమాముల్ హసన్, ఎండీ అమీనుయేల్ హసన్ (ఏఐఎస్ఎఫ్), నితీష్ గౌర్ (ఎన్ఎస్‌యూఐ), ప్రసేన్‌జీత్ (ఏఐఎస్ఏ), మయూఖ్ బిస్వాస్, ఆదర్శ్ ఎం. సాజీ (ఎస్ఎఫ్ఐ), ఎండి సఫివుల్లా (పీఎస్‌యూ), గౌతమ్ కెఆర్ (ఏఐఎస్బీ), అరవింద్ బీ, కలియపరుమాల్ (ఎస్ఎఫ్‌డీ) సమావేశంలో తమ సంఘాల నేతలు అభిప్రాయాలను సమర్పించారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వి.పి సాను అధ్యక్షత వహించారు.

ఇక్కడ పనిచేయదు

(మొదటిపేజీ తరువాయి)

పోటి నెలకొనాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీని చావు దెబ్బ కొట్టారు
మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీయాలని చూసిన బీజేపీని కర్ణాటక ప్రజలు చావుదెబ్బ కొట్టారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవా చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీలతో కాంగ్రెస్ నేతలపై కేంద్రం దాడులు చేయించిందని గుర్తుచేశారు. అక్కడ ఊరురా మఠాలు ఉన్నాయని, బీజేపీకి మఠాలపై ప్రేమలేదనే విషయాన్ని ప్రజలు గమనించారని తెలిపారు. దక్షిణ భారత దేశాన్ని, ఆ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను అవమానించిన ఆ పార్టీకి భంగపాటు తప్పలేదని చురకలంటించారు.

భానుడి భగభగ

(మొదటిపేజీ తరువాయి)

ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

వీణవంక(కరీంనగర్)	45.8 డిగ్రీలు
జైన (జగిత్యాల)	45.4 డిగ్రీలు
ధర్మపురి(జగిత్యాల)	45.3 డిగ్రీలు
పమ్మి(ఖమ్మం)	45.0 డిగ్రీలు
సారంగాపూర్(జగిత్యాల)	45.0 డిగ్రీలు
జక్రాన్‌పల్లి(నిజామాబాద్)	45.0 డిగ్రీలు

రైతుల మరణాలు పట్టని సర్కార్.. : వైఎస్‌షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఒకే రోజు ముగ్గురు రైతులు మృతి చెందినా కేసీఆర్ ప్రభుత్వం ఏ మాత్రం స్పందించటం లేదని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్ రైతుల పట్ల హంతకుడిగా మారారని తెలిపారు. డిగ్రీ చదివి నాలుగేండ్లయినా ఉద్యోగం రాక శివకుమార్ ఉరేసుకుంటే.. 20 రోజులైనా వడ్లకు కాంటాలు వేయకపోవటంతో రైతు ఎల్లయ్య గుండె ఆగి చనిపోయారని పేర్కొన్నారు. 15రోజులుగా సమ్మె చేస్తున్నా.. సర్కారు స్పందించక పోవటంతో జీపీ కార్యదర్శి సోనీ తనువు చాలించిందని ఆందోళన వ్యక్తం చేశారు.

'కాంగ్రెస్ గెలుపుతో నూతన ఉత్తేజం'



నవతెలంగాణ-బోడుప్పల్

కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం కలిగిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం కర్నాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన సందర్భంగా బోడుప్పల్, ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా, విద్వేషాలను తిప్పి కొడుతూ కర్నాటక ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామిక విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి, ఫీర్జాదిగూడ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యతో సమాజ అభివృద్ధి



• చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ- సంతోష్ నగర్

విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని శ్రీవాణి ఉమెన్స్ కాలేజ్ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మలక్ పేట్ పరిధిలోని సిమ్లా గార్డెన్ లో శనివారం ఏర్పాటు చేసిన ఫేర్వెల్ పార్టీలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుభాష్ గౌడ్‌తో పాటు చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుతోనే ఉజ్వల భవిష్యతు ఉంటుందన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. నిరుపేద విద్యార్థులకు చదివే ఆయుధం అని చెప్పారు. ఏ దేశ పురోగతి అయిన విద్యతోనే సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విమలారెడ్డి, కాలేజీ అధ్యాపకులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

ట్రాఫిక్ సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎల్బీనగర్ మెట్రో స్టేషన్, చైతన్యపురి కళ్యాణ్ జువెలర్స్ ప్రాంతాల్లో మెట్రో అధికారులు, పోలీసు అధికారులతో కలిసి శనివారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బీనగర్ నుండి నాగోల్ పోయే రహదారిలో భాగంగా ఎల్బీనగర్ ఫ్లైఓవర్ దగ్గర ఎడమవైపు(మసీదు గల్లీ) వెళ్లే ప్రాంతం చాలా ఇరుకుగా ఉండటం వలన ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అక్కడ ఉన్న ఫుట్ పాత్‌ను కొంతభాగం తొలగిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సాఫీగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే చైతన్యపురి కళ్యాణ్ జువెలర్స్ పక్క సందులో మెట్రో రైలు ఎక్కడానికి వచ్చే ప్రయాణికులు అడ్డదిడ్డంగా వాహనాలు పార్క్ చేయడం వలన కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పక్కనే ఉన్న గల్లీలో పార్కింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మెట్రో మేనేజింగ్ డైరెక్టర్‌తో మాట్లాడి సాధ్యమైన త్వరగా ట్రాఫిక్ సమస్యల పరిష్కారం చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాలక్రిష్ణ, చీఫ్ ఇంజినీర్ సాయప్ప రెడ్డి, ట్రాఫిక్ ఏ.సీ.పీ.హరిక్రిష్ణ, గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు ఆడాల రమేష్, తులసి శ్రీనివాస్, నియోజకవర్గ యువజన బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముద్ద కళ్యాణ్, వరప్రసాద్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, తిలక్ రావు, ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీ శ్రేణులదే



• మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ - బోడుప్పల్

సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీ శ్రేణులదే అని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడిపల్లి ఎస్వీఎం హోటల్ లో శనివారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 16న ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పళని కన్వెన్షన్ నందు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధ్యక్షతన ఈ సమ్మేళన కార్యాచరణ, నిర్వహణపై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి డివిజన్ నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చేట్లు ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. సమ్మేళనానికి హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు జరుగకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు, మహిళలు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఘట్కేసర్ :

సంక్షేమ పథకాలే ప్రభుత్వాన్ని గెలిపిస్తాయి



బీఆర్ఎస్ పార్టీ పేదలకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయని కార్మిక శాఖ మంత్రి చామకుర మల్లారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని నారాయణ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సభకు మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు మరువలేరని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ నేతల వల్ల ఎదగలేకపోతున్న అణగారిన వర్గాలు



నవతెలంగాణ-హయత్‌నగర్

అగ్రవర్ణ నేతలు ఎన్నికలను డబ్బు మయం చేయడం వలనే అణగారిన వర్గాల ప్రజలు రాజకీయంగా ఎదగలేకపోతున్నారని తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్, ప్రొఫెసర్ మురళీ మనోహర్ ఆవేదన వ్యక్తంచేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్‌కె గార్డెన్ లో శనివారం రంగారెడ్డి జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 85 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలు ఉన్నా కూడా ఎన్నికల్లో పోటీ చేయాలంటే..కనీసం రూ.కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. బడుగు, బలహీన వర్గాలకు 2023-2024లో జరిగే ఎన్నికలే చివరివని అన్నారు. మళ్ళీ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌లు వస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో విగ్రహాలు పెట్టడం కాదని, సుమారు 8వేల ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని స్పష్టం చేశారు. సామాజిక మార్పుకోసం బలహీన వర్గాలకు చెందిన ప్రజలు డబ్బు తీసుకోకుండా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తమ ఫ్రంట్ ఆధ్వర్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ కన్వీనర్ బొంగు ప్రసాద్, సోషల్ జస్టిస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చామ కూర రాజు, రాష్ట్ర అధ్యక్షుడు కె వీ గౌడ్, శంకర్, లక్ష్మణ్, నగేష్, భూపాల్, వెంకటేష్, అంజి యాదవ్, ప్రభంజన్ యాదవ్, సులోచన, ఆకర్ష్ మమత పాల్గొన్నారు.

ప్రత్యేక విజన్‌తో మహేశ్వరాన్ని అభివృద్ధి చేస్తున్నాం

• మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

ప్రత్యేక విజన్‌తో మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతి డివిజన్లలో సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 20, 21, 23, 28, 31, 32 డివిజన్ల పరిధిలో శనివారం రూ.9 కోట్ల 10 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మేయర్ పారిజాత నర్సింహారెడ్డితో కలిసి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డివిజన్లను ఒక ప్రాతిపదికగా తీసుకొని ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించేందుకు అడుగులు వేస్తున్నామని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, రెండు మున్సిపాలిటీల్లో రూ.2 కోట్లతో మోడ్రన్ దోభీ ఘాట్లు, మోడ్రన్ వైకుంఠ దామాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం...రూ. 4 కోట్లతో బడంగ్ పేట్ , మీర్ పేట్, తుక్కుగూడ, జల్ పల్లి లలో జరుగుతున్నాయన్నారు. బస్తీ దవాఖానలు, అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, డీఈఈలు అశోక్ రెడ్డి, జ్యోతి, కార్పొరేటర్లు బంగారు అనిత ప్రభాకర్, గౌర రమాదేవి శ్రీనివాస్, సూర్ణగంటి అర్జున్, పి.శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు బీమిడి జంగారెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, నాదర్ గుల్ సహకార బ్యాంక్ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి :

సీఎం కేసీఆర్ హయాంలో ఆలయాలకు పునర్ వైభవం

సీఎం కేసీఆర్ హయాంలో ఆలయాలకు పునర్ వైభవం వచ్చిందని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని తెలిపారు. మహేశ్వరంలో ఐదు దేవాలయాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించినందుకుగాను శనివారం విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ మర్యాదపూర్వం కలిసి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్‌కెపురం సరూర్నగర్ డివిజన్లలో అభివద్ధి పనులు, పార్టీ బలోపేతంపై దష్టి పెట్టాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ వీరమల్ల రామ నర్సింహ గౌడ్, గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విశేష ప్రతిభ కనబర్చిన మిలీనియం హై స్కూల్



నవతెలంగాణ-సిటీ బ్యూరో

మిలీనియం హై స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అద్భుత ఫలితాలు సాధించారని స్కూల్ చైర్మన్ రఘు తెలిపారు. ఎస్. సిద్ధార్థ్ 10/10, యు.వేణుగోపాల్ 9.7, బి. రాధ 9.5, ఏ .ఉష 9.5, బేబీ శాలిని 9.5, బి .ముత్యాలరాజు 9.3, ఎం .నేహా 9.3, బి. ప్రసన్న కుమారి 9.3 సాధించినట్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్స్‌కు చీరలు అందజేత



నవతెలంగాణ- ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు సర్కిల్లో పనిచేసే రిసోర్స్ పర్సన్స్ సిబ్బంది ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 50 మంది మహిళలకు రెండు జతల డ్రెస్ కోడ్ చీరలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోన సమయంలో ఇంటింటికి తిరుగుతూ వ్యాక్సీనేషన్ టీకా ప్రచారం చేశారని గుర్తుచేశారు. పొదుపు సంఘాల సమైక్యలు సక్రమంగా సాగుతున్నాయ లేదా అని కూడా పరిశీలించినట్లు తెలిపారు. అలాగే హరితహారం, స్వచ్ఛ హైదరాబాద్, కంటి వెలుగు లాంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో హస్తినపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, పలువురు రిసోర్స్ పర్సన్స్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తోటి పోలీసుల సాయం



నవతెలంగాణ-హయత్ నగర్

ఇటీవల అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మతి చెందారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు అతనితో పాటు విధులు నిర్వహించిన పోలీసులు ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకి వెళ్లితే.. 2001బ్యాచ్ వరంగల్ జిల్లా పీటీసీలో ట్రైనింగ్ పొందిన ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఈశ్వర్ రావు 610జీవోతో ఆంధ్రప్రదేశ్ కు బదిలీ అయ్యారు. అనారోగ్యంతో ఇటీవల అతను మరణించాడు. దీంతో అతని బ్యాచ్ కు చెందిన అనిల్ కుమార్, రామస్వామి, విజయ్ కుమార్, గణేష్, శివ శంకర్‌లు కలిసి శనివారం ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి కార్యాలయంలో మతుడి కుటుంబానికి కొంత నగదు అందజేశారు. వారి వెంట ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజి రెడ్డి తదితరులు ఉన్నారు.

'పది'లో లిటిల్ మాస్టర్ హై స్కూల్ విద్యార్థుల విజయకేతనం



నవతెలంగాణ-సిటీ బ్యూరో

పదో తరగతి పరీక్షా ఫలితాలలో లిటిల్ మాస్టర్ హై స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని స్కూల్ చైర్మన్ ఎస్.కె ఖాదర్ తెలిపారు. ప్రణీత్ 9.8, అజ్మీర్ 9.2, మహతి 9.0, సుజిత్ 8.8, ప్రసన్న 8.7, రేష్మ 8.7, కళ్యాణ్ 8.0 ఫలితాలు సాధించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలే తెలంగాణలో పునరావృతం

• మల్ రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

కర్ణాటక ఎన్నికల ఫలితాలే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో పునరావృతం అవుతాయని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్ రెడ్డి రాం రెడ్డి అన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంపై శనివారం చైతన్యపురిలోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రాం రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటక ప్రజలు అధికార పార్టీ దొంగ హామీలు, అక్రమాలతో విసిగిపోయి.. కాంగ్రెస్ పార్టీతోనే అభివద్ధి సాధ్యమని నమ్మి గెలిపించారని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో కూడా బీఆర్ఎస్ నాయకుల ఆగడాలు, అక్రమాలు, దొంగ హామీలు చూసి విసుగు చెందిన ప్రజలు..ఎన్నికలు ఎప్పుడు వస్తాయా, ఈ దగా కోరు ప్రభుత్వాన్ని ఎప్పుడు ఇంటికి పంపిద్దామా అని ఎదురు చూస్తున్నారని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందన్నారు. తమ కార్యకర్తలే పార్టీకి బలమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంకేపల్లి సుధీర్ రెడ్డి, నరసింహ యాదవ్, లింగాల కిశోర్ గౌడ్, శ్రీనివాస్, బద్దుల వేణు యాదవ్, మంజుల రెడ్డి, మతిన్ భాయ్, సురేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, జానీ బాబా, షరీఫ్, జావిద్, గోవర్దన్, సౌమ్య రెడ్డి, అరుణ్, సోలిపురం వెంకటరామిరెడ్డి, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, వెంకట్ రెడ్డి, రాము, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘట్కేసర్‌లో యూత్ కాంగ్రెస్ నాయకుల సంబురాలు



నవతెలంగాణ -ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపల్ మండల కేంద్రంలో కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సందర్భంగా కాంగ్రెస్ మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కొత్త సుశాంత్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణాలో కూడా కాంగ్రెస్ పార్టీ 100కు పైగా స్థానాల్లో గెలవడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ నాయకులు ముత్యాలు యాదవ్, భాను ప్రకాష్, బొక్క సత్తి రెడ్డి, బద్రి, నర్సింగ్ రావు, సురేష్, బి. వెంకట్ రవి రహ్మాన్ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి శివ ప్రదీప్ రెడ్డి, మేడ్చల్ మండల అధ్యక్షులు సల్ల వెంకటేష్, పోచారం అధ్యక్షులు యుగేందర్ రెడ్డి, కార్తీక్ యాదవ్, సాయి చరణ్ రెడ్డి, గణేష్ నాయక్, మల్లేష్, ఆశ్రఫ్, రఫీ, యాయా తదితరలు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో కూడా కర్ణాటక ఫలితాలే వస్తాయి

• రాష్ట్ర నాయకులు ఉపేందర్ రెడ్డి



నవ తెలంగాణ - చైతన్యపురి

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటక ఫలితాలే తెలంగాణలో కూడా పునరావతం అవుతాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుతో శనివారం ఆర్కేపురంలో ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ప్రజలు విద్వేష రాజకీయాలు చేసిన బీజేపీకి బుద్ధి చెప్పి..కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టారని అని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ పాలనకు చరమ గీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని జోస్యం చేప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేష్ నేత, రాజ్ నాయక్, శేఖర్, మహేందర్, శ్రీశైలం, కిరణ్, అక్బర్, భాస్కర్, ప్రేమ్, శ్రీకాంత్ రెడ్డి, సంతోషేచ్, అంజి, విజయ్, అనిల్, శేఖర్, నవీన్, విప్లవ్, పింటూ, రాజు, కష్ణ, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్లాట్ కబ్జాపై ఉషారాణి దంపతులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు'



నవతెలంగాణ - ఘట్కేసర్

ప్లాట్ కబ్జాకు యత్నించారంటూ ఉషారాణి దంపతులు చేసిన ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదని ఘణపూర్ ఇంచార్జి సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ వేముల పరమేష్ గౌడ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం విలేకర్ల సమావేశంలో వారు ఈ ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘట్కేసర్ మండలం ఘణపూర్ సర్వే నంబర్ 1134, ప్లాట్ నంబర్ 57లో వంచాయతీ బోర్డు నాటి, తమ ప్లాటు కబ్జాకు ఇంచార్జి సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు యత్నిస్తున్నారంటూ బాధితులు ఉషారాణి దంపతులు గ్రామ పంచాయతీ ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేస్తూ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ రికార్డు ప్రకారం అట్టి లే అవుట్‌లో 56 నంబర్ వరకే ప్లాట్లు ఉన్నాయని, ఉషారాణికి విక్రయించిన వారు ఓపెన్ స్థలానికి నంబర్ వేసి విక్రయించి ఉండవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో జిల్లా అధికారులకు పంపించిన దానిలో స్పష్టంగా ఓపెన్ స్థలంగా ఉందని, అవసరమైతే జిల్లా అధికారుల వద్ద రికార్డులు పరిశీలించుకోవచ్చునని, దీనిలో తమ ప్రమేయం ఏమి లేదన్నారు. కావాలనే మాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ స్థలం కబ్జాకు గురవుతుంటే గ్రామ పంచాయతీ నుండి పంచాయతీ కార్యదర్శి బోర్డు నాటించారని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వర్త్య పవన్ నాయక్, గుగులోత్ కాంతమ్మ, కో ఆప్షన్ సభ్యుడు నానావత్ సురేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు వేముల సత్తయ్య గౌడ్, వేముల శంకర్ గౌడ్లు పాల్గొన్నారు.

పల్లె రవిని కలిసిన బేర బాలకిషన్



నవ తెలంగాణ- చైతన్యపురి

సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారుడు పల్లె రవి తెలంగాణ గీత కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ జనరల్ సెక్రెటరీ బేర బాలకిషన్ (బాలన్న) శనివారం రవిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కుల శ్రీశైలం, బబ్బురి ఆనంద్ కుమార్ గౌడ్, గుండె గోని బాలగౌడ్, జయశంకర్, గిరి, ఐలయ్య యాదవ్, కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్లు చెగోని అశోక్ గౌడ్, సిరిపురం రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ - చైతన్యపురి

వ్యక్తి అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలకాపురి కాలనీ యాదవ నగర్‌లో నివాసం ఉండే గోడ హను మంతు(55) ఈ నెల 1వ తేదీన ఇంట్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బయటికి వెళ్లాడు. అతనికి ఫిట్స్ తరచూ వస్తుందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో కూడా రెండుసార్లు ఇంట్లో నుండి బయటకు వెళ్లి వారం తర్వాత తిరిగి వచ్చాడని చెప్పారు. ఈ నెల 9న కుటుంబ సభ్యులు చైతన్యపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టెన్త్‌లో 'ఢిల్లీ పబ్లిక్ స్కూల్' ప్రభంజనం



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభంజనం సష్టించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. సురవరపు ప్రణయ రెడ్డి, కొయ్యడ శ్రీజ, శ్లోక కుమార సింగ్, బోయాపల్లి శ్రీ భవ్య, అనన్య మోడీ, మహాలక్ష్మి, పూజిత, శర్మ హరి విఘ్నేష్, అకయ రెడ్డి, ఆదిత్య, హరి, సాయి శ్రియ, శ్రీ హర్షిని, కుమార్ శివ వెంకట్ విష్ణు వర్ధన్, మనోజ్ గన్యలు స్కూల్ ఫలితాల్లో విజయం సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో సత్తా చాటిన పేజీ స్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-సిటీ బ్యూరో

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పేజీ స్కూల్ విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని స్కూల్ చైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. ఎన్. సాయి తేజ 9.8, ఎన్. మనోజ్ఞ 9.7, ఎన్. జాహ్నవి 9.5, ఎం. గణేష్ రెడ్డి 9.5, బి. అక్షయ్ కుమార్ 9.3, సిహెచ్. మనోజ్ఞ 9.3, కే. సాయి గణేష్ 9.3, డి. సంజన 9.3, పునర్ 9.3 సాధించినట్లు చైర్మన్ వివరించారు. అనంతరం విద్యార్థులను అభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కే. భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వారణాసిలోని కాశీలో జరుగుతున్న 'గంగా హారతి' కార్యక్రమంలో పాల్గొని హారతి ఇస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త, స్వప్న దంపతులు.

నవతెలంగాణ - నాగోల్

పనుల పరిశీలన

నవతెలంగాణ-కాప్రా



మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ మరమ్మత్తు పనులకు సోమవారం శంకుస్థాపన చేయనున్న నిమిత్తం కాలనీ వాసులతో కలిసి ముందస్తుగా కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పర్యవేక్షించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ కాలనీవాసుల సూచనలు, సలహాలు తీసుకుంటూ ఈ కమ్యూనిటీ హాల్ మరమ్మత్తులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, కాలనీ అధ్యక్షులు రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి, కోశాధికారి జి.రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శులు మూర్తి, ప్రచార కార్యదర్శి బి.శ్రీనివాస్ రెడ్డి, యాదవ రెడ్డి, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గోగినేని వారిపాలెం, ప్రకాశం జిల్లాకు చెందిన కోటేశ్వర రావు (45) నాగారం మున్సిపాలిటీ ఆర్.ఎల్.నగర్ లో తన కుటుంబంతో కలిసి కొన్నేండ్లుగా నివాసం ఉంటున్నారు. కోటేశ్వర రావు వృత్తిరీత్యా తాపీ మేస్త్రి, శనివారం సొంత ఊరికికి వెళ్ళిన కోటేశ్వర రావు వారం రోజుల తర్వాత చీర్యాల గ్రామ సమీపంలోని సాయి నగర్ కాలనీలో చెట్టుకు ఉరేసుకుని శవమై కనిపించడంతో కోటేశ్వర కుటుంబ సభ్యులలో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కీసర పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలం దగ్గరకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

సైబర్ నేరాల పట్ల పోలీసులు, విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-నాచారం



సైబర్ నేరాల పట్ల పోలీసులు, విద్యార్థులకు శనివారం సైబర్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నాచారం సెయింట్ ఫాయిస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సాంకేతికత విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన తరుణంలో ప్రజలను మోసం చేసేందుకు కొందరు మోసగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతూ ప్రజలను ఈజీగా మోసం చేస్తున్నారు. నేరస్తులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారనే విషయాన్ని సైబర్ క్రైమ్ పోలీసులు ప్రొజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ప్రజలకు వివిధ రకాల ఆశలు రేకెత్తించి ఉద్యోగాల పేరుతో, ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరుతో, ఆన్‌లైన్ గేమ్ మూల పేరుతో ఓటీపీ పంపించి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురి కాకుండా యువతాపరమతంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియా అడ్వర్టైజ్మెంట్, అనవసరపు యాప్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దని పోలీసులు సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీస్ విభాగం టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి గాని, 100కు డయల్ చేసి సమాచారం అందించాలనీ, రాచకొండ పోలీస్ కమిషనరేట్ వాట్సాప్ నంబర్ 8712662111 కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ సైబర్ క్రైమ్ డీసీపీ అనురాధ, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశం, మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్ కుమార్, నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి, ఎస్సైలు నాగరాజు, నాగ సురేష్, సెయింట్ పాయిస్ కళాశాల ప్రిన్సిపాల్ వేలంగిని, వివిధ విభాగాల ప్రతినిధులు, విద్యార్థినులు అందరు పాల్గొన్నారు.

పది, పన్నెండో పరీక్షల్లో డీపీఎస్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-నాచారం

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఫైనల్ బోర్డు పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన సీబీఎస్‌సీ పది, పన్నెండో తరగతి విద్యార్థులను ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మెన్ మల్కా కొమరయ్య అభినందించారు. శనివారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుంచి ప్రణాళిక బద్ధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఈ విషయాన్ని నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రుజువు చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. 99.3 శాతం మార్కులను సాధించి పాఠశాల పేరు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం విద్యార్థులకు గుర్తింపు లభించడం ప్రణాళిక బద్ధంగా పాఠాలు బోధించడం ద్వారానే సాధ్యమైందన్నారు. ఇంత గొప్ప ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి, పట్టుదల తోడుకావడం భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించుటకు దోహదపడుతుందన్నారు. ఉన్నత స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు స్థానం సంపాదిస్తే అంతకంటే గర్వకారణం ఏముంటుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఏ సహకారం కావాలన్నా చైర్మెన్‌గా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని విద్యార్థులకు హామీనిచ్చారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ప్రణవ్ చౌరాసియా 596/600, 99.3శాతం మార్కులు సాధించి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మొదటి స్థానంలో నిలిచారు. సత్యార్థ్ శివకుమార్ అయ్యర్ 593/600, 98.8 శాతం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. గోటూరి షణ్ముఖ శ్రీ హర్ష 592/600,98.7 శాతం మార్కులతో తృతీయ స్థానం, చంద్రిక శ్రీష్ నారాయణ్ 591/600, 98.5 శాతం మార్కులతో నాలుగో స్థానం, హర్షవర్ధన్ రవిచందర్ 590/600, 98.3 శాతం మార్కులతో ఐదో స్థానంలో నిలిచారు. వీరితోపాటు 98 మంది విద్యార్థులు 95శాతం, 231 మంది విద్యార్థులు 90 శాతం, 445 మంది విద్యార్థులు 80శాతం, 573 మంది విద్యార్థులు 70శాతం, 663 మంది విద్యార్థులు 60 శాతం మార్కులు సాధించి ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ని మొదటి స్థానంలో నిలిపారు. పన్నెండో ఫలితాల్లో ప్రభంజనం సృష్టించి సీబీఎస్ బోర్డు పరీక్షల్లో మొదటి స్థానంలో నాచారం డీపీఎస్‌ను నిలబెట్టిన విద్యార్థులను అభినందించారు. చైర్మన్ మల్కా కొమరయ్య చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, పుష్పగుచ్చాలను అందించి విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునితారావు, వైస్ ప్రిన్సిపాల్ నందిత సుంకర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్ క్రాస్ రోడ్డు నుంచి చర్లపల్లి వరకు వీధి దీపాలు



నవతెలంగాణ-నాచారం

ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ క్రాస్ రోడ్డు నుంచి చర్లపల్లి ప్రధాన రహదారి వరకు వీధి దీపాలను ఏర్పాటు చేసి ప్రారంభించినట్టు ఉప్పల్‌ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తెలిపారు. పారిశ్రామిక వాడకు వెళ్లేందుకు ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వాహనాలు కార్మికులు చీకటిలో ప్రమాదాలు జరుగుతున్నాయని తమ దృష్టికి రాగా వెంటనే జీహెచ్‌ఎంసీ విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీధిదీపాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెండు మూల మలుపుల వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి ఆ ప్రాంతం మొత్తం వెలుగులు నింపినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ డీఈ రవీంద్ర, ఏఈ ప్రత్యూష, స్థానిక నాయకులు నాగారం బాబు, భూసాని రఘు, బాసిత్ ఖాన్, నాగేందర్, మురళి, ప్రకాష్, రమణ, రామంజి, కుమార్, ప్రవీణ్, పాల్గొన్నారు.

మానవాళికి ప్రాణవాయువు చెట్టు

నవతెలంగాణ-నాచారం



శ్రీ మహంకాళి సైతా మహాకాళేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు వేదాంతం నరసింహమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ప్రత్యేకమైన రోజుల్లో ఓ మొక్కను నాటి దాన్ని సంరక్షించడం ద్వారా ప్రజలకు ప్రాణవాయువును అందించిన వారవుతామని తెలిపారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో వెంకన్న, స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, పోగుల వెంకటరమణారెడ్డి, సీఎస్ బ్రదర్స్ మల్లేష్, గద్ద యుగేందర్, రాగిరి మోహన్ రెడ్డి, పాండురంగంగా గౌడ్, శ్రీరామ్ సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, సుగుణాకర్, కట్ట బుచ్చి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మచ్చ బొల్లారంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



హాత్ సే హత్ జోడో అభియాన్ యాత్ర 50 రోజు శనివారం మచ్చ బొల్లారం డివిజన్‌లో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ పాల్గొని గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను పూసకూచ్చినట్టు ప్రజల్లో ప్రచారం చేసినట్టు చెప్పారు. 50 రోజులుగా కొనసాగుతున్న ఈ యాత్ర విజయోత్సవ శుభ సందర్భంలో కేక్‌ను కట్ చేసి అభినందనలు తెలుపుకున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపొందిన సంబురాల్లో మునిగి తేలారు. ఈ కార్యక్రమంలో గుత్తి రామచందర్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, అప్సర్, సీఎల్ యాదగిరి, కృష్ణ గౌడ్, శ్రీ పాల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పవన్, సూర్య ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్, బలరాం, సంతోష్ రెడ్డి, సాయి కుమార్, రాజు, వీనస్, మేరీ ఫాహీం, నిర్మల, విజయలక్ష్మి, సుభాషిని, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి విరాళం

నవతెలంగాణ-నాచారం



నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌లోని సాయి బాబా ఆలయానికి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ విరాళం అందజేశారు. సాయి బాబా ఆలయంలోని పాలరాతి బాబా మండప నిర్మాణానికి వంతు సహాయంగా రూ.లక్ష విరాళం అందజేసినట్టు తెలిపారు. దాతల సహకారంతోనే ఆలయాలు ఆధ్యాత్మిక చింతన కేంద్రాలుగా విరాజిల్లుతాయని తెలిపారు. మనిషి ఎంత సంపాదించింది ముఖ్యం కాదు. తాను సంపాదించిన దానిలో కొంత దానం చేస్తే మానవ జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొమరవెల్లి మల్లన్న ట్రస్ట్ బోర్డు మెంబర్ మల్లేష్ యాదవ్, స్థానికులు విఠల్ యాదవ్, సీఎస్ బ్రదర్స్ మల్లేష్, సాయిజెన్ శేఖర్, హరికృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా టీకేఆర్ వార్షిక దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



మీర్‌పేటలోని టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ మూడు రోజుల వార్షిక దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రెండో రోజు గాయని నేహా కక్కర్ కచేరీతో విద్యార్థులు సందడి చేశారు. మూడో రోజు రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ హాజరయ్యారు. రెండో రోజు ఇండియన్ ఐడల్ న్యాయనిర్ణేత తన అద్భుతమైన ప్రదర్శనతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సంగీత ప్రియులతో కూడిన నేహా కక్కర్ కచేరీ కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య కొనసాగింది. విద్యార్థులు ఆనందంతో చప్పట్లు కొట్టారు, హూట్ చేసారు, డ్యాన్స్ చేసారు, కేకలు వేస్తూ నేహా కక్కర్‌తో ట్యూన్‌లో పాటలు పాడారు. కచేరీకి ముందు టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు తీగల కృష్ణారెడ్డి క్యాంపస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన చివరి శ్వాస వరకు విద్యార్థులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. భూసేకరణ పనులు కొనసాగుతున్నాయనీ, షార్ట్ మెడికల్ కాలేజీని ప్రారంభించాలని కోరారు. టీకేఆర్ కాలేజీ 2000 సంవత్సరంలో కేవలం 240 మంది విద్యార్థులతో ఇంజినీరింగ్ సంస్థను ప్రారంభించింది. ఇప్పుడు 11వేల విద్యార్థుల సంఖ్యగా మారింది. టీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, ఫార్మసీ కాలేజీ, మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్ ఉన్న మీర్‌పేట్ ప్రాంతంలో టీకేఆర్ సంస్థల ఏర్పాటుతో 35 వేల జనాభా నుంచి 1.75కు పెరిగిందన్నారు. సీపీ డీఎస్ చౌహాన్ విద్యార్థులందరికీ వారి భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ పాపన్న గౌడ సేన ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం నేరేడ్‌మెట్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే వివేక్, అంజయ్య గౌడ్ హాజరై విగ్రహ ఆవిష్కరణ చేశారు. పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి గోల్కొండ కోటతోపాటు తెలంగాణ ప్రాంతంలో సుమారు 32 కోటలను జయించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ గౌడ్ అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన భారత దేశపు తొలి గొప్ప బహుజన చక్రవర్తి అని ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించి సహకరించిన మల్కాజ్గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు కార్పొరేటర్లు మీనా ఉపేందర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సర్కిల్ ఉపాధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ఎస్ఆర్ ప్రసాద్, నక్క ప్రభాకర్ గౌడ్, సతీష్‌కుమార్, రామూబాబు యాదవ్, చెన్నారెడ్డి, సాయిగౌడ్, రాజు, బాబు, సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ వీర హనుమాన్ ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-బేగంపేట్



శ్రీవీరా హను మాన్ ఆలయం నగరంలోఅత్యంత ప్రసిద్ధిగాంచిన ఆలయంగా పేరొందిందని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రా బాద్ ఎస్పీ రోడ్డులోని శ్రీ వీర హనుమాన్ ఆలయంలో నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులతో దేవదాయశాఖ సహాయ కమిషనర్ కృష్ణ ప్రమాణస్వీకారం చేయంచారు. ఈ సందర్భంగా మంత్రి నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందన్నారు. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపర్చడంలో ప్రభుత్వం తనవంతు సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, కిషోర్, జైరాజ్, వాసు, తదితరులు పాల్గొన్నారు..

బీఎల్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-కాప్రా



బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ నేమూరి మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో చర్లపల్లి డివిజన్ పరిధిలోని క్రీడాకారులకు వీవీ ఆరేనా క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి క్రీడా కార్యక్రమాలు చేపడుతున్న బండారి లక్ష్మారెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జేన్ శేకర్, బద్రుద్దున్, ఏఎస్‌రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, కొత్త అంజిరెడ్డి, బొడిగ రాజు గౌడ్, ప్రభాకర్ రెడ్డి, బొడిగ రవి, ఆనంద్ రాజు గౌడ్, మహేందర్, మధుసుధన్, యాదిరెడ్డి, రహీమ్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేద్దాం.. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేద్దాం

నవతెలంగాణ-నాచారం



కలిసికట్టుగా పని చేద్దాం.. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేద్దామని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం చాయ్ పై చర్చ నాచారం సుప్రభాత్ హోటల్‌లో కాంగ్రెస్ నాయకులు మేడల మల్లికార్జున గౌడ్, నవీన్‌తో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే కాలంలో కాంగ్రెస్‌కు ఉప్పల్ నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకురావాలంటే కలిసికట్టుగా కారుణ్య దీక్షతో పని చేస్తేనే సాధ్యమవుతుందన్నారు. చాయ్ పై చర్చ పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను కలిసి భవిష్యత్తు రాజకీయ పరిస్థితులను వివరిస్తూ కలిసికట్టుగా పని చేద్దాం అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు నెల్లుట్ల శ్రీనివాస్ గౌడ్, కాప్రా సర్కిల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పొన్నాల రాజు, నాయకులు రాములు గౌడ్, గౌస్ పాషా, కార్తీక్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఎండోమెంట్ స్థపతి ప్రతినిధి వళినాయగంతో కలిసి పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. అనంతరం పండితులు ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, ఈవో వీరేశం, డివిజన్ నాయకులు బాల్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్,పాల్గోన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-మల్కాజిగిరి



పదో తరగతి ఫలితాల్లో మల్కాజిగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం కొనసాగిందని ప్రిన్సిపాల్ జి.హారిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఏడుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ఏడు మంది ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు. కె.హారిక 9.8, ఈ.పూజిత 9.5, సి.ప్రణతి 9.3 జీపీఏ సాధించగా ఇద్దరు విద్యార్థులు 9 జీపీఏ, ఇద్దరు విద్యార్థులు 8 జీపీఏ సాధించారని తెలిపారు. క్రమశిక్షణకు మారు పేరుగా, ఉత్తమ విలువలతో చక్కటి విద్యాబోధన అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆకాక్షించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు. కుషాయిగూడ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా 11 కెవి కమలానగర్ ఫీడర్,11కెవి కుషాయిగూడ ఫీడర్, సాయిబాబా టెంపుల్ ఫీడర్, 33 కెవి, కుషాయిగూడ, సబ్ స్టేషన్ పరిధిలోని నార్త్ కమలానగర్, కుషాయిగూడ, వెంకటేశ్వర స్వామి టెంపుల్, పద్మావతి కాలనీ ఏపీఐఐసీ కాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా, కుషాయిగూడ ఫేస్ 2, ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అంతరాయానికి సహకరించాలని వారు కోరారు.

మేడిబావిలో కార్పొరేటర్ హేమ పర్యటన

నవతెలంగాణ-ఓయూ



మేడిబావి ఆర్య సమాజ్ ప్రాంతంలో కార్పొరేటర్ సామల హేమ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటర్‌లో ప్రెజర్ వస్తుందని ఆమె దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో హై ప్రెజర్‌తో నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. పవర్ బోర్స్ రిపేర్ చేయాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి త్వరగా రిపేర్ చేయాలనీ, ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనిత, ఎర్ర జ్యోతి, కాలనీ వాసులు సత్యనారాయణ, నరేష్‌హరి, తదితరులు పాల్గొన్నారు.

జింఖానా మైదానంలో దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్

నవతెలంగాణ-కంటోన్మెంట్



జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన దుబాయ్ సిటీ ఎగ్జిబిషను బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు లాస్యా నందిత ప్రారంభించారు. జింఖానా మైదానంలో దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్ పెట్టడం చాలా సంతోషంగా ఉందనీ, చిన్నారులకు, విద్యార్థులకు ఎంతగానో ఈ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటుందన్నారు. మన్నిక గల రెండు వందల రకాల వస్త్రాభరణాలతో పాటు వంద రకాల తినుబండరాలు కూడా అందుబాటులో ఉన్నాయనీ, ఈ అవకాశాన్ని హైదరాబాద్ నగర ప్రజలు వినియోగించుకోవాలని మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం ఎగ్జిబిషన్ నిర్వాహకులు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు నివేదిత, టీఎస్ శ్రీనివాస్, ముప్పిడి మధుకర్, సదానంద్ గౌడ్, మురళి యాదవ్, భాస్కర్, ఎగ్జిబిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల అభివృద్ధికి సర్కార్ కృషి

ఓయూ : మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ భవన, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి వారి అధ్వర్యంలో జరిగిన మెడికల్ క్యాంపునకు కార్పొరేటర్ సామల హేమ హాజరయ్యారు. రిజిష్టర్ చేసుకున్న నిర్మాణ రంగ కార్మికులకు ఆరోగ్య పరీక్ష కార్డులను కార్పొరేటర్ అందజేశారు. సీఎం కేసీఆర్ భవన నిర్మాణ కార్మికుల కోసం ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ క్యాంపును లేబర్ కార్డు ఉన్న భవన నిర్మాణ కార్మికులు వినియోగించుకోవాలన్నారు. దుమ్ము ధూళితో కష్టపడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం మండలి ద్వారా రక్తపోటు, రక్తచక్కెర, చెవి, కంటి, ఊపిరితిత్తులు, రక్తం, మూత్ర పరీక్షలను అనుభవజ్ఞులైన డాక్టర్లతో చేయిం చినట్టు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విజయ్, బీఆర్ఎస్ నాయకులు శైలేందర్, అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

16న సీఎం కేసీఆర్‌కు ధన్యవాద సభ



నవతెలంగాణ-బంజారాహిల్స్
దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల బీఆర్ విగ్రహాన్ని నెలకొల్పడం, రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు నామకరణం చేసినందుకు ప్రజాసంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు అభినందన ధన్యవాద సభను ఈ నెల 16వ తేదీన ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ఎస్సీ, గిరిజన, బీసీ, మైనారిటీ, వికలాంగుల, వయోజనుల సంక్షేమ శాఖామంత్రి కొప్పుల ఈశ్వర్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్ తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసంలో తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మెన్ గజ్జల కాంతం, వివిధ కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రయివేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఓయూ గిరిజన రాష్ట్ర నేత డా.సంజీవ్ నాయక్, మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



నవతెలంగాణ-ఓయూ
ఉచిత వైద్య శిబిరాన్ని అవసరమైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు మద్దెర్ల శ్యాంసుందర్ పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరుల జ్ఞాపకార్థం బీజేపీ మెడికల్ సెల్, మద్దెర్ల శ్యాంసుందర్ ఆధ్వర్యంలో సీతాఫల్ మండి డివిజన్ పరిధిలోని చిలకలగూడ చౌరస్తాలో శనివారం రెండు రోజుల ఉచిత మెడికల్ క్యాంపు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు వైద్య పరీక్షలు, డెంటల్, బ్లడ్, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అల్లోపతి, ఆయుర్వేద మందులను కూడా పేషెంట్లకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. శిబిరాన్ని బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమని, రవి ప్రసాద్ గౌడ్ సందర్శించారు.

సుందరయ్య జీవితం ప్రజలందరికీ ఆదర్శం

- ఎస్వీకే ట్రస్ట్ సభ్యులు జి.రఘుపాల్
- రహీంపుర గ్రౌండ్‌లో సుందరయ్య స్మారక ఆటల పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-ధూల్‌పేట్
వీర తెలంగాణ సాయుధ పోరాటంకు నాయకత్వం వహించిన ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అనీ, ఆయన జీవితం ప్రజలందరికీ ఆదర్శనీయమని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు జి.రాఘుపాల్ అన్నారు. సుందరయ్య 38వ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా శనివారం రహీంపురా ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన ఆటల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆర్థిక సమస్యలపైననే కాక, సామాజిక సమస్యలైన అంటరానితనం, కులవివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు సుందరయ్య అన్నారు. ఆయన వ్యక్తిగత జీవితం ప్రజలందరికీ ఆదర్శనీయం అని గుర్తుచేశారు. సమయం పాటించడం లోను, ప్రజా సమస్యలపై అన్ని కోణాల్లో అధ్యయనం చేసి చట్ట సభల్లో ప్రత్యామ్నాయ పరిష్కారాలను చూపిన తీరు ఆనాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మెప్పు పొందగలిగారన్నారు. తన స్వంత ఆస్తిని పేద ప్రజలకు పంచి ప్రజల్లో మమేకమైన వ్యక్తి అన్నారు. ప్రపంచ మహానాయకుల్లో పుచ్చలపల్లి సుందరయ్య పేరు చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆయన పేరు మీద జరుగుతున్న ఆటల పోటీలు ప్రారంభించడం తనకు సంతోషాన్ని కల్గించిందని ఆయన పేర్కొన్నారు. మ్యూజికల్ చైర్స్, కబడ్డీ, లెమన్ స్పూన్ తదితర ఆటల పోటీల్లో హైదరాబాద్ సౌత్ జిల్లా పరిధిలోని మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 19న బాగ్ లింగంపల్లిలో సుందరయ్య 38వ వర్ధంతి సభలో బహుమతులు ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నాహక కమిటీ సభ్యులు పి.శశికళ, ఎల్.కోటయ్య, కవిత, కే. జంగయ్య, నాగమణి, స్వరూప, విజయ, పి.నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

18న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా

- జర్నలిస్టులకు హెచ్‌యూజే పిలుపు



నవతెలంగాణ-సిటీబ్యూరో
జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం ఈ నెల 18వ తేదీన ఇందిరాపార్క్ దగ్గర తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని హెచ్‌యూజే జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) కార్యవర్గ సమావేశం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, జగదీశ్వర్ మాట్లాడుతూ ఈ మహాధర్నాలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొంటేనే సమస్య తీవ్రత ప్రభుత్వం దృష్టికి చేరుతుందన్నారు. హక్కుల సాధన కోసం అందరూ కదిలి రావాలన్నారు. ఐక్యంగా పోరాడితేనే విజయం సాధిస్తామని హెచ్‌చూజే సమావేశం తీర్మానించినట్టు తెలిపారు. రాష్ట్ర రాజధాని కేంద్రంగా పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ రాష్ట్ర సర్కార్ ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిందేనన్నారు. కొన్నేండ్లుగా ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్న ప్రభుత్వం.. ఆ దిశగా కార్యచరణ చేపట్టడం లేదన్నారు. సుప్రీంకోర్టు కేసు క్లియర్ అయ్యిందనీ,, ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకున్నా ఇండ్ల స్థలాల విషయాన్ని పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే అర్హులైన జర్నలిస్టుందరికీ ఇండ్ల స్థలాలు అందేలా ఒక ప్రతిపాదనను అమలు చేయాలని కోరారు. మూడు, నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నందున.. ఆ లోపే రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే ఆధ్వర్యంలో దశల వారీగా వివిధ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. సంతకాల సేకరణ, రిలే దీక్షలు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వడం వంటివి పూర్తి చేయగా.. 18న మహాధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘు, విజయానంద్, కార్యదర్శులు చంద్రశేఖర్, నిరంజన్, హెచ్‌యూజే నాయకులు గంద్ర నవీన్, రాజశేఖర్, మధుకర్, క్రాంతి, ప్రశాంత్, శ్రీనివాస్, కాలేబు, జహంగీర్, విజయ, తలారి శ్రీనివాస్, సర్వేశ్వర్, నర్సింహా, వెంకట స్వామి, రేనయ్య, శ్రీధర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని దేశమంతా ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్. బోస్, ఈ.టి. నరసింహ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
నిరంకుశ ప్రజా వ్యతరేక బీజేపీని దేశమంతటా చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్. బోస్, ఈ.టి. నరసింహ పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు దేశాన్ని వినాశనం వైపు నెట్టుతున్నాయనీ, నియంతృత్వ మోడీ పాలనను వచ్చే ఎన్నికల్లో అంతం చేయాలన్నారు. "బీజేపీ హటావ్- దేశ్ బచావ్" కోరుతూ ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి హైదరాబాద్, మొజంజాహి మార్కెట్ చౌరస్తా నుండి ఉస్మాన్ గంజ్, సిద్ది అంబర్ బజార్, అఫ్జల్ గంజ్, బేగం బజార్, ఫీల్ ఖానా ప్రాంతాల్లో శనివారం పాదయాత్ర నిర్వహించింది. పార్టీ శ్రేణులు ఇంటింటికి, వ్యాపార సముదాయాలు తిరిగి కరపత్రాలు అందజేసి కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతరేక విధానాలను ప్రజలకు వివరించి వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఓడించి దేశాన్ని రక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వి.ఎస్. బోస్ మాట్లాడుతూ దేశంలోని సామాన్య ప్రజల సమస్యలు పట్టించుకోకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దృష్టి మాత్రం ప్రజలను విభజించడంపైనే ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వ విభజన రాజకీయాలు దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రజాస్వామ్యంపై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడి ఎమర్జెన్సీ కంటే దారుణం అనీ, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రధాని మోడీ తీసుకువచ్చిన రైతు, కార్మిక, ప్రజా వ్యతరేక నిరంకుశ నల్ల చట్టాలతో దేశ ప్రజల మెడకు ఉచ్చు మరింత బిగుసుకుందని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే బీజేపీ ప్రభుత్వం అణచివేత విధానాలతో ప్రజల గొంతు నొక్కుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడేందుకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ.టి.నరసింహ మాట్లాడుతూ బీజేపీ ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశమంతా దోపిడీకి గురవుతోందన్నారు. కేవలం అదానీ, అంబానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలే లాభపడుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం బూటకపు వాగ్దానాలు, పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆకలి, పేదరికంతో ప్రజలు తల్లడిల్లుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో సమాజంలోని అన్ని వర్గాలు దాడులను ఎదుర్కొంటున్నాయనీ, ముఖ్యంగా ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళలు తీవ్రంగా దెబ్బతింటున్నారన్నారు. బీజేపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు బరితెగించి మహిళలపై లైంగికదాడులు, హత్యలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగంపై బీజేపీకి నమ్మకం లేదనీ, ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద మన దేశాన్ని పరిరక్షించుకోవడానికి దేశవ్యతిరేక, అప్రజాస్వామిక బీజేపీని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అధికారం నుంచి గద్దె దించడమే కర్తవ్యంగా ప్రజలు భావించి ఓడించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ హైదరాబాద్ పాతబస్తీ అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. మోసపూరిత హామీలు ఇవ్వడం, ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయడం తప్ప అభివృద్ధి పనులు ఏమీ జరగడం లేదన్నారు. ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో జీహెచ్ఎంసీ పూర్తిగా విఫలమైందన్నారు. పాతబస్తీలో అభివృద్ధి జరగకపోవడానికి ఎంఐఎం కారణమన్నారు. పాతనగరంలో కొత్తనగరంలాగా అభివృద్ధి చేస్తామనీ, మెట్రో రైల్ పనులను ప్రారంభిస్తామనీ, రహదారుల విస్తరణాలు, డబల్ బెడ్ రూమ్ ల నిర్మాణాలు, ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణం చేపడుతామని మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే స్పందించి పాతనగరంలో అభివృద్ధి చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రమోహన్ గౌడ్, నిర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, నగర నాయకులు గ్యార నరేష్, బైరగోని రాజుగౌడ్, ఆరుట్ల రాజ్‌కుమార్, ఒమర్ ఖాన్, లతీఫ్, కొమురెల్లి బాబు, సీహెచ్.జంగయ్య, జె.కుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎండాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



వేసవికాలంలో ప్రజలు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని బొగ్గులకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి ప్రియాంక అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజల ఇంటి వద్దకు తమ ఆశా వర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు, చిన్నపిల్లలు ఎండకు వెళ్లకూడదని సూచించారు. ఎక్కువగా పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదన్నారు.
రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలి అని తెలిపారు. శరీరంలో నీరు, పోషక విలువలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఎండాకాలంలో ఎక్కువగా ప్రజలు, చిన్న పిల్లలు డీ-హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎండల వల్ల తలనొప్పి, జ్వరం, ఒక్కోసారి ముక్కు నుంచి రక్తం కారవచ్చు (ఎపిస్టాక్సిస్) అని తెలిపారు. దాహం వేసి ఎక్కడపడితే అక్కడ ఏదో ఒక నీరు తాగితే కూడా రోగాలు వస్తాయన్నారు. బయట సీతల పానీయాలు తాగకూడదని సూచించారు. బయట పానీయాలు తీసుకోవడం వల్ల కలరా, టైఫాయిడ్, కామెర్ల వంటి వ్యాధులు కలుషిత ఆహారం, పానీయాల వల్ల రావచ్చన్నారు. సీజన్లలో దొరికే పండ్లు, కీరదోస, ఆపిల్, పెరుగు, ఓఆర్ఎస్ నీళు,, జంక్ తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వడదెబ్బకు గురైతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.

'కర్ణాటక ఫలితాలు ప్రతిపక్షాలకు చెంపపెట్టు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
కర్ణాటక ఫలితాలు ప్రతిపక్షాలకు చెంపపెట్టు అని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ జాతీయ అధ్యక్షులు గొంటి కుమార్ చౌదరి యాదవ్ పేర్కొన్నారు. శనివారం మీడియాతో కుమార్ చౌదరి యాదవ్ మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో బీజేపీని ఓడించిన తీరు ప్రధాని మోడీపై ప్రజలకు ఉన్న వ్యతిరేకతకు అద్దం పడుతుందన్నారు. శనివారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్‌కు అత్యధిక స్థానాలు ఇచ్చి ప్రజలు ఆశీర్వదించడం హర్షణీయమన్నారు. కర్ణాటకలో మొత్తం 224 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ కర్ణాటక ఇన్‌చార్జి లక్ష్మణ్ యాదవ్‌తో కలసి ప్రచారంలో పాల్గొన్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం మత సామరస్యాన్ని చెడగొట్టేలా వ్యవహరిస్తోందన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్య, వైద్య రంగాల్లో సౌకర్యాల లేమి వంటి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. అందుకే కర్ణాటక ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పారన్నారు. ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖార్గే, కాంగ్రెస్ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు డికె.శివకుమార్, కార్యర్తల కృషితో కర్ణాటక ఎన్నికల్లో 35 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ సంపూర్ణ మెజార్టీతో ఘన విజయం సాధించడం శుభ పరిణామం అన్నారు.

అధికారుల సమన్వయం అవసరం

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



నవతెలంగాణ-బంజారాహిల్స్
అధికారుల సమన్వయం ఎంతో అవసరమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం అన్ని శాఖల అధికారులతో కలిసి అన్ని డివిజన్ల కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ డివిజన్లలో ఓపెన్ నాలా ఉండటం వల్ల ఇండ్లల్లోకి డ్రయినేజీ ముంచేత్తుకుని వస్తుందనీ, చిన్నగా ఉన్న ఓపెన్ నాలాని పెద్దగా అభివృద్ధి చేయాలనీ, ఆ దిశగా అధికారులందరూ ఐక్యతతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యచరణ చేపట్టాలనీ, అందులో భాగంగా మంచినీటి, మురుగునీటి వీధి విద్యుత్ దీపాలు, కరెంటు సమస్యలు సకాలంలో పూర్తికావడం లేదనీ అసహనం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన లైట్స్ రిపేర్ క్రేన్ రెండు డివిజన్లకి కలిపి ఒక్కటే ఉండటం సమస్యలు పూర్తి చేయడంలో ఆటంకం కలుగుతుందనీ, ప్రత్యామ్నాయ్న ఎంచుకోవడం లేదా మరిన్ని క్రేన్లనూ సమకూర్చే ప్రయత్నం చేస్తానని తెలిపారు. వివిధ బస్తీల్లో ఉన్న కాళీ ప్రదేశంలో కొత్త కమిటీ హాల్స్ నిర్మించాలన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవిత రెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దాం వెంకటేష్, జీహెచ్ఎంసీ అధికారులు, జోనల్ కమిషనర్ రవికిరణ్, వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు జీఎం హరీష్ శంకర్, స్ట్రీట్ లైట్స్ డిపార్ట్మెంట్ అధికారులు సుష్మ వివిధ డిపార్ట్మెంట్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన ప్రగతి'



నవతెలంగాణ-ఓయూ
అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన ప్రగతిని సాధించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే బీజేపీ గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మెట్టుగూడ డివిజన్ పరిధిలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సికింద్రాబాద్ అసెంబ్లీ బూత్ లెవెల్ సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో భారత దేశ గౌరవాన్ని చాటి చెప్పిన ఘనత నరేంద్ర మోడీకి దక్కిందన్నారు. స్థానికంగా జరిగిన కొంత పొరపాటు వల్ల కర్ణాటకలో బీజేపీ ఓడిపోయిందనీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో నడుస్తున్న నియంత కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఎన్నికలకు నాలుగు నెలల సమయం ఉందనీ, బీజేపీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ విజయం ఖాయమనీ, కుటుంబ పాలన పోయి ప్రజాస్వామ్య పాలన వస్తుందన్నారు. బీఆర్ఎస్ ఎన్ని డబ్బులు పంచినా ఓటమి తప్పదన్నారు. కేసీఆర్ అహంకారపూరిత వైఖరికి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. అక్రమాలకు కేంద్రంగా ప్రగతి భవన్ నిలిచిందనీ, బీజేపీ అధికారంలోకి రాగానే ప్రగతి భవనన్ ప్రజాభవన్‌గా మారుస్తామన్నారు. సెక్రటేరియట్ గేట్లు కూడా ప్రజల కోసం ఎప్పుడూ తెరిచి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శ్యాంసుందర్, మేకల సారంగపాణి, నాగేశ్వర్ రెడ్డి, బండపల్లి సతీష్, మద్దెర్ల శ్యాంసుందర్, ఆదం విజయ్ కుమార్, కృష్ణమూర్తి, వెంకటేష్ గౌడ్, మల్లికంటి వీరన్న, రాము వర్మ, ఆర్కుట్ విజయ్ కుమార్, నాగేందర్, పోచయ్య యాదవ్, వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్-2023



నవతెలంగాణ-ఓయూ
యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్లో వార్షిక స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ -2023 ఘనంగా నిర్వహించారు. నాలుగేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఏడాది వార్షిక క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎంకాం చివరి సంవత్సరం విద్యార్థిని నవ్య ఆవాహన నృత్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.డి.శ్రీరాములు స్వాగతోపన్యాసం చేసి వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వీసీ ప్రొ.డి.రవీందర్, గౌరవ అతిథి ఐపీఎస్, ఐజిపి (ప్రొవిజన్స్ %డ% లాజిస్టిక్స్) రమేష్ రెడ్డి, వాణిజ్య విభాగం అధిపతి సీనియర్ ప్రొ.డి.చెన్నప్ప, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం ప్రొ.వై.జహంగీర్ ఆయా విభాగాల వార్షిక నివేదికలను సమర్పించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రొ.కె. దీప్లా, కార్యక్రమ నిర్వాహకురాలు క్రీడా నివేదికను సమర్పించారు. ప్రొ. వి.అప్పారావు, వాణిజ్య విభాగం, ప్రొ.సుధ, డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ వారి విభాగాల అధ్యయనాల నివేదికలను సమర్పించారు. సీనియర్ ప్రొ.ఆర్.నాగేశ్వర్ రావు, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో పరిశోధన కార్యకలాపాలపై నివేదికను సమర్పించారు. ప్రొ.స్మిత సాంబ్రాణి, ప్రొ. ఆర్.సంపత్ కుమార్, ప్రొ.ఎ.ప్యాట్రిక్, ప్రొ.ఐ.శేఖర్, ప్రొ.కవితాదేవి, ప్రొ.సి.వి.రంజని,డాక్టర్. కె.శ్రీనివాస్, డాక్టర్.జి.విద్యాసాగర్ రావు,డా.వి.సమున్నత, డా.బి.సంధ్యారాణి, డా.జి.శ్రీనివాస్, కళాశాల బోధనేతర, సహాయక సిబ్బందితో పాటు కార్యక్రమాంలో పాల్గొన్నారు. ఎం.రమేష్ రెడ్డి, ఐపీఎస్, బిజినెస్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ పూర్వీకుడు, తాను టెక్నాలజీ మేనేజ్మెంట్లో ఎంబీఏ చదివిన డిపార్ట్మెంట్స్ తిరిగి వస్తున్నానని వ్యక్తం చేశాడు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తనకు కూడా బోధన పట్ల చాలా మక్కువ కలిగి ఉన్నాననీ, అది తనను పీహెచ్‌డీ ప్రోగ్రామ్ కోసం నమోదు చేసుకునేలా ఆకర్షించిందని తెలిపారు. వీసీ ప్రొ.రవీందర్ మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగు మాట్లాడే ఇరు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు సీఎంలు కేసీఆర్, వై. జగన్ మోహన్ రెడ్డి, దివంగత ప్రధాని పీవీ నరసింహారావు వంటి దిగ్గజాలను ఓయూ అందించిందన్నారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు వివిధ అవుట్డోర్ ఇండోర్ స్పోర్ట్స్ యాక్టివిటీలలో భాగంగా నిర్వహించిన బహుమతులను పంపిణీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం బాగ్ అంబర్ పేట డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధి, అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పొలిటికల్ జేఏసీ నాయకులు ఎం.శివకుమార్ గుప్తా, జగదీష్ సూర్యవంశీ, జహంగీర్, బంగారు శ్రీను, ఇతర 40 మంది నాయకులు బాగ్ అంబర్ పేటలోని రెడ్ బిల్డింగ్ వద్ద ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేరిన వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, గెలువయ్య, అఫ్రోజ్ పటేల్, ధనుంజయ్, నిరంజన్, భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసం మతాలు, దేవుళ్ళ మధ్య చిచ్చు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ మతాలు, దేవుళ్ళ మధ్య చిచ్చు పెట్టి అధికారం వైపు వెళ్లాలని ప్రయత్నించినా చిత్తుగా ఓడిపోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకురాలు, బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుండ్రాతి శారదా గౌడ్ అన్నారు. శనివారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శారదా గౌడ్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర ఫలితాలు బీజేపీకి చెంప పెట్టు అన్నారు. అధికారం, డబ్బు ప్రధానం కాదనీ, గెలిచిన రోజు నుండే నాయకులు ప్రజల్లో ఉంటే వారి ప్రేమ, సేవను గుర్తిస్తారన్నారు. కర్ణాటక ఎన్నికల్లో ఈడీ, ఐటీ, సీబీఐ బెదిరింపులు పని చేయలేదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని ఈ ఎన్నికలు నిరూపించాయన్నారు. ఇంతకన్నా నిదర్శనం ఏముంటుందన్నారు. ఇక మీదట ఈ ఫలితాల ప్రభావం అన్ని రాష్ట్రాలపై ఉంటుందనీ, మోడీకి బై బై చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. దేశం సీఎం కేసీఆర్‌ను అనుసరిస్తుందనీ, ఈ ఎన్నికల ఫలితాలే కర్ణాటకలో మోడీ పతనం ప్రారంభమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో అంబర్ పేట్ నియోజకవర్గంలో ఎగిరేది బీఆర్ఎస్ జెండానే అనీ, ఇది రాసి పెట్టుకో అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి ఆమె సవాల్ విసిరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మహిళా సంక్షేమ సంఘం నాయకురాలు సునీత, సంధ్య, శోభ, సోని, చంద్రకళ, జానకీ, లక్ష్మీ, బాలమణి, రజిత, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విభజన రాజకీయాలను ప్రజలు తిరస్కరించి చిత్తుగా ఓడించారు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
బీజేపీ మతతత్వ విభజన రాజకీయాలను ప్రజలు తిరస్కరించి చిత్తుగా ఓడించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కి వారిని ధిక్కరించి, కర్ణాటక బీజేపీ చేసిన ద్రోహాలను ప్రజలు గమనించి తరిమికొట్టారని పేర్కొన్నారు. బీజేపీ తన ప్రచారంలో ప్రధాని మోడీని ముందంజలో పెట్టినా ఓటమి చెందడం సిగ్గు చేటన్నారు. కర్ణాటక సామాజిక ఐక్యత, సామరస్యం, సమ్మిళిత సంస్కృతిని బీజేపీ విభజన రాజకీయాలు నిర్వీర్యం చేశాయన్నారు. అశాంతి, నిరాశ, నిసహలలో ఉన్న ప్రజలు తమ ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారన్నారు. కర్ణాటకలో బీజేపీ ఫాసిస్ట్ పాలన ఓడి ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, ప్రజల హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా జరిగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో నిరంకుశ బీజేపీని ఓడించాలని నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు

పదిలో శ్రీ చైతన్య విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
హిమాయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విద్యార్థులకు, స్కూల్ యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఏజీఎం సతీష్, ప్రిన్సిపాల్ జ్యోతి, డీన్ జనార్దన్, స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టెడే ఎక్స్ 2023



నవతెలంగాణ-ఓయూ
ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శనివారం ఓయూ ఇంజినీరింగ్ కళాశాల, ఇంజినీరింగ్ అలూమిని ఆధ్వర్యంలో టెడ్ ఎక్స్ 2023ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిస్ గ్రాండ్ ఇండియా-2022 ప్రాచి నాగ్ పాల్, కల్నల్ శ్యామ్ విజయ సిన్హా, ఫార్మాకో తెరపీస్ట్, గ్లోబల్ ట్రైనర్ డా.రిశు రిత్విక్, తెలుగు ఫిల్మ్ డైరెక్టర్ వెంకటేష్ మహా, ప్రొఫెషన్ జర్నలిస్టు ఆనం మీర్జా, ఎడ్యుకేటర్ మేఘన ముసునూరి, మ్యూజిషియన్ సామల వేణు పాల్గొని మాట్లాడారు. తమ జీవితంలో ఎదుర్కొన్న పరిణామాలు, ఆటుపోట్లు ఏం కావాలని ఏం అయ్యారో వివరించారు. విద్యార్థులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జీవితంలో ఎలా రాణించాలో వివరించారు. అవకాశాలు ఉన్నాయి అందిపుచ్చుకుని ముందుకు పోవాలని సూచించారు. ఏడుగురు వక్తలు వివిధ అంశాలపై ప్రసంగించారు. విద్యార్థులు సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్, ఇంజినీరింగ్ కళాశాల అలూమిని అధ్యక్షుడు డా.విజయ్ దేవరకొండ, కోశాధికారి థామస్ రామల, కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ దోర్నా, టెడ్ ఎక్స్ ఎండి రోహిత్ నెట్టేలా, మార్కెటింగ్ హెడ్ నిహారిక మామిడి, విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని అంబర్‌పేట నియోజకవర్గ సీనియర్ నాయకులు తోలుపునూరి కృష్ణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-అంబర్‌పేట



కర్ణాటకలో కాంగ్రెస్ విజయంతో సంబురాలు



నవ తెలంగాణ - బాలానగర్

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా కొంపల్లిలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నా శివా రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికలలో గెలుపునకు పాటుపడ్డ సోనియా, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, ప్రియాంక, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ కు అభినందనలు తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ది పొందాలని చూసిన బీజేపీకి కర్ణాటక ఓటర్ల తీర్పు చెంపపెట్టు అన్నారు. తెలంగాణ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ అపూర్వ విజయం సాధించడం ఖాయన్నారు.

లక్ష్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-శామీర్‌పేట

వ్యవసాయదారుల సేవా సహకార సంఘం శామీర్ పేట పరిధిలోని మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డిలు సర్పంచ్ సింగం ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హారిక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి , సంఘ డైరెక్టర్లు వంగ భూమి రెడ్డి , కొండ భిక్షపతి , జిలకర విష్ణు , బాబుసింగ్ నాయక్ , లక్ష్మి గారి నర్సింహులు , ఏఎం సీ వైస్ చైర్మన్ శ్రీకాంత్, సర్పంచులు జాం రవి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ ఓటమి పేద ప్రజల గెలుపు

బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి, కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జి కర్ణనాగరాజ్



నవతెలంగాణ-కూకట్ పల్లి

బీజేపీ ఓటమి దళితులు, రైతులు,కార్మికులు, పేద ప్రజల గెలుపు అని బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి, కర్ణాటక రాష్ట్ర ఇంచార్జి కర్ణనాగరాజ్ అన్నారు. కర్ణాటక ప్రజలు బీజేపీ పార్టీకి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేస్తున్న బీజేపీకి కర్ణాటక ప్రజలు ఓటు ద్వారా ఛీ కొట్టారని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ, గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధరలను పెంచడం, వేలకోట్లు బ్యాంకులను మోసం చేసి విదేశాలకు పారిపోయిన తన మిత్రులకు మద్దత్తు తెలపడం, రాజ్యాంగ సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీ, జ్యూడిషరీని దుర్వినియోగం చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తే ..వారి మీద దాడులు చేయించడం, ఆర్టీఐ యాక్ట్ ద్వారా పీఎంకేర్ ఫండ్స్ యొక్క నిధుల వివరాలు చెప్పక పోవడం, రైతుల సమస్యలను పరిష్కరించకపోవడం తదితర అక్రమాలకు పాల్పడుతున్న బీజేపీకి కర్ణాటక ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో కాకుండా దేవుడి పేరుతో ఎన్నికల్లో గెలవాలని చూసిన బీజేపీ ఓటమిపాలైందన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వానికి 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటమి తప్పదని జోస్యం చెప్పారు.

కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు.. బీజేపీ శ్రేణుల్లో అలుపు..

- **కుత్బుల్లాపూర్ నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్ ముదిరాజ్**



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

దేశంలో అత్యధిక ధరలు పెంచి పేద, సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న మతతత్వ పార్టీ బీజేపీని మొన్న హిమాచల్ ప్రదేశ్ లో, నేడు కర్ణాటకలో ఓట్లతో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బంటు నరేష్ ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో భారీ మెజార్టీతో విజయం సాధించిందన్నారు. ఈ మేరకు చింతల్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలన పట్ల ప్రజలు పూర్తిగా విసుగు చెందారని విమర్శించారు. దేశ ప్రజలు కాంగ్రెస్ పాలనను కేంద్రం, రాష్ట్రంలోనూ కోరుకుంటున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత రాజకీయాలను తిప్పి కొట్టిన కర్ణాటక ప్రజలు

- **సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్**



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

మత రాజకీయాలను కర్ణాటక ప్రజలు తిప్పి కొట్టారని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కార్యదర్శి ఈ.ఉమా మహేష్ అన్నారు. కర్ణాటక ఫలితాలు బీజేపీ,మోడీకి చెంపదెబ్బ లాంటిదని, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మత రాజకీయం చేస్తామని అనుకుంటే రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఇదే గతి పడుతుందని చెప్పారు. బీజేపీ అధికారం కోసం మతాన్ని వాడుకోవడమే కాకుండా చివరికి హనుమంతుడిని కూడా వాడుకోవడం సిగ్గుచేటన్నారు. 2014లో కూడా కాంగ్రెస్ అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలను ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చాక... మత రాజకీయాలు చేసి ప్రజల మధ్య మత విద్వేషాలు పెంచిందని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేనంత మత విద్వేషం పెరగడానికి కారణం బీజేపీనే అని అన్నారు. కాంగ్రెస్ కూడా ఎన్నికల్లో గెలిచామని విర్రవీగకుండా.. ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల మధ్య సామరస్యం పెంచేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం కర్ణాటక ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కష్టపడి చదివితే అద్భుత ఫలితాలు



- **పదిలో సత్తాచాటిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే**

నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

విద్యార్థులు చిన్ననాటి నుండే కష్టపడి చదివితే అద్భుత ఫలితాలను సాధిస్తారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్, పట్వారీ నగర్ కు చెందిన నవజ్యోతి హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో సత్తాచాటిన సందర్భంగా.. శనివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ను తన నివాసంలో పాఠశాల చైర్మన్ కరస్పాండెంట్ మలిరెడ్డి ఇందిరా రెడ్డి, డైరెక్టర్ ఎం. రవీందర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణ ,ప్రిన్సిపల్ రూపాంజలి, ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం 10/10 జీపీఏ సాధించిన 10 మంది విద్యార్థులకు రూ.10 వేల నగదు, 9.8 సాధించిన 11 మందికి రూ.2 వేల నగదు బహుమతిని ఎమ్మెల్యే అందజేశారు. తర్వాత షాపూర్ నగర్ లోని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు, కూనా శ్రీశైలం గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పాఠశాల అధ్యాపక బృందానికి, విద్యార్థులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

మత రాజకీయాలకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పే బీజేపీ ఓటమి

పీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం



నవతెలంగాణ - బాలానగర్

మత రాజకీయాలకు వ్యతిరేకంగా కర్ణాటక ప్రజలు ఇచ్చిన తీర్పు బీజేపీ ఓటమికి కారణం అని పీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో గాంధీ భవన్ లో కూకట్ పల్లి నియోజక వర్గం పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో శనివారం పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. మతంలో మమేకమైన రాష్ట్రంలో బీజేపీని చీదరించుకున్నారంటే మత, సంకుచిత రాజకీయాలతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. బీజేపీ ప్రధానంగా అవినీతికి ఆజ్యం పోయడం వల్లే కర్ణాటక ప్రజలు బీజేపీని తిరస్కరించారని చెప్పారు. ఈ నిరంకుశ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, నాగిరెడ్డి, ఎండి మోయిజ్, తూము వేణు, బండారి నవీన్ గౌడ్, మధు గౌడ్, మట్టే ప్రసన్న కుమార్, శేఖర్ గౌడ్, గజానంద్ శేఖర్, మహేందర్, నర్సింహా, నరేష్, జహంగీర్, కేబుల్ శ్రీను, వెంకటేష్, బంధిగ బాల నర్సింహా, పాషా, పుట్టపాక రాము, పుట్టపాక మధు, భరత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్సే

ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి



నవతెలంగాణ - బాలానగర్

తెలంగాణలో రానున్న ఎన్నికల్లో వచ్చేది కాంగ్రెస్ పార్టీనే అని కూకట్ పల్లి నియోజకవర్గం ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి జోస్యం చేప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించినందుకు ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ భవన్ వద్ద సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుతూ, బాణాసంచా కాల్చి, రంగులు చల్లుకుంటూ, నృత్యాలు వేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలతో దేశంలో ఇటు రాష్ట్రంలో మార్పు మొదలైందని యుగంధర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రే ను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ కె. రాజు ముదిరాజ్, ఏ బ్లాక్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు బందీగా బాలనర్సింహ, బోయిన్ పల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ అస్లాం, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సీటకోరు కృష్ణ, బాలానగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆకుల నరేందర్, బాలరాజు, ముక్తర్ అహ్మద్, రావూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసమే బస్తీ దవఖానాలు

- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



నవతెలంగాణ-దుండిగల్

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే బస్తీ దవఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం 4 బస్తీ దవాఖానాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ 4వ డివిజన్ లో ఆర్.శ్రీరాములు కార్పొరేటర్ కలిసి, తర్వాత నిజాంపేట్ 31వ డివిజన్, నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప లో ఆవుల ప్రసన్న జగదీష్ యాదవ్ కార్పొరేటర్ తో కలిసి, అలాగే 10వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్ తో కలిసి, 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్-2లలో ని బస్తీ దవాఖానాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్, కమిషనర్ రామకృష్ణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజలకు చేరువలో బస్తీ దవాఖానలు నిర్మించి, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్, ఎంహెచ్ఓ డాక్టర్ నిర్మల,ఎన్ఎంసీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సోనీ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలి'



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోనీ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందజేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరంగల్ జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోనీ మృతి చాలా బాధాకరమైన విషయమని విచారం వ్యక్తం చేశారు. 15 రోజుల నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రాష్ట్రంలో ధర్నా చేస్తుంటే..రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ తీరును ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి అండగా యావత్ విద్యార్థి లోకం ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

'నా జీవితం ప్రజా సేవకే అంకితం'



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

నా జీవితం రంగారెడ్డి నగర్ డివిజన్ ప్రజల సేవలకే అంకితం అని కార్పొరేటర్ బుద్దా విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. చింతల్ చంద్ర నగర్ లోని కార్పొరేటర్ కార్యాలయంలో శనివారం కార్పొరేటర్ విజయ్ శేఖర్ పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులు, సన్నిహితులు, జర్నలిస్టులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్ కు శాలువాలతో పాటు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం హెచ్ ఎంటీ కాలనీ లోని నిర్మాన్ దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను అందరి మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడు చింతలపల్లిలో కాంగ్రెస్ విజయోత్సవ సంబురాలు



నవతెలంగాణ - శామీర్ పేట

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా.. మూడు చింతలపల్లి మండలం అధ్యక్షులు బొమ్మలపలి నర్సింహులు యాదవ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పార్టీ శ్రేణులు బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి, సర్పంచు నల్ల శిల్ప యాదగిరి, ఉప సర్పంచ్ వైద్యనాథ్, సీనియర్ నాయకులు దోసకాయల వెంకటేశ్, తూము వేణుగోపాల్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు నీరజ్ గౌడ్, నాయకులు భూపాల్ రెడ్డి, జెర్రిపోతుల నర్సింహులు, బస్వా రెడ్డి, బండి జగనాథం, మర్యాల వీరేశం గుప్త, నవీన్ చారి, రాజేంద్ర ప్రసాద్, దామోదర్ రెడ్డి, దండు రాజు, గోపీ, రవీందర్ రెడ్డి , మల్లేష్ యాదవ్, మలేష్, నర్సింహ, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ - శామీర్ పేట

వ్యవసాయదారుల సేవా సహకార సంఘం శామీర్ పేటలో ప్రమాదవశాత్తు మరణించిన సభ్యుల కుటుంబ సభ్యులకు శనివారం ఆర్థిక సాయం అందజేసినట్లు డీసీఎంఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి తెలిపారు. మూడు చింతలపల్లి మండలం నారాయణ పూర్ గ్రామానికి చెందిన ఉప్పరి నర్సింలు, ముద్దాపురం యాదయ్యలు ఇటీవల మరణించినట్లు చెప్పారు. వారి కుటుంబాలకు 60వేల రూపాయలను అందజేసినట్టు మధుకర్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హారిక , బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు వంగ భూమి రెడ్డి , కొండ భిక్షపతి , జిలకర విష్ణు , బాబుసింగ్ నాయక్ , లక్ష్మిగారి నర్సింహులు, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పదిలో సీఎం అకాడమీ, ఎంబీ గ్రామర్ హై స్కూల్ ప్రభంజనం

విద్యార్థులకు మంత్రి మల్లారెడ్డి అభినందనలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

పదో తరగతి పరీక్షా ఫలితాలలో సూరారంలోని సీ.ఎం. అకాడమీ. ఎం.బీ గ్రామర్ హై స్కూల్ ప్రభంజనం సృష్టించాయి. ఏడుగురు విద్యార్థులు రూపేష్, రాజేశ్వర్ రెడ్డి, సాయి ప్రజీత్ , జయలక్ష్మి, జి సౌమ్య , రాణి కుమారి 10/10 జీపీఏ సాధించి..స్కూల్ టాపర్స్ గా నిలిచారు. 53 మంది విద్యార్థులు ఏ గ్రేడ్, 100 శాతం ఉత్తీర్ణత సాధించి మండల మొత్తం మీద విజయఢంకా మోగించారు. ఈ మేరకు సీ.ఎం. అకాడమీ, ఎం.బీ గ్రామర్ హై స్కూల్ విద్యార్థులతో కలిసి ప్రిన్సిపల్ గాయత్రి శనివారం కార్మిక ఉపాధి శాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ -దుండిగల్

ప్రజల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి యాత్ర లో భాగంగా 57వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శనివారం 21వ డివిజన్ పరిధి బాచుపల్లి సాయినగర్ లో మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి , డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమిషనర్ రామకృష్ణ, కార్పొరేటర్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచినీటి పైప్ లైన్, సీసీ రోడ్లు, స్మశానవాటికల అభివృద్ధి, పార్క్ అభివృద్ధి, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఎన్ఎంసీ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుంది'



నవతెలంగాణ -జగద్గిరిగుట్ట

దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని, పార్టీకి పూర్వ వైభవం వస్తుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్ లోని కమిటీ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మండవ శివకుమార్ కాంగ్రెస్ విధి విధానాలకు ఆకర్షితులై సుమారు 200 మంది యువకులతో కలిసి కాంగ్రెస్ చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మహిళా రాష్ట్ర కార్యదర్శి రాచనోళ్ల లక్ష్మి , కాంగ్రెస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



సన్‌రైజర్స్ హైదరాబాద్ సప్త విలాపం. సొంతగడ్డపై గెలుపు ఖాయం అనుకున్న మరో మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ సీజన్లో ఏడో పరాజయంతో ఐపీఎల్16 ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపుగా నిష్క్రమించింది. 183 పరుగుల ఛేదనలో ఓపెనర్లు వైఫల్యంతో లక్నోపై ఒత్తిడి పెరిగింది. డెత్ ఓవర్లలో సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోయింది. అయినా, నికోలస్ పూరన్ (44 నాటౌట్), ప్రేరక్ మన్కడ్ (64 నాటౌట్) సహా మార్కస్ స్టోయినిస్ (40) ధనాధన్ ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలి పది ఓవర్ల శ్రమ వృథా అయ్యింది. డెత్ ఓవర్లలో విశ్వరూపం దాల్చిన నికోలస్ పూరన్ మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్నో సూపర్‌జెయింట్స్‌కు విజయాన్ని కట్టబెట్టాడు. సీజన్లో ఆరో విజయంతో లక్నో సూపర్‌జెయింట్స్ ప్లే ఆఫ్స్ దిశగా ఓ అడుగు ముందుకేసింది.

సప్త విలాపం!

- సన్‌రైజర్స్‌కు ఏడో పరాజయం
- ఛేదనలో పూరన్, ప్రేరక్ ధనాధన్

లక్నో ఖాతాలో ఆరో విజయం



టర్నింగ్‌పాయింట్

15 ఓవర్లలో లక్నో స్కోరు 114/2. 30 బంతుల్లో 69 పరుగులు చేయాలి. 16వ ఓవర్లో బంతి అందుకున్న అభిషేక్ శర్మ ఏకంగా 31 పరుగులు సమర్పించుకుని.. మ్యాచ్‌ను లక్నో చేతుల్లో పెట్టాడు. ఆ ఓవర్లో తొలి రెండు బంతులను మార్కస్ స్టోయినిస్ సిక్సర్లు మలిచి.. మూడో బంతికి వికెట్ కోల్పోయాడు. ఓవర్లో చివరి మూడు బంతులను కొత్త బ్యాటర్ నికోలస్ పూరన్ స్టాండ్స్‌లోకి పంపించాడు. దీంతో ఐదు సిక్సర్లు ఓ వైడ్‌తో అభిషేక్ 31 పరుగులు ఇచ్చాడు. ఈ ఓవర్‌తో మ్యాచ్ లక్నో వశం కాగా.. సన్‌రైజర్స్ రేసు అక్కడితో ముగిసింది.

నవతెలంగాణ-హైదరాబాద్

లక్నో సూపర్‌జెయింట్స్ లక్ష్యం 183 పరుగులు. తొలి పది ఓవర్లలో ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయి 68 పరుగులే చేసింది. సన్‌రైజర్స్ బౌలర్లు సమిష్టిగా విజృంభిస్తుండగా.. లక్నో సూపర్‌జెయింట్స్‌కు పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ నికోలస్ పూరన్ (44 నాటౌట్, 13 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ప్రేరక్ మన్కడ్ (64 నాటౌట్, 45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్కస్ స్టోయినిస్ (40, 25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఛేదనలో లక్నోను రేసులో నిలుపగా.. గెలుపు గీత దాటే బాధ్యత నికోలస్ పూరన్ తీసుకున్నాడు. పూరన్ పూనకాలతో 19.2 ఓవర్లలోనే లక్నో సూపర్‌జెయింట్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. ఓపెనర్ అన్మోల్‌ప్రీత్ సింగ్ (36, 27 బంతుల్లో 7 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (47, 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (37 నాటౌట్, 25 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) రాణించారు. లక్నో సూపర్‌జెయింట్స్ టాప్ ఆర్డర్ బ్యాటర్ ప్రేరక్ మన్కడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. సీజన్లో 11 మ్యాచుల్లో ఏడో పరాజయం చవిచూసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపుగా నిష్క్రమించింది. మిగతా మూడు మ్యాచుల్లో సన్‌రైజర్స్ మెరిసినా.. గరిష్టంగా 14 పాయింట్లు సాధించగలదు. సీజన్లో ఆరో విజయం సాధించిన లక్నో సూపర్‌జెయింట్స్ పాయింట్ల పట్టికలో టాప్-4లోకి తిరిగి ప్రవేశించింది.

పూరన్ పూనకాలు : 183 పరుగుల ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. పవర్‌ప్లేలో సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేశారు. పార్ట్‌టైమ్ స్పిన్నర్ గ్లెన్ ఫిలిప్స్ (1/10) ఓపెనర్ కైల్ మేయర్స్ (2)ను అవుట్ చేయగా.. క్వింటన్ డికాక్ (29) మయాంక్ మార్కండెకు వికెట్ కోల్పోయాడు. ఆరు ఓవర్లలో 30 పరుగులే చేసిన లక్నో సూపర్‌జెయింట్స్.. ఛేదనను క్లిష్టతరం చేసుకుంది. భువనేశ్వర్ కుమార్, ఫరూకీ, ఫిలిప్స్, నటరాజన్ ఆరంభంలో అద్భుతంగా బౌలింగ్ చేశారు. దీంతో పది ఓవర్ల అనంతరం లక్నో సూపర్‌జెయింట్స్ 68/2తో నిలిచింది. ద్వితీయార్థం మ్యాచ్ ఆరంభానికి ముందే సన్‌రైజర్స్ గెలుపు దిశగా అడుగులేసింది. కానీ లక్నో సూపర్‌జెయింట్స్ తర్వాతి ముగ్గురు బ్యాటర్లు విశ్వరూపం చూపించారు. ఓ ఎండ్‌లో నం.3 బ్యాటర్ ప్రేరక్ మన్కడ్ (64 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 35 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన ప్రేరక్.. మార్కస్ స్టోయినిస్ (40)తో కలిసి మూడో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదు చేశాడు. స్టోయినిస్ మూడు సిక్సర్లు, రెండు ఫోర్లతో దండెత్తాడు. స్టోయినిస్ నిష్క్రమణతో నికోలస్ పూరన్ క్రీజులోకి రాగా.. మ్యాచ్ సమీకరణం పూర్తిగా మార్చివేశాడు. 13 బంతుల్లోనే నాలుగు సిక్సర్లు, మూడు ఫోర్లతో 44 పరుగులు పిండుకున్నాడు. మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్నోకు విజయాన్ని అందించాడు. ఓ దశలో 42 బంతుల్లో 94 పరుగులు చేయాల్సి ఉండగా లక్నో సూపర్‌జెయింట్స్ తీవ్ర ఒత్తిడిలో పడింది. కండ్లుచెదిరే హిట్టింగ్‌తో చెలరేగిన నికోలస్ పూరన్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు పరాజయం మిగిల్చాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో ఫిలిప్స్, మార్కండె, అభిషేక్ ఒక్కో వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

ఐపీఎల్‌లో నేడు

రాజస్థాన్ X బెంగళూర్
వేదిక : జైపూర్ ,సమయం: మ:3.30
చెన్నై X కోల్‌కత
వేదిక : చెపాక్, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్,జియో సినిమాలో ప్రసారం

అభిమానుల వీరంగం!

అభిమానుల అత్యుత్సాహం కారణంగా సన్‌రైజర్స్, సూపర్‌జెయింట్స్ మ్యాచ్ ఓ పది నిమిషాలు నిలిచిపోయింది. హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో 19వ ఓవర్లో మూడో బంతికి సమద్ హైట్ నోబాల్ సమీక్ష తీసుకున్నాడు. సమీక్షలో బంతి నో బాల్‌గా స్పష్టంగా తెలుస్తున్నా.. మూడో అంపైర్ ఆ బంతిని నో బాల్‌గా ఇవ్వలేదు. దీంతో అభిమానులు కాస్త ఆగ్రహానికి లోనయ్యారు. ఇదే సమయంలో లక్నో డగౌట్‌లో కూర్చున్న గౌతం గంభీర్‌ను ఉద్దేశించి 'కోహ్లి.. కోహ్లి..కోహ్లి' అని నినాదాలు చేసిన అభిమానులు ఆ జట్టు డగౌట్‌పై ఇనుప వస్తువులు విసిరారు!. ఇది గమనించిన ఫీల్డ్ అంపైర్లు లక్నో డగౌట్ దగ్గరకు వెళ్లారు. పరిస్థితి సద్దుమణిగేందుకు ఓ పది నిమిషాల పాటు మ్యాచ్ ఆగక తప్పలేదు.

రాణించిన క్లాసెన్, సమద్ : సొంతగడ్డపై టాస్ నెగ్గిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్‌గా వచ్చిన అభిషేక్ శర్మ (7) నిరాశపరిచాడు. అన్మోల్‌ప్రీత్ సింగ్ (36, 27 బంతుల్లో 7 ఫోర్లు) ఆకట్టుకున్నాడు. రాహుల్ త్రిపాఠి (20), కెప్టెన్ ఎడన్ మార్క్‌రామ్ (28) శుభారంభాలను సద్వినియోగం చేసుకోలేదు. హెన్రిచ్ క్లాసెన్ (47, 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (37 నాటౌట్, 25 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) మెప్పించారు. ఆరో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేసిన జోడీ హైదరాబాద్‌కు భారీ స్కోరు అందించింది. ఈ ఇద్దరు క్రీజులో ఉండగా సన్‌రైజర్స్ 200 పైచిలుకు పరుగులు సాధించేలా కనిపించింది. లక్నో సూపర్‌జెయింట్స్ బౌలర్లు డెత్ ఓవర్లలో స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబరిచారు. సమద్ నాలుగు సిక్సర్లు బాదగా.. క్లాసెన్ మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. బ్యాటర్ల సమిష్టి ప్రదర్శనతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలుత 182 పరుగులు చేసింది. లక్నో కెప్టెన్, స్పిన్నర్ కృనాల్ పాండ్య (2/24) మాయజాలం ప్రదర్శించాడు. రెండు మెరుపు బంతులతో వికెట్లు పడగొట్టాడు. యుధ్‌వీర్ సింగ్, అవేశ్ ఖాన్, యశ్ ఠాకూర్, అమిత్ మిశ్రాలు ఓ వికెట్ పడగొట్టారు.

స్కోరు వివరాలు :

సన్‌రైజర్స్ హైదరాబాద్ : అన్మోల్‌ప్రీత్ సింగ్ (సి,బి) అమిత్ మిశ్రా 36, అభిషేక్ శర్మ (సి) డికాక్ (బి) యుధ్‌వీర్ సింగ్ 7, రాహుల్ త్రిపాఠి (సి) డికాక్ (బి) యశ్ ఠాకూర్ 20, ఎడెన్ మార్క్‌రామ్ (స్టంప్డ్) డికాక్ (బి) కృనాల్ పాండ్య 28, హెన్రిచ్ క్లాసెన్ (సి) ప్రేరక్ మన్కడ్ (బి) అవేశ్ ఖాన్ 47, గ్లెన్ ఫిలిప్స్ (బి) కృనాల్ పాండ్య 0, అబ్దుల్ సమద్ నాటౌట్ 37, భువనేశ్వర్ కుమార్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 05, **మొత్తం :(20 ఓవర్లలో 6 వికెట్లకు) 182.**

వికెట్ల పతనం : 1-19, 2-56, 3-82, 4-115, 5-115, 6-173.

బౌలింగ్ : యుధ్‌వీర్ సింగ్ 3-0-24-1, కైల్ మేయర్స్ 1-0-11-0, కృనాల్ పాండ్య 4-0-24-2, అవేశ్ ఖాన్ 2-0-30-1, యశ్ ఠాకూర్ 4-0-28-1, అమిత్ మిశ్రా 4-0-40-1, రవి బిష్ణోయ్ 2-0-23-0.

లక్నో సూపర్‌జెయింట్స్ : కైల్ మేయర్స్ (సి) మార్క్‌రామ్ (బి) గ్లెన్ ఫిలిప్స్ 2, క్వింటన్ డికాక్ (సి) అభిషేక్ శర్మ (బి) మయాంక్ మార్కండె 29, ప్రేరక్ మన్కడ్ నాటౌట్ 64, మార్కస్ స్టోయినిస్ (సి) అబ్దుల్ సమద్ (బి) అభిషేక్ శర్మ 40, నికోలస్ పూరన్ నాటౌట్ 44, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (19.2 ఓవర్లలో 3 వికెట్లకు) 185.**

వికెట్ల పతనం: 1-12, 2-54, 3-127.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-30-0, ఫజల్‌హాక్ ఫరూకీ 3.2-0-32-0, గ్లెన్ ఫిలిప్స్ 2-0-10-1, నటరాజన్ 4-0-31-0, మయాంక్ మార్కండె 3-0-39-1, అభిషేక్ శర్మ 3-0-42-1.

సిఎం కప్ లోగో, మస్కట్ ఆవిష్కరణ

- మే 15 నుంచి తెలంగాణ క్రీడా సంబురాలు



నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సిఎం కప్ 2023 నిర్వహణ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. మే 15 నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరుగనున్న సిఎం కప్ టోర్నీ అధికారిక లోగో, మస్కట్‌ను శనివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాసగ్ గౌడ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఈడిగ ఆంజనేయగౌడ్‌లు లోగో, మస్కట్‌లను ఆవిష్కరించారు. సిఎం కప్ టోర్నీలో నిర్వహించే 18 క్రీడాంశాలు ప్రతిబింబించేలా లోగో రూపొందించారు. తెలంగాణ రాష్ట్ర జంతువు కృష్ణ జింక స్ఫూర్తిగా మస్కట్‌కు రూపకల్పన చేశారు. యువతలోని చురుకుతనం, వేగానికి మస్కట్ ప్రతీక అని శాట్స్ చైర్మెన్ ఆంజనేయగౌడ్ వెల్లడించారు. 'సిఎం కప్ నిర్వహణను ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాం. తెలంగాణ క్రీడా సంబురాలను విజయవంతం చేసేందుకు రూ.3.60 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే స్టేడియాల నిర్మాణం పనులు 50 శాతం మేరకు పూర్తయ్యాయి. గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాము. సిఎం కప్ నిర్వహణలో అధికారులు ఎక్కడా నిర్లక్ష్యం వహించకూడదని' ఈ సందర్భంగా మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. సిఎం కప్ 2023 టోర్నీ లోగో, మస్కట్ ఆవిష్కరణ కార్యక్రమంలో జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, తెలంగాణ ఒలింపిక్ సంఘం (టిఓఎ) ఆఫీస్ బేరర్లు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు సహా శాట్స్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రికెటర్ త్రిషకు సన్మానం

- ఘనంగా సత్కరించిన బ్రియాన్ లారా



నవతెలంగాణ-హైదరాబాద్ : భారత వర్ధమాన క్రికెటర్, తెలంగాణ ముద్దుబిడ్డ త్రిష రెడ్డిని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) శనివారం ఘనంగా సత్కరించింది. శనివారం ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్‌జెయింట్స్ మ్యాచ్ ఆరంభానికి ముందు త్రిషను హెచ్‌సీఏ సముచితంగా గౌరవించింది. కరీబియన్ క్రికెట్ దిగ్గజం, సన్‌రైజర్స్ హైదరాబాద్ చీఫ్ కోచ్ బ్రియాన్ లారా చేతుల మీదుగా జ్ఞాపిక అందజేసింది. గత ఏడాది ఐసీసీ అండర్-19 మహిళల క్రికెట్ వరల్డ్‌కప్ గెలుచుకున్న భారత జట్టులో త్రిష రెడ్డి కీలక భూమిక వహించింది. అద్భుత ప్రతిభ కనబరిచిన త్రిష రెడ్డి ఆ టోర్నీలో ఉత్తమ వర్ధమాన క్రికెటర్‌గా సైతం నిలిచింది. భద్రాచలం అమ్మాయిని ఉప్పల్ స్టేడియానికి హెచ్‌సీఏ ఆహ్వానించింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఏకసభ్య కమిటీ చైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, హెచ్‌సీఏ సీఈవో సునిల్ కంతేర్, హెచ్‌సీఏ అడ్మినిస్ట్రేటర్ దుర్గాప్రసాద్ తదితరులు త్రిషాను అభినందించారు.

నవచిత్రం

ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు



శ్రీనివాస చిట్టూరి, వెంకట్ ప్రభు, నాగచైతన్య, కృతిశెట్టి

నాగ చైతన్య, వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో వచ్చిన తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్ 'కస్టడీ'. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. పవన్‌కుమార్ సమర్పించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై, బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో హీరో నాగ చైతన్య మాట్లాడుతూ, 'మా చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ఆడియన్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. మొదటి షో నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. మేం నమ్మి చేసిన అండర్‌వాటర్ సీన్, పోలీస్ స్టేషన్‌లో సింగిల్ షాట్ ఫైట్, ట్రైన్ ఫైట్, ఫ్లాష్ బ్యాక్‌లో వచ్చే ఓ సీన్‌కు మంచి స్పందన వచ్చింది. కొత్తగా చేయాలని ప్రయత్నం చేశాను' అని అన్నారు. 'దర్శకుడు వెంకట్ ప్రభు నన్ను నమ్మి మంచి పాత్ర ఇచ్చారు. ఆ పాత్రకు థియేటర్‌లో మంచి అప్లాజ్ వస్తుంది' అని హీరోయిన్ కృతిశెట్టి చెప్పారు. దర్శకుడు వెంకట్ ప్రభు మాట్లాడుతూ, 'తెలుగులో నేను చేసిన మొదటి సినిమాకి వస్తున్న గొప్ప ఆదరణకు థ్యాంక్స్ చెబుతున్నా. వందశాతం మా కష్టం ఫలించింది అనుకుంటున్నా. అంబులెన్స్‌తో కంపేర్ చేస్తూ కొన్ని రివ్యూలు చూశాను. అలా వారు రాసినందుకు థ్యాంక్స్. యాక్షన్ ఫిలిం ఇది. యాక్షన్ పరంగా బాగున్నాయని రాశారు కూడా. సినిమాను తెలుగు, తమిళంలో కూడా బాగా ఆదరిస్తున్నారు. కుటుంబంతో వెళ్ళి సినిమా చూసి ఎంజాయ్ చేయండి' అని తెలిపారు. నిర్మాత శ్రీనివాస్ చిట్టూరి మాట్లాడుతూ, 'కస్టడీ బ్లాక్ బస్టర్ అయినందుకు ఆనందంగా ఉంది. కథలో ఏది నమ్మామో అది వర్కవుట్ అయింది' అని అన్నారు.

అదే నాకు శుభ శకునం

స్వప్న సినిమా నిర్మాణంలో నందిని రెడ్డి దర్శకురాలిగా, సంతోష్ శోభన్, మాళవిక నాయర్ ప్రధాన పాత్రలలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంకదత్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 18న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో హీరో సంతోష్ శోభన్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేశారు. 'పేపర్‌బాయ్' చిత్రం తర్వాత సరైన టైమ్‌లో సరైన సినిమా వచ్చిందని భావిస్తున్నాను. ఈ సినిమాలో నేను, షావుకారు జానకీ డార్లింగ్ అని పిలుచుకుంటాం. ఇక అక్కంటే మా వాసుకిలా ఉండాలి అనిపించింది. ఎమోషన్స్, లైటర్‌వేలో సీన్స్ చాలా అద్భుతంగా చేసింది.నా కెరీర్‌లో ఇలాంటి కథకానీ, ఇంతమంది నటీనటుల కాంబినేషన్‌లో భాగమయ్యే అవకాశం రాదేమోనని అనుకున్నా. దర్శకురాలు నందినీరెడ్డి ఒరిజినల్‌గా నవ్విస్తూ, ఏడిపిస్తారు. ఈ సినిమాలో ఒరిజినల్ స్ట్రెంత్.. డ్రామా, ఎమోషన్స్, చాలా కొత్తగా అనిపించే సన్నివేశాలే. ఇందులో రుషి అనే పాత్రలో నవ్వుతూ, నవ్విస్తూ ఉంటా. మాళవిక కళ్ళతోనే అభినయించగల నటి. మాది మూడు స్టేజీల్లో కథ నడుస్తుంది. ప్రతి చోటా మా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగుంటుంది. ఇటీవలే ఈ సినిమాను ఎటువంటి బీజియమ్ లేకుండా చూశాను. బయటకు వచ్చాక చాలా తేలిగ్గా హాయిగా అనిపించింది. అదే శుభ శకునం నాకు' అని అన్నారు.



సంతోష్ శోభన్


నవ్వించే తురుమ్‌ఖాన్‌లు

తెలంగాణ పల్లె కథతో వస్తున్న సినిమా 'తురుమ్ ఖాన్‌లు'. స్టార్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ పై శివకళ్యాణ్ దర్శకత్వంలో ఎండీ.ఆసిఫ్ జానీ నిర్మిస్తున్న ఈ చిత్రం శంషాబాద్‌లో జరిగిన ఆఖరి షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తి చేసుకుంది. పల్లెటూరు రివెంజ్ కామెడీ జోనర్‌లో మొదటిసారి మహబూబ్ నగర్ స్లాంగ్‌లో తెరకెక్కు తున్న ఈ చిత్రంలో దాదాపు 90 శాతం కొత్త నటీనటులే కావడం విశేషం. ఈ సందర్భంగా దర్శకుడు శివకళ్యాణ్ మాట్లాడుతూ, 'దర్శకుడిగా ఇది నాకు మొదటి సినిమా. నన్ను, నా కథని నమ్మిన నిర్మాత ఆసిఫ్ జానీకి థ్యాంక్స్. ఈ ఆధునిక యుగంలో బ్రహ్మ, విష్ణు, ఈశ్వర్ అనే ముగ్గురు యువకులు ఒకే ఊరిలో పుట్టి, పెరిగి, సరదాగా ఒకరినొకరు ఎలా ఆటపట్టించుకుంటారు?, ఒకర్ని ఒకరు ఎలా ఏడిపించుకుంటారు అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రమిది' అని అన్నారు. 'బలమైన కథ, సహజమైన పాత్రలు ఉన్న ఈ చిత్రాన్ని క్వాలిటీగా రూపొందించడానికి ఎక్కడా, ఏ మాత్రం కాంప్రమైజ్ కాలేదు. సినిమా అనుకున్న దానికంటే బాగా వచ్చింది. త్వరలోనే భారీ ఎత్తున థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నాం' అని నిర్మాత ఆసిఫ్ జానీ చెప్పారు.



మదర్స్‌డే గిఫ్ట్‌గా అమ్మే దైవం


నేడు(ఆదివారం) మదర్స్ డే. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని 'అమ్మే దైవం' పేరుతో సీనియర్ నటుడు మురళీమోహన్ ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మదర్స్ డే సందర్భంగా 'మిథునం' మ్యూజిక్ డైరెక్టర్ వీణపాణి ఒక పాట రాశారు. ఆ పాటతో పాటూ మన హీరోలందరి తల్లుల ఫొటోలను వేసి ఒక చిన్న వీడియో రూపంలో దాన్ని విడుదల చేస్తున్నాం. రత్నాల్లాంటి బిడ్డలను కళామతల్లికి అందించిన ఆ రత్న గర్భాల గురించి కూడా జనాలకు తెలియజేయడం ఆనందంగా ఉంది. అలాగే నేను ఇండస్ట్రీకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. అయితే వ్యాపారం, రాజకీయాలతో సినిమాలకు పదేళ్ళు బ్రేక్ వచ్చింది. ప్రస్తుతం అవన్నీ పూర్తిగా వదిలేసి కంప్లీట్‌గా సినిమాలపై ఫోకస్ చేస్తాను' అని తెలిపారు.



మురళీ మోహన్

హ్యాపీ ఎండింగ్

యశ్ పూరీ, అపూర్వ రావు జంటగా రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. కౌశిక్ భీమిడి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని సిల్లీ మాంక్స్, హామ్స్ టెక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నాయి. త్వరలోనే విడుదలకు ముస్తాబవుతున్న ఈ చిత్ర టీజర్‌ని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత అనిల్ పల్లాల మాట్లాడుతూ,'కౌశిక్ చెప్పిన ఓ లైన్ నచ్చి చేసిన సినిమానే ఇది. మేం అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది' అని తెలిపారు. దర్శకుడు కౌశిక్ మాట్లాడుతూ, 'టీజర్‌ని కావాలనే షార్ట్‌గా కట్ చేశాం. ఏ మాత్రం లెంగ్త్ పెంచినా కంటెంట్ లీక్ అవుతుంది. అందుకే హీరోయిన్‌ను కూడా చూపించలేదు. ఈ టైటిల్ వినగానే చాలా ఊహించు కుంటారు. కానీ అలాంటిదేమీ ఉండదు. ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్.
ఈ కథను మూడేళ్ల క్రితం అనిల్‌కి చెప్పాను. అప్పుడే ఆయన చాలా నవ్వుకున్నారు. ఇక రైటర్ మ్యాజిక్ ఏంటనేది.. సినిమా చూస్తే తెలుస్తుంది. ఈ సినిమాతో యశ్ ఖచ్చితంగా ఓ ప్రామిసింగ్ యాక్టర్‌గా ఎదుగుతాడు. హీరోయిన్ పాత్ర సినిమా అంతా ఉంటుంది. తన పాత్ర మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.
'చాలామంచి ప్యాసినేట్ మూవీ టీమ్‌తో పనిచేశాను. డైరక్టర్ కౌశిక్ కల్ట్ ఫిల్మ్ మేకర్ అవుతాడు. ఈ మూవీ మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని హీరోయిన్ అపూర్వ రావు చెప్పారు. హీరో యశ్ మాట్లాడుతూ, 'ఇది నాకు మూడో సినిమా. 'హ్యాపీ ఎండింగ్' అనేది కమింగ్ ఆఫ్ ఏజ్ ఫిల్మ్. అంటే పిల్లాడి నుంచి వ్యక్తిగా మారే కథ. షూటింగ్ పూర్తి చేసుకుని, త్వరలోనే సెన్సార్‌కు వెళ్ళబోతున్నాం' అని అన్నారు.



యశ్‌పూరీ

7 భాషల్లో అజాగ్రత్త..

శ్రేయాస్ తల్పడే, రాధిక కుమారస్వామి జంటగా రూపొందుతున్న చిత్రం 'అజాగ్రత్త'. ఎం శశిధర్ దర్శకత్వంలో రవి రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా టాలీవుడ్ ప్రముఖుల సమక్షంలో ఘనంగా ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏ ఎం రత్నం క్లాప్ కొట్టగా, నిర్మాత ఠాగూర్ మధు కెమెరా స్విచ్ ఆన్ చేశారు.
సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా వస్తోన్న ఈ సినిమాలో రావు రమేష్, సునీల్, ఆదిత్య మీనన్ వంటి హేమాహేమీలు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.
ఈ సందర్భంగా నిర్మాత రవి రాజ్ మాట్లాడుతూ, 'మంచి కథతో ఈ సినిమాని అన్ని భాషల్లో నిర్మిస్తున్నాం' అని తెలిపారు. 'ఈ సినిమాను ఏడు భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఇలాంటి మంచి ప్రొడక్షన్ కంపెనీలో ఛాన్స్ దొరకడం, నాయిక రాధిక అవకాశం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది' అని దర్శకుడు ఎం శశిధర్ అన్నారు. రాధిక కుమారస్వామి మాట్లాడుతూ, 'ఈ సినిమాకు నేను నిర్మాతగా ఉండాల్సింది. కానీ హీరోయిన్‌గా ఫిక్స్ అవుతాను అని అనుకోలేదు. స్క్రిప్ట్ విన్నాక షాక్ అయ్యాను. చాలా ఏళ్ల తరువాత ఇలా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను' అని తెలిపారు. 'సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే సినిమా' అని శ్రేయాస్ తల్పడే చెప్పారు.



ఎం.శశిధర్, శ్రేయాస్ తల్పడే, రాధిక కుమారస్వామి. రవి రాజ్

సరికొత్త కాన్సెప్ట్



దివ్యభారతి, సుడిగాలి సుధీర్

సుడిగాలి సుధీర్, దివ్య భారతి జంటగా 'పాగల్' ఫేమ్ నరేష్ కుప్పిలి దర్శకత్వం వహిస్తున్న చిత్ర పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. నిర్మాతలు చంద్ర శేఖర్ రెడ్డి మొగుళ్ళ, బెక్కం వేణుగోపాల్, లక్కీ మీడియా, మహారాజా క్రియేషన్స్ బ్యానర్స్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు చదలవాడ శ్రీనివాసరావు క్లాప్ కొట్టగా, జెమినీ కిరణ్ కెమెరా స్విచ్ ఆన్ చేసారు. ఈ సందర్భంగా నిర్మాత చంద్ర శేఖర్ రెడ్డి మొగుళ్ళ మాట్లాడుతూ,'ఈ సినిమాకు సంబంధించి బెక్కం వేణుగోపాల్ కర్త, కర్మ, క్రియ. లియో మ్యూజిక్ అందిస్తున్నారు' అని తెలిపారు.'మా ప్రొడ్యూసర్స్ ఈ సినిమా విషయంలో ఎక్కడా కంప్రమైజ్ కాకుండా అన్ని చేసి పెట్టారు' అని దర్శకుడు నరేష్ కుప్పిలి చెప్పారు. మరో నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ,'ఎన్నో హిట్ సినిమాలు చేసాను. ఇది కూడా ఒక హిట్ సినిమా అవ్వబోతుంది' అని అన్నారు. 'ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

బిజినెస్

ఏడాది నుంచే క్రెడిట్ సుస్సెలో సమస్యలు

- యూబీఎస్ సీఈఓ సెర్జియో ఎర్మొట్టి



జూరిచ్ : స్విజ్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ బ్యాంక్ దిగ్గజం క్రెడిట్ సుస్సెలో ఏడాది క్రితం నుంచే సంక్షోభం మొదలయ్యిందని యూబీఎస్ సీఈఓ సెర్జియో ఎర్మొట్టి పేర్కొన్నారు. ఇరు బ్యాంక్ లను విలీనం చేయడానికి క్రెడిట్ సుస్సెపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు. సంక్షోభంలోని ఆ బ్యాంక్‌ను నెలన్నర క్రితం యూబీఎస్ స్వాధీనం చేసు కున్న విషయం తెలిసిందే. గత ఆరేడు ఏండ్లుగా జరిగిన అన్ని పరిణా మాలపై 360 డిగ్రీల్లో విచారణ జరుపుతున్నామని స్విస్ మీడియాతో ఎర్మొటి అన్నారు. ఇప్పటికీ పరిస్థితులు కఠినంగానే ఉన్నాయన్నారు. గత ఆరు వారాల్లో పరిస్థితిలో వృద్ధి లేదన్నారు. అలాగని.. గత ఆరేడేళ్లుగా అభివృద్ధి ఏమి లేదన్నారు. సమస్యాత్మక క్రెడిట్ సుస్సె బ్యాంక్‌ను యుబిఎస్ స్వాధీనం చేసుకుంటుందని.. ఈ క్రమంలో ఆ బ్యాంక్ సమస్యలకు గల కారణాలపై పూర్తి సమీక్ష ముఖ్యమన్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనడానికి ఒక ఏడాది పడుతుందన్నారు. ఈ నెల ముగింపు నాటికి క్రెడిట్ సుస్సె స్వాధీన ప్రక్రియ పూర్తి కానుందన్నారు. అమెరికాలో వరుసగా బ్యాంక్‌లు విఫలం కావడంతో క్రెడిట్ సుస్సెలోనూ లోపాలు బయటపడ్డాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఒక్కో బ్యాంక్ దివాలా తీస్తోంది. ఇటీవల సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి), ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్, సిల్వర్ గేట్ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్‌లు దివాళా తీసిన విషయం తెలిసిందే. తాజాగా పసిఫిక్ వెస్ట్రన్ బ్యాంక్ కుదుపు బ్యాంకింగ్ పరిశ్రమను ఆందోళనకు గురి చేస్తోంది.

డిమార్ట్‌కు రూ.505 కోట్ల లాభాలు



న్యూఢిల్లీ : రాధాకిషన్ దామానికి చెందిన డిమార్ట్ లాభాలు మరింత పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో డిమార్ట్ మాతృసంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ 8.33 శాతం వృద్ధితో రూ.505.21 కోట్ల నికర లాభాలు గడించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.466 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.8,606 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం క్యూ4లో 21.11 శాతం వృద్ధితో రూ.10,337.12 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఎఫ్‌ఎంసిజి విభాగం అమ్మకాల్లో మెరుగైన ప్రగతిని నమోదు చేశామని అవెన్యూ సూపర్‌మార్ట్స్ సిఇఒ, ఎండి నెవిల్లీ నొరొన్హా పేర్కొన్నారు. శుక్రవారం డిమార్ట్ షేర్ విలువ 0.62 శాతం తగ్గి రూ.3,680.25 వద్ద ముగిసింది. ఈ దఫా లాభాలు పెరిగినప్పటికీ.. పలు ఏజెన్సీల అంచనాలను చేరలేకపోయింది.

దేశంలో ఓలా 500 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు



న్యూఢిల్లీ : ఓలా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ తన నెట్‌వర్క్‌ను 500 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లకు విస్తరించింది. శ్రీనగర్‌లో నూ తన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఈ మైలురాయిని చేరింది. హైదరాబాద్‌లోనూ గత కొన్ని వారాల్లో తన నెట్‌వర్క్‌ను మూడింతలు పెంచి.. తొమ్మిది ఎక్స్‌పీరియన్స్ సెంటర్లకు చేర్చినట్టు వెల్లడిం చింది. దేశవ్యాప్త డీ2సీ విస్తరణ ప్రణాళికలో భాగంగా ఓలా ఎక్స్పీరియన్స్ సెంటర్లను గత కొన్ని వారాలుగా చురుకుగా ప్రారంభించుకుంటూ వస్తు న్నట్టు తెలిపింది. గత సంవత్సరం పూణేలో తన మొట్టమొదటి అవుట్ లెట్‌ను ప్రారంభించి నప్పటి నుండి కేవలం ఎనిమిది నెలలలోపు దేశంలోని ఆటోమోటివ్ పరిశ్రమలో అతిపెద్ద బి2సి రిటైల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ప్రస్తుతం దాదాపు 300 నగరాల్లో ఓలా తన ఉనికిని కలిగివుందని తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు నాటికి దేశంలో ఈ సంఖ్యను 1,000కి చేర్చాలని నిర్దేశించుకున్నామని ఓలా ఎలక్ట్రిక్ సీఎంఓ అన్షుల్ ఖండేల్వాల్ పేర్కొన్నారు. ఈ 500వ స్టోర్ ప్రారంభించడం తమ విజయాన్నీ సూచించడంతో పాటు ఇంకా ముందున్న సవాళ్లను కూడా గుర్తు చేస్తుందన్నారు.

వొడాఫోన్ ఐడియాకు గడ్డుకాలం

హైదరాబాద్ : ప్రయివేటు టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా (వీఐ) గడ్డుకాలాన్ని ఎదుర్కొంటుంది. క్రమంగా ఖాతాదారులు చేజారిపోతున్నారు. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో 20 లక్షల మంది వీఐని వీడారని ట్రాయ్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. జియోలోకి 10 లక్షల మంది చేరగా, ఎయిర్‌టెల్‌లోకి 9,82,554 మంది చేరారు. దేశంలో మొత్తం వైర్‌లెస్ వినియోగదారుల సంఖ్య 10లక్షల మేరకు తగ్గారు. జియోకు 37.41 శాతం, భారతీ ఎయిర్‌టెల్‌కు 32.29 శాతం, విఐకి 20 శాతం, బీఎస్‌ఎన్‌ఎల్‌కు 9.37 శాతం చొప్పున వాటాను కలిగి ఉన్నాయి. జియో, ఎయిర్‌టెల్ 5జీ సేవల్ని వేగంగా విస్తరిస్తుండగా.. విఐ మాత్రం ఇందులో వెనుకబడి పోవడంతో ఆ సంస్థను ఖాతాదారులు వీడుతున్నారని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

మదీనాగూడాలో కొత్త ఈవీ షోరూం ఏర్పాటు

హైదరాబాద్ : విద్యుత్ ద్విచక్రవాహన ఈఈఎంలలో ఒకటైన ప్యూర్ ఇవి తమ నూతన ఈవీ డీలర్‌షిప్ షోరూం యూనివర్శిల్ ఆటోమోటివ్‌ను మదీనాగూడాలో ప్రారంభించినట్లు తెలిపింది. దీన్ని ఎంఎల్‌ఎ అరికెపూడి గాంధీ ప్రారంభించారని పేర్కొంది. ఈ ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ కేంద్రం ప్యూర్ బ్రాండ్ యొక్క విస్తృత శ్రేణీ మోటర్‌సైకిల్స్, స్కూటర్‌లను ప్రదర్శించింది. దేశవ్యాప్తంగానే కాక విదేశాలలో సైతం ఉన్న తమ డీలర్‌షిప్ నెట్‌వర్క్ ద్వారా 60వేలకు పైగా విద్యుత్ ద్విచక్రవాహనాలను ప్యూర్ ఇవి డెలివరీ చేసినట్టు ఆ సంస్థ తెలిపింది.

నగరంలో 12 స్టోర్లకు విస్తరించిన మలబార్ గోల్డ్



హైదరాబాద్ : ప్రముఖ బంగారు, వజ్రాభరణాల రిటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ హైదరాబాద్‌లో 12 స్టోర్లకు విస్తరించింది. కూకట్ పల్లిలో శనివారం తన రెండవ స్టోర్‌ను తెరిచింది. దీన్ని ఎంఎల్‌ఎ అరికపూడి గాంధీ, మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స యండీ ఇండియా ఆపరేషన్స్ అషర్ ఓ, రిటైల్ హెడ్ సిరాజ్ పికె లాంచనంగా ప్రారంభించారు. ఈ నూతన స్టోర్‌ను 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది. ఈ స్టోర్ నుంచి వచ్చిన లాభాల్లో 5 శాతాన్ని ఆ ప్రాంతంలోని వివిధ స్వచ్ఛంద కార్యకలాపాల కోసం కేటాయించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది.

బెంచీల సరఫరా టెండర్ రద్దుపై రిట్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వం టెండర్లు పిలిచి, తర్వాత దాన్ని రద్దు చేయడానికి గల కారణాలు ఏమిటో చెప్పాలని తెలంగాణ హైకోర్టు కోరింది. మన ఊరు - మన బడి కార్యక్రమం కింద బల్లలు, బెంచీలు అందజేసేందుకు ఇచ్చిన టెండర్‌ను ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం ఇచ్చింది. ఈ టెండర్‌ను తాము దక్కించుకున్నామని చింతామణి పరస్వంత్ ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. టెండర్ కోసం ప్రభుత్వానికి రూ.2.95 లక్షల నగదును బ్యాంక్ గ్యారెంటీగా ఇచ్చినట్టు తెలిపారు. ఎల్-1 కాంట్రాక్టర్‌గా తాము టెండర్ వేయగా, అదే నెలలో తమకు బిడ్ దక్కినట్లు ప్రభుత్వం చెప్పిందని వివరించారు. ఆ తర్వాత టెండర్‌ను ప్రభుత్వం రద్దు చేసి బెంచీలు, బల్లలు సప్లయ్ చేయాలని రాష్ట్ర జైళ్ల శాఖను ఆదేశించిందనీ, ఇది అన్యాయమనీ, స్టే ఇవ్వాలని పిటిషనర్ సంస్థ కోరింది.

కాంగ్రెస్ విజయానికి ఏ ఏ ప్రాంతాలు దోహదం చేశాయి

బెంగళూరు : 2023 కర్నాటక అసెంబ్లీ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజార్టీని సాధించింది. గత ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రంలోని మొత్తం ఐదు ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ తన ఓట్ షేర్‌ను పెంచుకున్నా.. ముఖ్యంగా మూడు ప్రాంతాల్లో మాత్రం కాంగ్రెస్ ప్రభావం గణనీయంగా పెరిగింది. మరింత ముఖ్యంగా ముంబయి/కిత్తూర్ కర్ణాటక, మధ్య కర్ణాటకలో కాంగ్రెస్ సత్తా చాటింది. ఇక్కడ మొత్తం 62 స్థానాలకు 44 స్థానాలను 44.9 శాతం ఓట్ షేర్‌తో దక్కించుకుంది. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ ఓట్ షేర్ 6.2 శాతం, స్థానాలు 24 పెరిగాయి. మరోవైపు ఇక్కడ బిజెపి ఓట్ షేర్ ఈ ఎన్నికల్లో 39 శాతానికి దిగజారింది. 2018 ఎన్నికలతో పోలిస్తే బిజెపి 23 సీట్లను నష్టపోయింది. జగదీష్ షెట్టర్, లక్ష్మణ్ సవేది వంటి నాయకులు కాంగ్రెస్‌లో చేరడం ఆ పార్టీకి కలసివచ్చింది.

దక్షిణ కర్ణాటక, మల్‌నాడ్ రీజన్ (పాత మైసూర్ ప్రాంతంతో కలిసి)లోనూ కాంగ్రెస్ కదం తొక్కింది. ఇక్కడ కాంగ్రెస్ 46 స్థానాలను కైవసం చేసుకుంది. ఇక్కడ మొత్తంగా 71 సీట్లు ఉన్నాయి. 2018 ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్‌కు 25 సీట్లు ఎక్కువగా వచ్చాయి. ఈ సారి 40.9 శాతం ఓట్ షేర్ సాధించింది. గత ఎన్నికల కంటే ఇది 6.6 శాతం అధికం. ఈ ప్రాంతంలో జెడి(ఎస్)కు ఈ ఎన్నికల్లో 15 స్థానాలు లభించగా, బిజెపి కేవలం 10 స్థానాలతో సరిపెట్టుకుంది.

కోస్టల్ కర్ణాటకలో బిజెపి ప్రభావం చూపింది. ఇక్కడ మొత్తం 19 స్థానాలకు గాను బిజెపి 12 స్థానాలను గెలుచుకుంది. ఇక్కడ బిజెపి ఓట్ షేర్ 48.6 శాతంగా ఉంది. ఇక్కడ కాంగ్రెస్ 43.2 శాతం ఓట్ షేర్‌తో 6 స్థానాలను గెలుచుకుంది. ఇక బెంగళూరు ప్రాంతంలోనూ కాంగ్రెస్ కన్నా బిజెపి ఎక్కువ ప్రభావం చూపింది. బిజెపి 46.1 శాతం ఓట్ షేర్‌తో 15 స్థానాలు సాధించగా, కాంగ్రెస్ పార్టీ 41 శాతం ఓట్ షేర్‌తో 13 స్థానాలను తన ఖాతాలో వేసుకుంది.

మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా చూస్తే కాంగ్రెస్ ఓట్ షేర్ 42.9 శాతం, బిజెపి ఓట్ షేర్ 35.9 శాతం, జెడి(ఎస్) ఓట్ షేర్ 13.3 శాతంగా ఉంది.

ప్రాంతాల వారీగా విజయం సాధించిన స్థానాలు

ప్రాంతాలు	కాంగ్రెస్	బిజెపి	జెడి(ఎస్)
బెంగళూరు	13	15	0
కోస్టల్ కర్ణాటక	6	12	1
కళ్యాణ కర్ణాటక	27	9	3
కిత్తూర్ కర్ణాటక	44	18	1
దక్షిణ కర్ణాటక	46	10	15

ప్రాంతాల వారీగా ఓట్ షేర్

ప్రాంతాలు	కాంగ్రెస్	బిజెపి	జెడి(ఎస్)
బెంగళూరు	41.0 శాతం	46.1 శాతం	7.8 శాతం
కోస్టల్ కర్ణాటక	43.2 శాతం	48.6 శాతం	2.0 శాతం
కళ్యాణ కర్ణాటక	46.4 శాతం	35.8 శాతం	10.6 శాతం
కిత్తూర్ కర్ణాటక	44.9 శాతం	39.0 శాతం	5.5 శాతం
దక్షిణ కర్ణాటక	40.9 శాతం	25.2 శాతం	26.3 శాతం

ఓపీఎస్ అమలు చేయకుంటే ఏ ప్రభుత్వమైనా ఇంటిదారే

- కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంతో సీపీఎస్ ఉద్యోగులకు సామాజిక భద్రత : ఎన్‌ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటక శాసనసభ ఎన్నికల ఫలితాల్లో పాత పెన్షన్ అమలు చేస్తామంటూ ప్రధానంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ గెలవడం పట్ల ఎన్‌ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ, తెలంగాణ సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ హర్షం ప్రకటించారు. ఆ రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగుల ఐదు లక్షల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఓపీఎస్‌ను అమలు చేయడం ద్వారా సామాజిక భద్రత చేకూరుతుందని శనివారం వారు ఒక ప్రకటకలో తెలిపారు. పాత పెన్షన్ అమలు చేస్తామంటూ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పార్టీ గెలవడమనేది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల్లో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)పై ఉన్న వ్యతిరేకత మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. నాడు ఓట్ ఫర్ ఓపీఎస్ ద్వారా హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఢిల్లీ, పంజాబ్ ప్రభుత్వాలు పాత పెన్షన్‌ను పునరుద్ధరణ చేశాయని గుర్తు చేశారు. ఆ రాష్ట్రాల జాబితాలో కర్ణాటక రాష్ట్రం కూడా చేరనుందని తెలిపారు. ఈ సందర్భంగా కర్నాటక సీపీఎస్ ఉద్యోగులకు శుభాకాంక్షలు ప్రకటించారు. ఓపీఎస్ పునరుద్ధరణ చేయకపోతే ఏ ప్రభుత్వమైనా ఇంటిదారి పట్టాల్సిందేనని వారు పునరుద్ఘాటించారు. డిసెంబర్‌లో బెంగళూరు కేంద్రంగా చేపట్టిన ఓట్ ఫర్ ఓపీఎస్ ఉద్యమం నేడు దాని ప్రతిఫలాలను అందుకోబోతున్నదని వివరించారు. అక్కడ ఐదు లక్షల సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు వారి కుటుంబాల ఓట్లు దాదాపు 35 లక్షల వరకు ఉన్నాయని తెలిపారు. దీంతో రాష్ట్ర ఎన్నికల ముఖచిత్రాన్ని ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి వచ్చే పెన్షన్ నిధితో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించొచ్చని సూచించారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లు దాదాపు 48 స్థానాలకు పైగా ప్రభావితం చేసిందని తెలిపారు. సీపీయస్ రద్దుతో కర్నాటక ప్రభుత్వానికి, ఉద్యోగుల పెన్షన్ కార్పస్ ఫండ్ రూ.24 వేల కోట్లు అందుతాయని వివరించారు. తెలంగాణలో కూడా పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు.



బండీ..ఎక్కడా గెలవలేదండీ..

- కర్నాటకలో ఫలించని తెలంగాణ నేతల ప్రచారం
- వారు ప్రచారం చేసిన చోట్లలో దక్కని గెలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కన్నడనాట తెలుగు ప్రజలు ఎక్కువ ఉండే ప్రాంతాల్లో తెలంగాణ బీజేపీ నేతలు చేసిన ప్రచారం బెడిసికొట్టింది. రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ప్రచారం చేసినచోటల్లా ఆ పార్టీ బొక్కాబోర్లా పడింది. చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్ ఈటె గురితప్పింది. ఆయన ప్రచారం చేసి చోట బీజేపీ ఓడిపోయింది. వివేక్, మనోహర్‌రెడ్డి, పలువురు నేతలు కూడా కర్నాటక ప్రచారంలో పాల్గొన్నారు. అక్కడా నిరాశజనకంగానే ఫలితాలు వచ్చాయి. బండి ప్రచారం చేసిన ఒక్కచోట కూడా ఆ పార్టీ అభ్యర్థులు గెలువలేదు. కొన్ని ప్రాంతాల్లోనైతే ఐదో స్థానానికి పడిపోయిన దుస్థితి నెలకొంది. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ఐదు నియోజకవర్గాల్లో బండి సంజయ్ విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ ఐదింటిలోనూ బీజేపీ ఒక్కటంటే ఒక్క సీటును కూడా గెలువలేకపోయింది. అక్కడ బీజేపీకి మరీ దారుణమైన ఫలితాలు ఎదురయ్యాయి. గౌరీబిదనూర్‌లో బీజేపీ అభ్యర్థి హెచ్‌ఎస్.శశిధర కుమార్‌కు కేవలం 8 వేల ఓట్లే పడ్డాయి. అక్కడ ఆ అభ్యర్థి ఐదో స్థానానికి పరిమితం అయ్యాడు. ముల్బగల్‌లో అక్కడ గెలిచిన జేడీఎస్ అభ్యర్థికి 94,254 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి సుందర్‌రాజ్ 9 వేల ఓట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. ఆ రెండు చోట్లా బీజేపీకి డిపాజిట్ దక్కలేదు. చింతామణిలో కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్‌సీ సుధాకర్‌కు 97,324 ఓట్లు పోలవ్వగా..బీజేపీ అభ్యర్థికి 21,711 ఓట్లే వచ్చాయి. బాగేపల్లిలో బీజేపీ అభ్యర్థి మునిరాజు 20వేల పైచిలుకు ఓట్లతో పరాజయం పాలయ్యాడు. చిక్‌బల్లాపూర్‌లోనూ బీజేపీ అభ్యర్థి 11 వేల ఓట్లతో ఓడిపోయాడు. ఆ నియోజకవర్గాల్లో బండి సంజయ్ వీధివీధి తిరుగుతూ తెలుగులో మాట్లాడి ప్రచారం చేశారు. ఇక్కడిలాగే అక్కడా ప్రజల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆయన ఎంత మొరపెట్టుకున్నా కన్నడనాట ఉన్న తెలుగు ఓటర్లు ఆయన్ను ఆదరించలేదు. ఇప్పుడీ వ్యవహారం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. కర్నాటక ఫలితాలపై శనివారం సాయంత్రం వరకూ నేతలెవ్వరూ స్పందించకపోవడంపైనా చర్చనీయాంశం అవుతున్నది. బండి ఎక్కడికెళ్లినా విద్వేషపు ప్రసంగం, రెచ్చగొట్టే కామెంట్స్ చేయడం ఇంకొకటి ఉండదనీ, ఆయా నియోజకవర్గాల్లో వచ్చే ఓట్లు కూడా కాంగ్రెస్‌కే పోయాయని నెటిజన్లు తెగ చర్చించుకుంటున్నారు. ఇదీ వాస్తవమే. బాగేపల్లిలో బండి మాట్లాడుతూ...కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పాలనలో ఇన్నేండ్లు ఉన్న బాగేపల్లిలో ప్రజలు తాగుబోతులయ్యారనీ, అభివృద్ధే చేయలేదని వ్యాఖ్యానించారు. ఇది అక్కడి బీజేపీ అభ్యర్థికి ప్రతిబంధకంగా మారింది. మా ప్రాంతానికొచ్చి మమ్ముల్నే తాగుబోతులు అంటారా? అని చర్చనీయాంశం కూడా అయ్యింది. ఇదీ బండి రేంజ్..ఆయన ప్రచారం చేస్తే మినిమమ్ ఇట్లుంటంది అని సోషల్‌మీడియాలో కామెంట్లు వైరల్ అవుతున్నాయి.

భూకబ్జాదారుల ఆగడాలు అరికట్టాలి

అర్హులందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-జైపూర్

అసైన్డ్ భూముల్లో కబ్జాదారుల ఆగడాలు అరికట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ శివారు బావురావుపేట్ భూపోరాట కుటుంబాలను శనివారం ఆయన కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బావురావుపేట్ శివారు సర్వే నెం.8లో అసైన్డ్ భూమిని పేదల ఇండ్ల స్థలాలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 14 రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిం చడం సరికాదన్నారు. భూపోరాటంలో పాల్గొంటున్న మహిళలను పోలీసులు బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అధికారాన్ని చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు లేని పేదలను పట్టించుకోకపోవడం భావ్యం కాదన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిచ్చి ఇస్తామని ఇప్పటి వరకు నెరవేర్చలేదని తెలిపారు. అక్రమార్కుల చేతుల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీన పర్చుకోవాలని డిమాండ్ చేశారు. పేదల న్యాయమైన పోరాటానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ప్రేంకుమార్, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బొడంకి చందు, కావిరి రవి, పట్టణ కార్య దర్శి ఆవేజ్, ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయ కులు మణి, శ్రీనివాస్, ప్రసన్న, రేణుక, సాజిత్, సంధ్య, లలిత, సమ్మక్క, లత, వైశాలి, భానుమతి, రాధిక, లక్ష్మి, నవీన్, ఉమారాణి, మౌనిక పాల్గొన్నారు.

మతపర భావజాల వ్యాప్తికే నూతన విద్యావిధానం

గణితం, సైన్స్ ప్రశ్నాపత్రంలో లోపాలతోనే తగ్గిన టెన్త్ ఉత్తీర్ణత

- రాష్ట్రంలో 40వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి
- జూన్‌లోపే టీచర్ల బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలి :

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మతపరమైన భావజాలం వ్యాప్తికే కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం-2023 తీసుకొస్తుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. జాతీయ విద్యావిధానంపై 660 పేజీల డ్రాఫ్ట్‌ను రిలీజ్ చేసి అభిప్రాయాలు చెప్పాలని కోరినా అది మాతృభాషలో లేకపోవడం వల్ల చాలామంది తమ అభిప్రాయాలను వెల్లడించలేకపోయారని చెప్పారు. ఖమ్మం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో చావా రవి విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. దేశం మొత్తానికి ఒకే సిలబస్ ఉండాలనే పేరుతో భారతదేశ చరిత్ర నుంచి గాంధీజీ హత్య గుజరాత్ అల్లర్ల వంటి అంశాలను తొలగించి మూఢ, మత విశ్వాసాలను పెంపొందించే సిలబస్‌ను రూపొందిస్తున్నారని తెలిపారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని కూడా తొలగించటం దారుణమన్నారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీనికోసం జులైలో పాదయాత్రలు, ఆగస్టు 12న నిరసనలు, నవంబర్‌లో మార్చ్ టూ పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు చెప్పారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా 86.6% ఉత్తీర్ణత సాధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. వందశాతం ఫలితాల కోసం ప్రభుత్వం ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పెడుతోందన్నారు. అయితే, సైన్, గణితం ప్రశ్నాపత్రాల కూర్పులో లోపాల కారణంగానే రిజల్ట్స్ ఒకింత తగ్గాయన్నారు. సగటు విద్యార్థిని దృష్టిలో పెట్టుకుని రూపొందించాల్సిన గణితం పేపర్‌ను ఐఐటీ స్థాయిలో ప్రశ్నలిచ్చారని ఆరోపించారు. భౌతిక, రసాయన శాస్త్రాలతో పాటు జీవశాస్త్రాన్ని ఒకే పేపర్‌గా నిర్వహించడం వల్ల కూడా మార్కులపై ప్రభావం పడిందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతోనే ప్రశ్నాపత్రాలు తయారు చేయించాలని కోరారు.

వేసవి సెలవుల్లోనే ప్రమోషన్లు ఇచ్చి, బదిలీలు చేపట్టడం ద్వారా ఖాళీల సంఖ్య తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో 20వేల పోస్టుల వరకు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఇంగ్లీష్ మీడియంలో మరో 20వేల పోస్టులు అవసరమవుతాయని తెలిపారు. మొత్తం 40వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్‌కు దీటుగా గురుకులాల్లో రిజల్ట్ రావడం హర్షనీయమైనా.. అక్కడ ఒక్కో విద్యార్థిపై ఏడాదికి సగటున రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నారని.. అదేస్థాయిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ స్కూల్స్‌లోనూ వెచ్చిస్తే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ఎస్టీఎఫ్‌ఐ సమావేశాలు త్రివేండ్రంలో జరిగాయని, దీనిలో విద్యారంగంలో అమలవుతున్న విధానాలపై పలు తీర్మానాలు చేసినట్టు చెప్పారు. మూఢ, మత విశ్వాసాలను పెంపొందించే విధానాలను రద్దు చేయాలన్నారు. నూతన విద్యావిధానంపై సంతకాల సేకరణతోపాటు పలు రకాల ఉద్యమాలు నిర్వహించామని, ఇక మీదట కూడా నిర్వహిస్తామన్నారు. జూనియర్ పంచాయతీ కార్మికులు, మహిళా రెజ్లర్ల నిరసనకు మద్దతు ప్రకటించారు. సకాలంలో వేతనాలు ఇవ్వాలని సంఘం రాష్ట్ర ఆడిటింగ్ బాధ్యులు మహబూబ్‌అలీ కోరారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఉన్న జీపీఎఫ్‌ను జిల్లాల వారీగా విభజించాలని సంఘం జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. వేసవి సెలవుల్లోనూ పాఠశాలలకు రావాల్సిందిగా డీఈవో మౌఖిక ఆదేశాలు జారీ చేస్తుండటాన్ని తప్పుబట్టారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, వైస్ ప్రెసిడెంట్ షమీ, రాష్ట్ర కమిటీ సభ్యులు రాంబాబు, షేక్ రంజాన్ తదితరులు ఉన్నారు.

ప్రొఫెసర్ ఓంకార్ లేకపోవటం బాధాకరం

- టీజేఎస్ అధ్యక్షులు కోందండరాం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రగతిశీల ఉద్యమ నేత ప్రొఫెసర్ ఓంకార్ మన మధ్య లేకపోవటం బాధాకరమని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఓంకార్ సంతాప సభను డాక్టర్ అజిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఓంకార్ ముక్కుసూటిగా మాట్లాడే వారని గుర్తుచేశారు. స్వతంత్రంగా ఆలోచించడంతోపాటు స్వతంత్రంగా బతకడాన్ని ఇష్టపడేవారని తెలిపారు. తాను చెప్పాల్సిన అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పేవారని వివరించారు. ప్రజాసంబంధాలను విస్తృతంగా నెరిపేవారని చెప్పారు. మంచి మిత్రుడిని కోల్పోయినందుకు బాధగా ఉందన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు బూర్గుల ప్రదీప్ 'ఓంకార్ జ్ఞాపకాలు' పుస్తకాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓంకార్ ఓ అద్భుతమైన మనిషి కాబట్టే..ఆయన గురించీ, ఆయన జీవితం గురించి, ఆయన కృషి గురించి మాట్లాడుకుంటున్నామని చెప్పారు.

ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు సుమారు 50ఏండ్ల కిందే వచ్చారని చెప్పారు.ఉస్మానియా యూనివర్సిటీలో పది డిగ్రీ పట్టాలు పొందారన్నారు. అదే విద్యాలయంలో పనిచేసి ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ పొందారని గుర్తుచేశారు. ప్రగతి శీల విద్యార్థి ఉద్యమం తామిద్దరి మధ్య స్నేహాన్ని పెంచిందని గుర్తుచేశారు. ఆయన వాల్‌రైటింగ్, బ్యానర్లు, పోస్టర్లు రూపొందిచే కృషిలో ప్రతిభావంతుడని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ప్రహ్లాద్,ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్‌రావు, నాగయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.

నేటితో ఎంసెట్ ఇంజినీరింగ్ పరీక్షలు పూర్తి

- రెండోరోజు 95.21 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు ఆదివారంతో ముగియనున్నాయి. ఈ మేరకు ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగానికి రెండోరోజు ఉదయం నిర్వహించిన మొదటి విడతకు 34,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 32,996 (95.21 శాతం) మంది పరీక్ష రాశారు.

మొదటి విడతకు 1,659 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో విడతకు 34,370 మంది దరఖాస్తు చేయగా, 32,722 (95.21 శాతం) మంది హాజరయ్యారు. రెండో విడతకు 1,649 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు జరుగుతున్న తీరును ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

14న అగ్రికల్చర్ విభాగం ప్రాథమిక కీ విడుదల

ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను ఈనెల 10,11 తేదీల్లో నిర్వహించామని ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రాథమిక కీతోపాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని సూచించారు.

ప్రాథమిక కీపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 16వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు సమర్పించొచ్చని కోరారు. ఎంసెట్ వెబ్‌సైట్ ద్వారానే అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఇతర పద్ధతుల్లో స్వీకరించబోమని స్పష్టం చేశారు.

కర్నాటక ఫలితాలు బీసీల మనోగతాన్ని ప్రతిబింబించాయి : దాసు సురేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీల మనోగతాన్ని కర్నాటక ఎన్నికల ఫలితాలు ప్రతిబింబివజేశాయని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్యుల ఓట్లతో అధికారంలోకి వచ్చి పేద వర్గాలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ప్రజల అవసరాలు తీర్చకుండా పెత్తందారీగా వ్యవహరిస్తే ప్రజలు ఎన్నటికైనా కూలదోస్తారని గుర్తుచేశారు. అలాంటి ప్రభుత్వాలకు ప్రజాక్షేత్రంలో పరాభావం తప్పదదనే విషయం కర్ణాటక ఎన్నికల ఫలితాల ద్వారా మరోసారి నిరూపితమైందని తెలిపారు.

కర్నాటక ఫలితాలు బీజేపీకి చెంపపెట్టు

- తెలంగాణలో కేసీఆర్ ఉండగా.. కాంగ్రెస్, బీజేపీలకు చోటే లేదు :మంత్రి వి.ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అభివృద్ధిని మరిచి మతాలు, దేవుని పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీకి కర్నాటక ఫలితాలు చెంపపెట్టులాంటివని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నాటకలో 40 శాతం కమిషన్, అవినీతి పాలన వారిని నిండాముంచిందని తెలిపారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలు అమ్ముతూ..దేశ సంపద అంతా మోడీ దోస్త్ అదానీకి దారాదత్తం చేస్తూ...అక్రమంగా వచ్చిన సొమ్ముతో ప్రభుత్వాలను కూలుస్తు నీచాతినీచ రాజకీయాలకు ఒడిగట్టారని విమర్శించారు. ప్రజల పట్ల వైషమ్యాలు రెచ్చగొట్టి,దేశ భద్రతనే గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అసమర్థ,అవినీతి పాలన వల్ల సిలిండర్ ధర,పెట్రోల్,డీజిల్,నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటి సామాన్యులు అరిగోస పడుతున్నారని తెలిపారు. కర్నాటక ప్రజలు ప్రభుత్వంపైన తీవ్ర వ్యతిరేకతతో ప్రత్యామ్నాయ పార్టీ అయిన కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని పేర్కొన్నారు. అక్కడి ఫలితాలను చూసి తెలంగాణలో ఏమో పొడుస్తామని ఇక్కడి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారనీ, అది వాపు చూసి బలుపు అనుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి తప్పా.. కాంగ్రెస్, బీజేపీకి చోటులేదని తెలిపారు. దమ్ముంటే బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేసి చూపాలని సవాల్ విసిరారు.

కర్నాటక ప్రజల తీర్పును ఆహ్వానిస్తున్నాం

- ప్రజాపంథా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో మత విద్వేష, ఫాసిస్టు బీజేపీని ఓడించిన ప్రజల తీర్పును ఆహ్వానిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిరాయింపులకు అవకాశం ఇచ్చే వాతావరణం లేకుండా కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీతో బీజేపీని మట్టికరిపించడం ఓటర్ల విజ్ఞతకు నిదర్శనమని తెలిపారు. బీజేపీ గతంలో ఫిరాయింపులను ప్రోత్సహించి దొడ్డిదారిలో దొంగ పద్ధతిలో అధికారానికి వచ్చిందని పేర్కొన్నారు. కర్నాటకలో ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టిందని తెలిపారు. గౌరీలంకేశ్, కల్బుర్గి వంటి మేధావులు, జర్నలిస్టులను చంపిందని విమర్శించారు. మోడీ, అమిత్‌షా దుష్ట రాజకీయాలకు ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రజాస్వామికమైందని తెలిపారు. విద్వేషాలతో రగులుతున్న దేశానికి ఇది ఊరట అని వివరించారు. ఇది దేశ భవిష్యత్ తీర్పుగా మారాలని ఆకాంక్షించారు.

కర్నాటక నుంచే మార్పు...

- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ-షాబాద్, షాద్‌నగర్

కర్నాటక నుంచే దేశంలో మార్పు మొదలైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం రంగారెడ్డి జిల్లా షాబాద్, కొందుర్గు మండలాల్లో కొనసాగింది. షాబాద్ మండల పరిధిలోని మరియాపురం గ్రామ శివారు వద్ద కర్నాటక ఎన్నికల ఫలితాలను ఫోన్‌లో చూశారు. కాంగ్రెస్ పార్టీ గెలవడంతో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి షాబాద్, కొందుర్గు మండలాల్లో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దు చేయడం అంటే ప్రతిపక్షాన్ని రద్దు చేయడమే అన్నారు. బీజేపీకి కర్నాటక ప్రజలు తగిని గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీమ్ భరత్, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
ఆదివారం
14 మే 2023
www.navatelangana.com



జోష్

YOUTH N YOUTH



ఈ రంగంలో పరిస్థితి ఘోరంగా ఉంటుంది. మన తాతలో, తండ్రులో ఎవరైనా ఇందులో ఉంటే ఇక్కడ నిలదొక్కుకోవడం చాలా సులభం. కానీ నాకు అలాంటి పరిస్థితి లేదు. మంచి ఎడ్యుకేషన్, నైపుణ్యం ఉండడంతో కార్పొరేట్ సంస్థల వాళ్ళు తీసుకుంటామని ముందుకొచ్చారు. కానీ నాకు అలాంటి చోట పని చేయడం

కార్పొరేట్ల వద్ద పని ఇష్టం లేదు

ఇష్టం లేదు. అందుకే గచ్చిబౌలిలో చిన్న హాస్పిటల్లో ఆర్థోపెడిక్ విభాగం తీసుకొని ప్రాక్టీస్ మొదలుపెట్టాను. అక్కడ చాలా చిన్న సెటప్ ఉండేది. మంచిగా ట్రీట్ చేయడం, ఆపరేషన్లు సక్సెస్ కావడంతో తొమ్మిది నెలల్లోనే హైటెక్ సిటీ మొత్తం మంచి గుర్తింపు వచ్చింది. అప్పుడు నేనే సొంతంగా చిన్న ఆస్పత్రి ప్రారంభిస్తే ఇంకొంత సేవ చేయొచ్చుకదా అనే ఆలోచన వచ్చింది. అలాంటి సమయంలోనే కాంటినెంటల్ హాస్పిటల్ వాళ్ళు పిలిచారు. వాళ్ళు ప్రతి విభాగంలో ఒక యంగ్ డాక్టర్లను ప్రోత్సహించేవారు. పైగా మిగిలిన హాస్పిటల్స్ కంటే చాలా తేడా ఉంటుంది. కార్పొరేట్ పద్ధతి అక్కడ ఉండదు. అందుకే వాళ్ళు పిలవడంతో వెంటనే వెళ్ళాను. ప్రస్తుతం అక్కడే చేస్తున్నాను.

అందరూ తాతముత్తాతల ఆస్తులకు మాత్రమే వారసులుగా ఉంటారు. అతి కొద్దిమంది మాత్రమే ఆ తాతల మంచితనాన్ని, మానవత్వాన్ని, అభ్యుదయాన్ని వారసత్వంగా స్వీకరిస్తారు. అలాంటి వారిలో మల్లు అరుణ్ ఒకరు. కేవలం పేరులోనే కాదు అతని రక్తంలో కూడా అభ్యుదయ భావాలు ఉన్నాయి. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి సేవా భావాలను అందిపుచ్చుకున్నాడు. వైద్యుడిగా పేదలకు తనకు చేతనైనంత సేవ చేస్తున్నాడు. తాతకు తగ్గ మనవడిగా, నాయనమ్మకు తగిన వారసుడిగా అభ్యుదయ భావాలతో ఎదుగుతున్న ఆ యువ డాక్టర్ పరిచయం నేటి జోష్‌లో...

చేతనైనంతగా..

వీటితో పాటు నా దగ్గరకు వచ్చే పేషంట్లకు కొంత అవగాహన కల్పిస్తుంటాను. ఉదాహరణకు ఆరోగ్య భద్రత అని ఉంటుంది. పోలీస్ డిపార్ట్ మెంట్‌లో పని చేసే కానిస్టేబుల్స్ కుటుంబాలకు ఏవైనా ప్రమాదాలు జరిగి మోకాళ్ళ మార్పిడి చేసుకోవల్సి వస్తే ఫ్రీగా చేసుకోవచ్చు. కానీ వాటి గురించి చాలా మందికి తెలియదు. వాటి గురించి చెబుతుంటాను. అలాగే హాస్పిట్‌లో అతి తక్కువ ఖర్చుతో మోకాళ్ళ మార్పిడి చేసుకునే కొన్ని స్కీమ్‌లు ఉంటాయి. అలాంటివి ఉన్నప్పుడు పేద వాళ్ళకు చెబుతుంటాను. ప్రస్తుతం నేను ఉన్న పరిస్థితుల్లో ఇంత వరకు చేయగలుగుతున్నాను.

క్యూబాను ఫాలో అవుతున్నా...

చిన్నప్పటి నుండి మనుషుల కోసం బతికిన కుటుంబం మాది. మా తాతయ్య మల్లు వెంకట నర్సింహారెడ్డి ఉమ్మడి నల్గొండలో మంచి పేరున్న కమ్యూనిస్టు నాయకుడు. మా నాయనమ్మ మల్లు స్వరాజ్యం. తన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. అన్యాయంపై సింహంలా గర్జించేది. చిన్నతనంలో వాళ్ళను చూస్తూ పెరిగిన నాకు వాళ్ళ భావాలు రావడం సహజం అనుకుంటాను. మా అమ్మ మల్లు లక్ష్మి, తను ప్రస్తుతం ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంది. నాన్న మల్లు నాగార్జునరెడ్డి. తను సూర్యాపేట సీపీ(ఐ)ఎం జిల్లా కార్యదర్శిగా బాధ్యలు చూస్తున్నారు. ఇలా కుటుంబం మొత్తం సమాజం కోసం పని చేసేవాళ్ళే.

మనం ఎక్కడ ఉన్నా మనలోని అభ్యుదయ భావాలు మాత్రం ఎక్కడి పోవు. పేదలకు ఏదో ఒక విధంగా సేవ చేయాలి అనే ఆలోచన ఎప్పుడూ నాలో ఉంది. తాతయ్య కోరిక కూడా అదే. కాకపోతే నేను ఒకటే అనుకున్నాను. నా చేతిలో ఉన్న వైద్యంతో నాకు సాధ్యమైనంత వరకు పేదలకు సేవ చేయాలి. విప్లవ దేశమైన క్యూబాలోనొక స్లోగన్ ఉండేది. వారానికి ఒకరోజు సమాజ సేవ చేయాలి అని.

క్యూబా స్లోగన్ ప్రభావంతో...

ప్రస్తుతం అదే అనుసరిస్తున్నాను. నేను పని చేసే హాస్పిటల్ తరఫున ప్రతి వారం ఉచిత క్యాంప్ ఉంటుంది. అలాగే ఎం.హెచ్ భవన్‌లో తాతయ్య పేరుతో నిర్వహిస్తున్న విన్.ఎన్ మెమోరియల్ క్లినిక్‌కి ఒక రోజు వస్తాను. అలాగే గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారానికి ఒకరోజు వెళ్ళి ఫ్రీ సర్వీస్ చేస్తున్నాను. ప్రస్తుతం నాకున్న అవకాశం మేరకు చేస్తున్నాను. భవిష్యత్‌లో నాకు మంచి అవకాశాలు వస్తే కచ్చితంగా సేవా కార్యక్రమాలు పెంచుతాను.



తాతయ్య సపోర్ట్‌తో...

తాతయ్య, నాయనమ్మ అయితే ఎన్నో త్యాగాలు చేశారు. తాతయ్యకు పేదలకు ఉచితం వైద్యం అందాలని బాగా కొరిక ఉండేది. ఎప్పుడూ దాని గురించే మాట్లాడుతుండేవాడు. నేను నల్గొండలోనే పుట్టి పెరిగాను. అక్కడ నా స్కూలింగ్ పూర్తి చేశాను. చిన్నతనంలో లెక్కలంటే నాకు బాగా ఇష్టం. కానీ తొమ్మిది, పదో తరగతిలో ఉన్నప్పుడు సైన్స్ అంటే ఇష్టం కలిగింది. ఇంటర్‌లో ఏ సబ్జెక్ట్ తీసుకోవాలో అయోమయంలో ఉన్నాను. అమ్మానాన్నకేమో ఎంపీసీ తీసుకుంటే త్వరగా సెటిల్ అవుతానని కోరిక. నాకేమో సైన్స్ ఇష్టం. అప్పుడు తాతయ్య "వాడికి సైన్స్ అంటే ఇష్టం అంటున్నాడు కదా! అదే చదవని... డాక్టర్స్ కూడా సమాజానికి చాలా అవసరం. తనకు నచ్చింది చదవని" అని నాకు సపోర్ట్ చేశాడు. అయితే నేను సైన్స్ తీసుకున్నా డాక్టర్ అవుతానో లేదా అప్పటికి నాకు తెలియదు.

మాట ఇచ్చాను...

అలా తాతయ్య సపోర్ట్‌తో 2004లో ఇంటర్ బైపీసీలో చేరాను. అయితే అదే ఏడాది తాతయ్య ఆరోగ్యం పాడై హాస్పిటల్లో చేరారు. కదలలేని, మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. అలా ఉన్న తాతయ్యను చూస్తే దుఖం ఆగలేదు. తాతయ్యకు తన మనవళ్ళు, మనవరాళ్ళల్లో ఎవరైనా డాక్టర్ కావాలని కోరిక ఉండేది. తన కోరిక నేను తీర్చాలని బెడ్‌పై ఉన్న తాతయ్యకు నేను డాక్టర్ అవుతానని మాట ఇచ్చాను. మాట్లాడలేని స్థితిలో ఉండి కూడా చాలా సంతోషంగా నావైపు చూసి మంచిది అన్నట్టు చెయ్యి ఊపి ప్రోత్సహించారు.





చదువంతా పూర్తి చేసుకుని...

ఇంటర్ తర్వాత ఎంసెట్ రాసి రెండు మార్కుల్లో ఫ్రీ సీట్ మిస్ అయ్యాను. తర్వాత లాంగ్ టర్మ్ తీసుకొని మన స్టేట్‌లో 700 ర్యాంక్ తెచ్చుకున్నాను. కర్నాటకలో అయితే 320 ర్యాంక్ వచ్చింది. మన స్టేట్‌లోనే చదువుకోవాలనే ఆలోచనతే నార్కెట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో చేరాను. తర్వాత మహబూబ్ నగర్‌లోని ఎస్వీఎస్ మెడికల్ కాలేజీలో ఆర్థోఫెడిక్ పీజీ చేశాను. గాంధీలో ఇంటన్‌షిప్ చేశాను. ఆ తర్వాత బెంగుళూరులో స్పోర్ట్స్ సర్జన్ కోర్సు చేసి అక్కడే ప్రాక్టీస్ కూడా చేశాను. అక్కడ పెద్ద పెద్ద క్రీడాకారులకు మోకాళ్ళకు సంబంధించిన ఆపరేషన్లు చేసేవాళ్ళం. తర్వాత బొంబేలో రోబోటిక్ నీల్, హిప్ రీప్లేస్‌మెంట్ పైన స్పెషల్ ట్రైనింగ్ తీసుకుని హైదరాబాద్ వచ్చాను.

ప్రభుత్వ ప్రోత్సాహం లేదు...

భారతదేశంలో వైద్యం అత్యంత ఖర్చుతో కూడుకు న్నది. వైద్యంలో క్వాలిటీ కావాలి, ఖర్చు తక్కువ ఉండాలి. అలా కావాలంటే యుకే లాగా ఎన్‌హెచ్ సిస్టమ్ మన దగ్గర కూడా రావాలి. అక్కడ వైద్యం మొత్తం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటుంది. అందుకే ఫ్రీ. మన ప్రభుత్వం కూడా ఇలా చేస్తే పేదలకు మంచి వైద్యం అందించవచ్చు. కానీ మన దేశంలో అది సాధ్యం కావడం లేదు. లక్షలు ఖర్చు పెట్టి చదువుకున్నవాళ్ళు డబ్బు ఎలా సంపాదించాలా అనే ఆలోచిస్తారు. అలాగే చిన్న నర్సింగ్ హోం పెట్టుకుందా మన్నా చాలా కష్టం. రాయితీలు ఇవ్వరు. అదే సాఫ్ట్‌వేర్ కంపెనీలకు మాత్రం పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తారు. కానీ హాస్పిటల్ పెట్టాలంటే మాత్రం పర్మిషన్ ఇవ్వడానికి కష్టం. వైద్యం విషయంలో ప్రభుత్వ ప్రోత్సహం లేదు. అందుకే వైద్యం మన దగ్గర వ్యాపారంగా మారిపోయింది.

జీవన విధానం మారాలి

ప్రస్తుతం యువత జీవన విధానం బాగా మారిపోయింది. విపరీత మైన ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షల ఒత్తిడి ఒక భాగం అయితే, తొందరగా డబ్బు సంపాదించాలి అనే ఆలోచనతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో మందు, సిగరెట్ లాంటి చెడు అవాట్లకు లోనవుతున్నారు. ఆరోగ్యం గురించి పూర్తిగా మర్చిపోతున్నారు. నగరాలు, పట్టణాల్లోనే కాదు గ్రామాల్లో కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. అలాగే యువత చెడు మార్గం పట్టకుండా స్కూల్ స్థాయి నుండి మోరల్ సైన్స్ క్లాసులు చెప్పాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. మరో విషయం ఏమిటంటే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో గంటల కొద్దీ కంప్యూటర్ల ముందు కూర్చోవడం వల్ల చాలా మంది నడుం నొప్పి, వెన్ను నొప్పితో బాధపడుతున్నారు. వీళ్ళంతా రోజూ ఉదయం వ్యాయామం చేస్తూ, మంచి జీవిన విధానాన్ని అలవర్చు కుంటే ఆరోగ్యంగా ఉండొచ్చు.

- సలీమా

ఫొటోలు : పి.వెంకటేశ్

అమ్మ ఐదడుగుల ఆరు అంగుళాల కవిత్వం

అదేంటో అమ్మ మీద ఎంత రాసినా
ఎంతో కొంతే రాసినట్టు ఉంటుంది...

గుండె తడి చేయమని
పొడి బారుతూ ఉంటుంది.....

రొండంగుళాలు అటో ఇటో
అమ్మ ఐదడుగుల ఆరు అంగుళాల
కవిత్వం అనిపిస్తుంది.....

అమ్మ పది కూడా పాస్ అవ్వలేదు అనుకుంటావేమో
ప్రపంచం మొత్తంలో అమ్మే అతి పెద్ద క్వాలిఫికేషన్...



నీకు తెలిసిన రహస్యమొకటి ఎక్కడుందో చెప్పమంటే
అమ్మ ఆఖరున అన్నం తినటంలో ఉందని చెబుతాను ..

అమ్మ నాన్నతో సమానం అంటే నేనొప్పకోను
నాన్న అమ్మతో సమానం అన్నా నేనొప్పకోను
ఈ ఇద్దరూ బిడ్డ ఒంటి చక్రపు రైలును మోసే
సరళ రేఖీయ పట్టాలు .....

అమ్మంటే నెలలో 30 రోజుల కష్టమే కాదు
మూడురోజుల రక్తస్రావం కూడా...

అమ్మ ఇంటి నదిలో తనని తాను నాటుకున్న
కదలకుండా ప్రవహించే చెట్టు

ఊట బావిని కళ్ళల్లో కూరుకున్న అమ్మ
నువ్వో నేనో చూస్తున్నప్పుడు
ఉబుకుతున్న కన్నీళ్ళని గొంతులోకి మింగటం
ఎక్కడ నేర్చుకుందంటావ్ ?

మీ అమ్మ జీవుతమంతా ఏం చేసింది అంటే
నేను మాత్రం మా ఇంటిని ప్రేమించిందనీ,
ప్రేమించటం అమ్మ సహజ లక్షణం అనీ చెప్తాను..

- సిద్దార్థ కట్ట

అమ్మ

కవి రాయలేని కావ్యం
వర్ణనతో చూపలేని భావం
దైవత్వం కలబోసిన రూపం
ప్రేమామృతాన్ని పంచేతత్వం
అమ్మంటే ఓ దైవం
సృష్టికే పరమార్థం!!..


రక్తాన్ని పంచిన దైవం
బిడ్డ ఆనందమే తన తీరం
పిల్లల క్షేమమే తన స్మరణం
నీడై కాచెను ప్రతి తరుణం
అమ్మంటే ఓ దైవం
సృష్టికే పరమార్థం!!..

సమిధై రగిలేను నిరంతరం
బిడ్డ ఎదుగుదలే తన హృదయాంతర సంబరం
మాతృమూర్తి ప్రేమే విశ్వంతరం
తానే ఈ జగముకు సర్వాంతరం
అమ్మంటే ఓ దైవం
సృష్టి పరమార్థం!!

- గుండా జగదీశ్

(మాతృ దినోత్సవ శుభాకాంక్షలు...)

మట్టిచెదల పుట్ట



దినాం బురద మింగి బురద గక్కే
మట్టి సెదల పుట్టవాడు...

పొలంలో ఎత్తుపల్లాలను సాపుజేయా
చీలుకపోయిన రెండుపాయల గొర్రు వాడు
తెల్లారకముందే గోసివోసి గద్యంగట్టి
తిమ్మిర్లెక్కే సన్నీళ్లతో తానం జేసిన
పచ్చిమన్ను ముద్ద వాడు...

ఇంటిల్లిపాదిని ముందుకు నడుపే
బండినొగ ఇర్సుజారి ఎన్నుబడిపోయింది
వొదులైన తాళ్లను గుంజి బిగ్గిత
బిగించాడానికి
నరంలా సాగిన వానపాము వాడు...

ఒకటి గొట్టే రాతిరికి మడలుదిప్ప
వొరంగట్లపొడితి తిరుగులాడుతూ
సేనంతా పారాజూసే,
మిణుగురు పురుగుల కాంతి వాడు...

దినదినంకి సన్నవడ్తూ
ఆకలి బతుకులను ఈడుస్తున్న
ఎండుటాకుల చప్పుడు వాడు...

తెల్లారు జాముల్లో

పచ్చని పంటపొలాలపై వాలే
తెల్లరంగు పిట్ట వాడు...

పదిమందికి తిండివెట్ట
నల్లర్యాగడి మడుల్లో పూసే
బోనపు కుండల మెతుకు వాడు...

ఆకలి మంటలను ఆర్ప
నిత్యం వొళ్ళంత తడుపుకునే
సెమట సుక్కల వాగు వాడు...

వాడు రుమాలు కడితే
దేశం మొత్తం పొత్తిజుడుతది
వాడు నాగలి ఎత్తితే
ఎట్లాంటి ఎడ్డైనా మెడలు వంచుతాయి.

- తలారి సతీష్ కుమార్